

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 187

బుధవారం 27-9-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

heLU hyderabad

Lulu, Hyderabad @ Kukatpally



Open to Public: Today, 3 PM onwards

LuLu HYPERMARKET | LuLu Connect | LuLu MALL World of Happiness Hyderabad

LuLu FASHION STORE MEN / WOMEN / KIDS | Funtura

Welcome to a World of Happiness in Hyderabad

cinépolis, Apple, Levi's, GAP, TONI&GUY HAIRDRESSING, NYKAA ON TREND, TISSOT, PUMA

MEENA BAZAAR, TRENDS WOMAN, AVANTRA by TRENDS, TITAN, fastrack, KIAASA, CLAYSTONES, MOCHI SHOES & ACCESSORIES

LINEN CLUB, VisionExpress, BEAUTY & BEYOND FOR YOU, SWISS TIME HOUSE, Bata, hp, portico NEW YORK, Ganga Spa

SWA DIAMONDS, SUGAR, MY OP, spykar YOUNG & RESTLESS, INDIAN TERRAIN, mufti, KILLER, WROGN

GO COLORS! happy legs, becoming, TWIN BIRDS, vismay, PEORA, SAMSUNG, NEEMAN'S, Bombay Dyeing

MOBILE CARE, robotouch, MARKET 99, KLUB, FLOCK, Hy 5 Kids, Toyberry, PARAKKAT JEWELS

CROSSWORD, IM Impulse, JAIPURI, LAVIE BAGS & SHOES

Treat yourself to the finest foods and flavours


STARBUCKS, KFC, Pizza Hut, BARBEQUE HOLIC Biggest Barbeque Buffet, KRITUNGA, Chicking, HOTTEY SMOKEY Shakes, Amritsari Express

BITES 4, KHAAN SAAB EXPRESS, SUBWAY, FALOODA NATION, PIZZA RICOTTA, Club Sulaimani, GOPIZZA, ROLLS KING

ALBAIK, WOW! momo, WOW! CHINA, JUICE O JUICE, Cookie Man Fresh Baked Australian Cookies, Popsy, Tupperware, THE MAN COMPANY

BUBBLE BAE, belgian fries, TURQUOISE, BASKIN ROBBINS, HOUSE OF CANDY, THE COFFEE CUP, pabrai's

BOMBAY KULFI, KULFI SHOP, Bharatheeyam, Alaknanda


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 187

బుధవారం 27-9-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



41 ఏళ్ల తర్వాత...

- ఆసియా క్రీడల ఈక్వెస్ట్రియన్ క్రీడాంశంలో భారత్‌కు స్వర్ణ పతకం
- సంచలనం సృష్టించిన విపుల్ హృదయ్, అనూష్, దివ్యాకృతి, సుదీప్తి బృందం
- సెయిలింగ్‌లో రెండు పతకాలు

12లో



మన దౌత్యం కొత్త శిఖరాలకు..

గత నెల రోజుల్లో భారత దౌత్య ప్రతిభ నూతన శిఖరాలను తాకిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

- వివరాలు 6లో



వచ్చేసారి ఊరుకోం..

దేశవ్యాప్తంగా న్యాయమూర్తుల నియామకాల్లో జాప్యంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది.

- వివరాలు 6లో



ఉగ్రవాదంపై మెతక వైఖరా?

ఖలిస్తానీ ఉగ్రవాదం విషయంలో మెతకగా వ్యవహరిస్తున్న కెనడాకు ఐరాస వేదికగా భారత్ చురకలంటించింది.

- వివరాలు 6లో



మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

జూలై నుంచి కనిపించకుండాపోయిన ఇద్దరు విద్యార్థులు హత్యకు గురయ్యారని తెలియడంతో మణిపూర్‌లో ఉద్రిక్తత నెలకొంది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

సీఎంకు వారం రోజులుగా జ్వరం: కేటీఆర్ ట్వీట్



సాక్షి, హైదరాబాద్: సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వారం రోజులుగా వైరల్ జ్వరం, దగ్గుతో బాధపడుతున్నట్టు మంత్రి కేటీఆర్ తెలిపారు. ఆయన ఈ మేరకు మంగళవారం ట్వీట్ చేస్తూ, కేసీఆర్ ఇంటివద్ద చికిత్స పొందుతున్నారని, వైద్యుల బృందం వైద్య సేవలు అందిస్తోందని, త్వరలోనే సాధారణ స్థితికి చేరుకుంటారని వైద్యులు తెలిపినట్టు వెల్లడించారు.

సికింద్రాబాద్-వైజాగ్ మధ్య మరో వందేభారత్!?



అత్యధిక ఆక్యుపెన్సీ రేషియో ఉన్న మార్గాల జాబితాలో సికింద్రాబాద్- విశాఖపట్నం ముందు వరుసలో ఉండటంతో ఈ మార్గంలో రెండో వందేభారత్ రైలు నడిపే విషయాన్ని రైల్వే శాఖ పరిశీలిస్తున్నట్టు సమాచారం.

- వివరాలు 14లో

కాంగ్రెస్ బీసీ నేతల చలో ఢిల్లీ



తెలంగాణ కాంగ్రెస్‌లోని బీసీ నాయకులు ఢిల్లీ బయలుదేరారు. వీరంతా బుధ లేదా గురువారాల్లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలవనున్నారని సమాచారం.

- వివరాలు 2లో

'బోనస్' బొనాంజా



సింగరేణి ఉద్యోగులకు లాభాల పంట పండింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన రూ.2,222 కోట్ల లాభాల్లో 32 శాతం..అంటే రూ.711 కోట్లు సంస్థ ఉద్యోగులకు బోనస్‌గా చెల్లించనున్నారు.

- వివరాలు 5లో

కాంగ్రెస్‌లోకి సోయం బాపూరావు?

- ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ పార్టీ మారనున్నట్లు ప్రచారం
- అవన్నీ ఊహాగానాలేనంటూ కొట్టిపారేసిన సోయం

2లో



మోదీ ఏజెంట్లుగా.. గవర్నర్లు

మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతున్నారు

మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో దాసోజు, కుర్ర సత్యనారాయణ

గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వాలను పని చేయనీయడం లేదు

ప్రభుత్వం ఇద్దర్ని ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తే రాజకీయ పార్టీలో ఉన్నారని గవర్నర్ తమిళిసై తిరస్కరించారు

- మీరు బీజేపీ నాయకురాలిగా పని చేయడం లేదా?..
- తమిళిసై సర్కారియా కమిషన్ సూచనలు తుంగలో తొక్కి తెలంగాణ గవర్నర్‌గా నియమితులయ్యారు
- గవర్నర్ పదవికి ఆమె అన్‌ఫిట్ అంటూ కేటీఆర్ మండిపాటు
- మోదీ అత్యంత అవినీతి ప్రధానమంత్రి అని విమర్శ

సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుంటే.. గవర్నర్లు ఆయన ఏజెంట్లుగా ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు తీవ్రంగా విమర్శించారు. అనేక ఉద్యమాల్లో పాల్గొన్న దాసోజు శ్రవణ్, జాతీయ స్థాయిలో ట్రేడ్ యూనియన్ నాయకుడిగా పనిచేసిన కుర్ర సత్యనారాయణను రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తే, వారు రాజకీయ పార్టీలో ఉన్నారంటూ గవర్నర్ తమిళిసై తిరస్కరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

ఎవరు అన్ ఫిట్ అనేది ప్రజా క్షేత్రంలో తేల్చుకుంటాం..

'రాజకీయాల్లో ఉన్న వారు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా అనర్హులన్న తమిళిసై.. తమిళనాడు బీజేపీ అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో సర్కారియా కమిషన్ సూచనలు తుంగలో తొక్కి తెలంగాణ గవర్నర్‌గా నియమితులయ్యారు. తెలంగాణ ప్రభుత్వం నామినేట్ చేసిన అభ్యర్థులు అన్ ఫిట్ అని

మిగతా 2వ పేజీలో ▶

29న రాష్ట్ర కేబినెట్ భేటీ?

ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం

- ఎన్నికల వ్యూహాలపై విస్తృత చర్చ!
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై మళ్లీ నిర్ణయానికి అవకాశం

2లో

ఏపీ పంచాయితీ హైదరాబాద్‌లోనా?

విజయవాడ, రాజమండ్రి, అమరావతి లేవా?

అక్కడ ఏమీ చేయకుండా ఇక్కడ రాద్ధాంతం, రాజకీయం చేయడం ఏంటి?

- జగన్, లోకేశ్, పవన్ అందరూ నాకు మిత్రులే.. ఆ గొడవల్లో మేం తలదూర్చం
- మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు

2లో



వహిదా రెహమాన్‌కు దాదాసాహెబ్ ఫాల్కే

సినిమా రంగంలో విశేష సేవలకుగాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించే సర్వోన్నత పురస్కారం 'దాదాసాహెబ్ ఫాల్కే' 2021 సంవత్సరానికి సుప్రసిద్ధ నటి వహిదా రెహమాన్‌ను వరించింది. ఈ వార్త విన్న వెంటనే వహిదా రెహమాన్ 'దేవ్ ఆనంద్ శతజయంతి నాడు ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. నిజానికి ఈ అవార్డు ఆయనకు అందాలి. నాకు అందింది' అని సంతోషం వ్యక్తం చేశారు.



11లో

చౌద్‌వీ కా చాంద్ హో

అభ్యర్థుల జీవితాలతో ఆటలా!

టీఎస్‌పీఎస్సీ తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

- రెండోసారి గ్రూప్-1 ప్రిలిమ్స్‌లోనూ నిర్లక్ష్యం ఎందుకు?
- ఈ పరీక్ష కోసం ఏళ్లుగా లక్షల మంది ఎదురుచూస్తున్నారు
- ఉద్యోగాల్లేక నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు
- మీ నిబంధనలను మీరు కూడా పాటించకుంటే ఎలా?
- నేటికి విచారణ వాయిదావేసిన డివిజన్ బెంచ్
- నిబంధనలు మార్చే అధికారం తమకుందన్న కమిషన్



సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 ఉద్యోగాల కోసం ఏళ్లుగా లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని, వారి జీవితాలతో ఎందుకు ఆటలాడుకుంటున్నారని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ని హైకోర్టు ప్రశ్నించింది. నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు కూడా చూశామని, ఎన్నాళ్లగానో ఎదురుచూస్తున్న ఉద్యోగాల భర్తీ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా చేయలేకపోవడమేంటని నిలదీసింది. ప్రిలిమ్స్‌కు హాజరైన అభ్యర్థుల బయోమెట్రిక్ ఎందుకు తీసుకోలేదో చెప్పాలంటూ టీఎస్‌పీఎస్సీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలను అమలు చేయలేనప్పుడు అనుబంధ నోటిఫికేషన్ ఇవ్వాలి కదా.. ఒకసారి గ్రూప్-1 ప్రశ్నపత్రం లీకైన నేపథ్యంలో పరీక్షను మళ్లీ నిర్వహించేటప్పుడు పకడ్బందీ చర్యలు చేపట్టాలి కదా అని ప్రశ్నించింది. జూన్ 11న నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు చేస్తూ ఈ నెల 23న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ టీఎస్‌పీఎస్సీ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించింది. ఈ అప్పీల్ పిటిషన్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం వాదనలు వింది.

ఎన్ని పిటిషన్లు వచ్చినా కమిషన్‌కు అవకాశమిచ్చాం

గ్రూప్-4కు బయోమెట్రిక్ ఉండదని అనుబంధ నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు.. గ్రూప్-1కు ఎందుకు ఇవ్వలేదని డివిజన్ బెంచ్ టీఎస్‌పీఎస్సీని ప్రశ్నించింది. పేపర్ లీక్ తర్వాత.. దర్యాప్తు తేలే వరకు పరీక్ష ఆపాలని ఎన్ని పిటిషన్లు వచ్చినా ప్రిలిమ్స్ నిర్వహించేందుకు కమిషన్‌కు అవకాశం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసింది. పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్యలో వ్యత్యాసం ఒకట్రెండు కాదని, మొత్తం నియామక పోస్టు (503)ల్లో సగానికిపైగా (258) ఉందని పేర్కొంది. నిజంగా అక్రమాలు జరిగి ఉంటే.. లక్షల మంది అభ్యర్థులు పోటీ పడేది 245 పోస్టులకే

మిగతా 3వ పేజీలో ▶

కమలంలో కాక!

అసంతృప్త నేతలు రాజీనామాకు సిద్ధమైనట్టు పార్టీ వర్గాల్లో చర్చ

తాజాగా విజయశాంతి నివాసంలో భేటీ • హాజరైన వివేక్, కోమటిరెడ్డి, కొండా, రవీందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్ : బీజేపీ అసంతృప్త నేతలు త్వరలోనే ఆ పార్టీ వీడాలనే తుది నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. అక్టోబర్ 1న ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు వస్తున్నారు. అంతకుముందే పార్టీకి రాజీనామా చేయాలన్న విషయంలో అసంతృప్త నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారన్న చర్చ జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రాజకీయ సమీకరణలు, పార్టీ పరిస్థితి, జాతీయ నాయకత్వం అనుసరిస్తున్న వైఖరి తదితర అంశాలన్నీ పరిగణనలోకి తీసుకున్నాక, ఇక పార్టీలో కొనసాగే పరిస్థితులు లేవనే అభిప్రాయానికి వారు వచ్చినట్టుగా చెబుతున్నారు. అయితే ఎవరెవరు ఏ పార్టీలోకి వెళతారో అన్న దానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. కొందరు బీఆర్‌ఎస్ వైపు.. మరికొందరు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు.

బీఆర్‌ఎస్-బీజేపీ లోపాయికారి దోస్తీపై..

బీఆర్‌ఎస్-బీజేపీల మధ్య లోపాయికారి దోస్తీపై ప్రజల్లోనే అనుమానాలున్నాయని.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ విషయంలో తాత్సారం చేయడం, కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతిపై విచారణ కమిటీ, కేసీఆర్ సర్కార్‌పై వచ్చిన

మిగతా 10వ పేజీలో ▶

భేటీలే..భేటీలు



విజయశాంతి



విశ్వేశ్వర్‌రెడ్డి



రవీందర్‌రెడ్డి



రాజగోపాల్‌రెడ్డి

మంగళవారం విజయశాంతి నివాసంలో జరిగిన సమావేశానికి జాతీయ కార్యవర్గ సభ్యులు జి.వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మాజీఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, తదితరులు హాజరైనట్టు సమాచారం. నవంబర్ 20వ తేదీ దాకా ఢిల్లీ లిక్కర్ స్కాంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎలాంటి సమన్లు ఇవ్వరాదని సుప్రీంకోర్టు ఆదేశించిన రోజే ఈ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. గడిచిన వారంరోజుల్లోనే మూడునాలుగు పర్యాయాలు సమావేశమైన వీరు తాజాగా మరోసారి భేటీ కావడంపై కూడా చర్చ జరుగుతోంది. పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా ఈటల రాజేందర్‌కు జాతీయ, రాష్ట్రనాయకత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంపైనా ఈ నేతలు అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. ఈటలకు ఇచ్చిన గుర్తింపు, ప్రాధాన్యం తమకెందుకు ఇవ్వడం లేదని, అందుకే బీజేపీలో కొనసాగాలా లేక కాంగ్రెస్‌లో చేరాలా అన్న అంశాలపై తమ శ్రేయోభిలాషులు, కార్యకర్తలతో చర్చించనున్నట్టు తెలుస్తోంది.



చంద్రబాబును ఎప్పటికీ నమ్మొద్దు

ఏపీ ప్రజలకు మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ విజ్ఞప్తి

- ఆయన జైలుకు ఎందుకు వెళ్లారో, ఏమేం చేశారో అందరికీ తెలుసని వ్యాఖ్య
- జగన్ మంచి పరిపాలన అందిస్తున్నారంటూ కితాబు

సాక్షి, హైదరాబాద్: 'టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు జైల్లో ప్రశాంతంగా కూర్చున్నారు. ఆయన జైలుకు ఎందుకు వెళ్లారో, ఏమేం చేశారో అందరికీ తెలుసు. చంద్రబాబును నమ్మలేం. ఎప్పటికీ నమ్మరాదు..' అంటూ ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఏపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని దారుస్సలాంలో నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఏపీ పరిస్థితులపై ఒవైసీ మాట్లాడారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రెండే ఆప్షన్లు ఉన్నాయని, ఒకటి టీడీపీ కాగా

మిగతా 2వ పేజీలో ▶

గ్యాదరి కిశోర్ పిటిషన్ మరోసారి కొట్టివేత



→ తుంగతుర్తి శాసనసభ్యుడు గ్యాదరి కిశోర్ దాఖలు చేసిన పిటిషన్ (ఐఏ)ను హైకోర్టు మరోసారి కొట్టేసింది. తన ఎన్నిక చెల్లదంటూ అదే నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అద్దంకి దయాకర్ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌ను కొట్టేయాలని ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ ఐఏ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎం.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. తదుపరి విచారణను అక్టోబర్ 3కు వాయిదా వేశారు.

వివరాలు 10లో



కుమ్మరి సారెపై కుండ తయారు చేస్తున్న హరీశ్

కేసీఆర్ అంటేనే గ్యారంటీ

కాంగ్రెస్ గ్యారంటీ కార్డులు పనిచేయవు: మంత్రి హరీశ్ రావు

2లో

ఇదండీ జగత్



మనకు కాదులే కంగారుపడకు!

ఎమ్మెల్సీ కవితకు ఊరట

- మద్యం కేసు నవంబరు 20కి వాయిదా
- అప్పటి వరకు సమన్లు ఇవ్వొద్దని ఈడీకి సుప్రీంకోర్టు ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. 'ఢిల్లీ మద్యం' కుంభకోణంలో ఈడీ సమన్లు జారీ చేయగా, దీనిని సవాల్ చేస్తూ కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ సంజయ్ కిషన్‌కౌల్, జస్టిస్ సుధాంశు ధులియాలతో కూడిన ధర్మాసనం విచారించింది. నళిని చిదంబరానికి రక్షణ కల్పించిన విధంగానే ఎమ్మెల్సీ కవితపైనా ఈడీ బలవంతపు చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కవిత తరఫు సీనియర్ న్యాయవాది విక్రమ్‌చౌదరి మరోసారి ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్

మిగతా 10వ పేజీలో ▶

ఇక టాప్ గేర్..!

ఆరు నెలలు కీలకం.. సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌ఛార్జ్‌లకు సీఎం జగన్ దిశానిర్దేశం

ఇక మనం గేర్ మార్చాల్సిన సమయం ఆసన్నమైంది



వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌చార్జిల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- ఇప్పటివరకూ ఒక ఎత్తు.. ఎన్నికలకు సన్నద్ధమయ్యే తీరు మరొక ఎత్తు
- వచ్చే ఆరు నెలల్లో ఎలా పనిచేస్తామన్నది చాలా ముఖ్యమైన విషయం
- ఇది మనసులో పెట్టుకుని ప్రతి అడుగు ముందుకు వేయండి
- 175కు 175 స్థానాల్లో గెలుపు అసాధ్యమేమీ కాదు.. సుసాధ్యమే
- క్షేత్ర స్థాయిలో మనకు పూర్తి అనుకూలంగా పరిస్థితులు
- అందుకే ఒంటరిగా పోటీ చేయలేక, పొత్తులు పెట్టుకుంటున్న విపక్షాలు

- వివరాలు 10లో



ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుతో భూ దోపిడీ

లింగమనేనితో క్విడ్‌ప్రోకో.. హెరిటేజ్‌కు భూముల కానుక

హెరిటేజ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్‌లో డైరెక్టర్ హోదాలో తీర్మానం

లోకేశ్‌ను నిందితుడిగా చేరుస్తూ కోర్టులో సీఐడీ మెమో దాఖలు

లోకేశ్ పేరిట హెరిటేజ్ ఫుడ్స్‌లో 23,66,400 షేర్లు

సాక్షి, అమరావతి: మాజీ సీఎం చంద్రబాబు సహకార డెయిరీలను దెబ్బతీసి తమ కుటుంబ సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ వ్యాపారం, ఆస్తులను అమాంతం పెంచగా ఆయన తనయుడు లోకేశ్ రాజధానిలో ఇన్నర్ రింగ్ రోడ్డు(ఐఆర్‌ఆర్) అలైన్‌మెంట్ ఖరారులో అక్రమాలతో హెరిటేజ్ ఫుడ్స్ కోసం భూములను కొల్లగొట్టారు. తమ బినామీ, సన్నిహితుడు లింగమనేని రమేశ్ కుటుంబంతో క్విడ్‌ప్రోకోకు పాల్పడి భారీ భూదోపిడీకి తెగబడటంలో చంద్రబాబు, లోకేశ్ చక్కటి సమన్వయం కనబరిచారు. క్విడ్ ప్రోకో కింద చంద్రబాబు కరకట్ట నివాసాన్ని తీసుకోగా హెరిటేజ్ ఫుడ్స్ డైరెక్టర్ హోదాలో లోకేశ్ భూములను కొల్లగొట్టారు. ఈ అవినీతి

మిగతా 10వ పేజీలో ▶

క్లుప్తంగా...

మీ వెంటే మేము

ఎమ్మెల్సీ కసిరెడ్డికి మద్దతుదారుల బాసట.. 30న కాంగ్రెస్‌లో చేరే అవకాశం!



ఆమనగల్లు: ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బీఆర్‌ఎస్ వీడేందుకు సిద్ధమయ్యారన్న వార్తల నేపథ్యంలో ఆయన అభిమానులు, అనుచరులు మద్దతు తెలిపారు. మీ వెంటే మేము అంటూ ధైర్యం చెప్పారు. మంగళ వారం హైదరాబాద్‌లోని కసిరెడ్డి నివాసానికి పలువురు నేతలు వెళ్లి కలిశారు. ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఈ సందర్భంగా కొంతమంది అనుచ రులు ఎమ్మెల్సీ కార్యాలయంలోని బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలను తొలగించారు. బీఆర్‌ఎస్ నుంచి కల్వకుర్తి టికెట్ కసిరెడ్డి ఆశించగా, సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మళ్లీ అవకాశం ఇచ్చారు. దీంతో అనుచరులు సైతం ఒత్తిడి చేస్తుండటం తో ఈనెల 30న హస్తం గూటికి చేరేందుకు కసిరెడ్డి రెడీ అవుతున్నారు. రాహుల్‌తో మాట్లాడించినట్టు సమాచారం.

కేటీఆర్‌కు ధన్యవాదాలు

మంత్రి కేటీఆర్‌ను ప్రగతిభవన్‌లో సోమవారం కసిరెడ్డి కలిసి కొంత ఆవేదనకు లోనైనట్టు సమాచారం. పార్టీలో తగిన గుర్తింపుతోపాటు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిందుకు కృతజ్ఞతలు చెప్పి.. పరోక్షంగా పార్టీ వీడుతున్నట్టు సంకేతాలు ఇచ్చినట్టు తెలిసింది. దీనిపై స్పందించిన కేటీఆర్ తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దు.. ఒకటి రెండు రోజులలో సీఎంతో మాట్లాడుతానని సూచించినట్టు తెలిసింది.

'టికెట్ రాకపోవడం నా అదృష్టం'

ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్



వైరా: వచ్చే ఎన్నికల్లో వైరా నుంచి టికెట్ రాకపోవడం తన అదృష్టమని, ఎమ్మెల్యే సీటు తనకు ఎండుగడ్డితో సమానమని ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా వైరాలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టికెట్ రాకపోయినా సంతోషంగానే ఉన్నానన్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయమే శిరోధార్యమని, ఆయన నిర్ణయం మేరకు నడుచుకుంటానని తెలిపారు.

త్వరలో బీఆర్‌ఎస్‌కు రాజీనామా

ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు



తలమడుగు: త్వరలో బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు ప్రకటించారు. ఆయన మంగళవారం రుయ్యాడి గ్రామంలో గణేశ్ మండపం వద్ద, హస్నేస్ హస్నేస్ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీకి త్వరలోనే రాజీనామా చేయనున్నట్లు వెల్లడించారు. తనపై కొందరు గ్రూపులు కట్టి అధిష్టానానికి తప్పుడు నివే దికలు పంపించారని ఆరోపించారు. గ్రామ పర్యటన సమయంలో తనకు అధిష్టానం నుంచి ఫోన్ రాగా.. రాజీనామాకే కట్టుబడి ఉంటానని స్పష్టం చేశానని బాపూరావు వెల్లడించారు.

'సొమ్ము దోచుకోవడంలో ఫిట్.. అభివృద్ధిలో అన్‌ఫిట్'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజల సొమ్మును దోచుకోవడంలో కల్వకుంట్ల కుటుంబం ఫిట్, రాష్ట్రాభివృద్ధిలో మాత్రం అన్ ఫిట్ అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మండిపడ్డారు. గవర్నర్‌గా తమిళిసై సౌందరరాజన్ అన్‌ఫిట్ అని మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఘాటుగా స్పందించారు. సీఎం కుమారుడు కేటీఆర్ నోటికి వచ్చినట్లు, మహిళా గవర్నర్ అని కూడా చూడకుండా మాట్లాడటం వారి దొరతనానికి నిదర్శనమని ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. 140 కోట్ల ప్రజల గొంతుకగా ఉన్న మోదీని అనర్హుడు అని కేటీఆర్ వ్యాఖ్యానించడమంటే, వారి నరనరాల్లో బడుగు బలహీనవర్గాలపై ఎంత అక్కసు ఉందో స్పష్టమవుతోందని అరుణ వ్యాఖ్యానించారు.

చంద్రబాబును ఎప్పటికీ నమ్మొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

రెండోది జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ వైసీపీ అని చెప్పారు. ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్వాలేదని, మంచి పాలన అందిస్తున్నారని కితాబిచ్చారు. కానీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును మాత్రం నమ్మలేమని, ప్రజలు కూడా ఆయన్ను ఎప్పుడూ నమ్మొద్దంటూ సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మజ్లిస్ పార్టీ పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తాను జిందా తిలిస్మాత్‌ను కాదని, అన్ని ప్రాంతాల్లోనూ పర్యటించలేనని, స్థానికంగా పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు కృషి చేయాలని ఒవైసీ పిలుపునిచ్చారు.

మోదీ ఏజెంట్లుగా.. గవర్నర్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఆమె అంటున్నారు. ప్రధాని మోదీ లేదా గవర్నర్ తమిళిసై.. ఎవరు అన్ ఫిట్ అనేది ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటాం. దేశంలో అందరికంటే అన్ ఫిట్ మంత్రి కిషన్‌రెడ్డి. గవర్నర్ పదవికి తమిళిసై అన్ ఫిట్. ఇద్దరు బలహీనవర్గాల వారిని మండలిలోకి తెస్తే మీకేం బాధ? వారికి రాజకీయ పార్టీతో సంబంధం ఉంటే తప్పేంటి? మీకు రాజకీయ పార్టీతో సంబంధం లేదా? గవర్నర్‌గా ఉంటూ బీజేపీ నాయకురాలిగా పని చేయడం లేదా? మీకు వర్తించనిది ఇతరులకు ఎలా వర్తిస్తుంది?..' అంటూ కేటీఆర్ నిలదీశారు.

పైనుంచి అందిన ఆదేశాల మేరకే..

'బీజేపీ నేతలు జ్యోతిరాదిత్య, రంజన్ గగోయ్ రాజ్యసభ సభ్యులుగా నియమితులయ్యారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆ పార్టీ నేతలు పలువురు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలు అయ్యారు. కానీ తెలంగాణలో రాష్ట్ర మంత్రివర్గం సిఫారసు చేసిన ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను పైనుంచి అందిన ఆదేశాల మేరకు గవర్నర్ తిరస్కరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలకు బదులు మోదీ ఏజెంట్లదే పెత్తనమైతే పరిస్థితి ఏంటి? గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వాలను పని చేయనీయడం లేదు. వలస పాలనకు చిహ్నమైన గవర్నర్ పదవి ఇంకా అవసరమా? నామినేటెడ్ ఎమ్మెల్సీల విషయంలో సాధ్యమైన మార్గాలను అన్వేషిస్తాం. గవర్నర్ కోరిన డాక్యుమెంటరీ ఎవిడెన్స్‌తో మళ్లీ పంపుతాం..' అని చెప్పారు.

తెలంగాణపై ప్రధాని మోదీ విషం

'ఎన్‌డీఏ కూటమిలో భాగస్వామి అయిన బీజేపీ తన డీఎన్‌ఏతో పాటు నరనరాన విషం నింపుకుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవమానిస్తూ ఆత్మగౌరవం దెబ్బతీసేలా ప్రధాని మోదీ విషం చిమ్ముతున్నారు. పార్లమెంటుతో పాటు బహిరంగ సభ వేదికలపై తెలంగాణ పుట్టుక, అస్తిత్వాన్ని అగౌరవ పరుస్తున్నారు. అమృత్‌కాల్ సమావేశాల్లో 'తల్లిని చంపి బిడ్డను వేరు చేశారు' అంటూ మోదీ అజ్ఞానంతో చేసిన విషపూరిత వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల త్యాగాన్ని, ఉద్యమాన్ని కించపరిచేలా ఉన్నాయి. రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి పుట్టగతులు ఉండవు. ప్రధాని క్షమాపణ చెప్పాలి..' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

పాలమూరులో పాప పరిహారం చేసుకోవాలి

'దేశంలో అత్యంత అవినీతి ప్రధాని మోదీ. అక్టోబర్ 1న పాలమూరుకు వస్తున్నారు. మోదీకి అక్కడ కాలు పెట్టే నైతిక హక్కు లేదు. ఇక్కడి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వకుండా ఇతర రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు ఇచ్చారు. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి ఉన్న 811 టీఎంసీల కేటాయింపుల్లో తెలంగాణకు 575 టీఎంసీలు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న డిమాండ్‌ను ఆమోదిస్తున్నారో లేదో మహబూబ్‌నగర్ గడ్డపై మోదీ స్పష్టం చేయాలి. ఓట్ల వేట కోసం రాష్ట్రానికి వస్తున్న మోదీ పాప పరిహారం చేసుకుని పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వాలి. లేకుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 110 స్థానాల్లో డిపాజిట్లు కూడా దక్కవు..' అని మంత్రి అన్నారు. 'జమిలి ఎన్నికలు మోదీ డైవర్షన్ రాజకీయాలకు నిదర్శనం. నియోజకవర్గాల పునర్విభజనలో జనాభా నియంత్రణ చేసిన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరిగితే భావసారూప్య పార్టీలతో చర్చించి గళమెత్తుతాం. ఎన్నికల్లో పార్టీలు మారడం సహజం. రేపు కాంగ్రెస్ నుంచి కూడా మా పార్టీలోకి నేతలు రావొచ్చు.' అని కేటీఆర్ అన్నారు.

ఏపీ పంచాయితీ హైదరాబాద్‌లో పెడితే ఎలా?

చంద్రబాబు అరెస్టుపై మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో దాసోజు శ్రవణ్

సాక్షి, హైదరాబాద్: 'చంద్రబాబు నాయుడి అరెస్టు ఏపీకి సంబంధించిన అంశం. రెండు రాజకీయ పార్టీల నడుమ యుద్ధానికి సంబంధించినది. ఆ రెండు పార్టీల ఉనికి ఇక్కడ లేదు. అక్కడి రాజకీయాలతో మాకేం సంబంధం? అక్కడి పరిణామాలు తెలంగాణ ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపలేవు. ఎవరైనా వచ్చి ఇక్కడ నాటకాలు వేస్తే 'బేగానీ షాదీ మే అబ్దుల్లా దీవానా' అన్నట్లు (ఎవరిదో పెళ్లికి వేరెవరో హడావుడి చేసినట్లు..) ఉంటుంది. చంద్రబాబు అరెస్టు అయింది ఏపీలో. అక్కడ ర్యాలీలు, ధర్నాలు చేసుకుంటే ఎవరొద్దంటారు. హైదరాబాద్‌లో ర్యాలీలు తీస్తే ఎలా? పక్కింటి పంచాయతీ ఇక్కడ తీర్చుకోవడం ఎక్కడి పద్ధతి? ఏపీలో ఒకరితో ఒకరు తేల్చుకోండి. రాజమండ్రిలో భూమి దద్దరిల్లేలా ర్యాలీలు తీయండి. అక్కడి పంచాయితీ హైదరాబాద్‌లో పెడితే ఎలా? ఇక్కడ శాంతి భద్రతలు కాపాడే బాధ్యత ప్రభుత్వానికి ఉంటుంది. ఎలా అనుమతి ఇస్తారు? ఇవాళ వీళ్లు చేస్తే రేపు ఇంకొకరు చేస్తారు. వాళ్ల ఘర్షణకు హైదరాబాద్‌కు వేదిక కావాలా? విజయవాడ, రాజమండ్రి, అమరావతి లేవా? అక్కడ ఏమీ చేయకుండా ఇక్కడ రాద్దాంతం, రాజకీయం చేయడం ఏంటి?.

లోకేశ్ తన స్నేహితుడి ద్వారా మాట్లాడించారు..

చంద్రబాబు అక్కడ న్యాయ పోరాటం చేస్తున్నపుడు ఇక్కడ ఎవరు పడితే వాళ్లు రోడ్డు మీదకు వచ్చి మాట్లాడతారా? లోకేశ్, జగన్, పవన్‌తో నాకు మిత్రుత్వం ఉంది. అందరూ దోస్తులే.. ఆంధ్రాతో తగాదాలు లేవు. అలాంటపుడు మాకు లేని పోని పంచాయితీలు ఎందుకు పెడుతున్నారు. హైదరాబాద్‌లో దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన వారు కలిసిమెలసి ఉన్నారు. అక్కడి పంచాయితీ ఇక్కడ పెట్టి ఇక్కడ స్థిరపడిన వారి నడుమ లేని వైషమ్యాలు, కక్షలు, కార్పణ్యాలు లేపి దానిని మాకు చుడతామంటే ఎలా? హైదరాబాద్‌లో నిరసనలకు అనుమతి ఎందుకు ఇవ్వడం లేదని లోకేశ్ తన స్నేహితుడి ద్వారా మాట్లాడించారు. ఇక్కడి ఐటీ కారిడార్‌లో శాంతిభద్రతలు ఏం కావాలి? ఇక్కడ పెట్టుబడులు పెడుతున్న ఆంధ్రా వారికి లాభాలు రావాలంటే శాంతిభద్రతలు బాగుండాలి. అక్కడి రాజకీయ గొడవల్లో మేము తలదూర్చం. చంద్రబాబు అరెస్టుపై మా పార్టీ నేతలు ఎవరైనా మాట్లాడినా అది వారి వ్యక్తిగత అభిప్రాయం. మేము న్యూట్రల్‌గా ఉంటున్నాం.. సహకరించాలి..' అని అన్నారు.

కేటీఆర్ షాడో సీఎం

- తండ్రిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారు
- నిజామాబాద్ జిల్లా పర్యటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ

సుభాష్‌నగర్ (నిజామాబాద్): మంత్రి కేటీఆర్ షాడో సీఎంగా వ్యవహరిస్తున్నారని... తండ్రిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించారు. వచ్చే నెల 3న ప్రధాని మోదీ పాల్గొనే బహిరంగ సభ కోసం నిజామాబాద్‌లోని ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అక్టోబర్ 1న పాలమూరులో, 3న ఇందూరులో నిర్వహించే బహిరంగ సభలలో ప్రధాని పాల్గొంటారన్నారు. ఇందూరు సభలో ప్రధాని మోదీ రామగుండం ఎన్టీపీసీలోని 800 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టును వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని చెప్పారు.

యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదేం?

ప్రధాని రాష్ట్రానికి వచ్చే ముందు తెలంగాణకు ఏం మేలు చేశారో చెప్పాలంటూ మంత్రి కేటీఆర్ ప్రశ్నించడాన్ని విలేకరులు కిషన్‌రెడ్డి వద్ద ప్రస్తావించగా ఆయన ఘాటుగా స్పందించారు. తెలంగాణ కేటీఆర్ జాగీరు కాదంటూ విమర్శించారు. ప్రభుత్వం 17 సార్లు టీఎస్‌పీఎస్సీ పరీక్షలు నిర్వహించినా యువతకు ఎందుకు ఉద్యోగాలు ఇవ్వలేకపోయిందన్నారు. అలాగే దళిత సీఎం హామీతో పాటు దళితులకు మూడెకరాల చొప్పున భూపంపిణీ హామీని సైతం అటకెక్కించారని... రాష్ట్రానికి సీఎం కేసీఆర్ ఏం మేలు చేశారో చెప్పాలని ప్రతిగా కేటీఆర్‌ను ప్రశ్నించారు. పసుపు బోర్డు ఏర్పాటు విషయమై విలేకరులు ప్రశ్నించగా ప్రభుత్వంతో మాట్లాడి చెప్తానంటూ దాటవేశారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య ఉన్నారు.

మోదీ సభకు లక్ష మందితో జనసమీకరణ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వచ్చే నెల 3న జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభను జయప్రదం చేసేలా ప్రతి కార్యకర్త పని చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సూచించారు. మంగళవారం నిజామాబాద్‌లోని బస్వా గార్డెన్‌లో ఉమ్మడి నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల పదాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. సభకు లక్ష మందికిపైగా ప్రజలను సమీకరించాలన్నారు.

మజ్లిస్ ప్రోద్బలంతోనే లవ్‌జిహాదీలు

ఖలీల్‌వాడి: తెలంగాణ రాష్ట్రంలో మజ్లిస్ ప్రోద్బలంతోనే లవ్‌జిహాదీలు జరుగుతున్నాయని కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్‌పల్లిలో మరో వర్గం యువకుడి దాడిలో గాయపడిన యువతి, వారి కుటుంబసభ్యులను మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కిషన్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో మజ్లిస్‌ను బుజ్జగింపుల నేపథ్యంలోనే లవ్‌జిహాద్‌తో హిందూ, క్రిస్టియన్ యువతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రేమ పేరుతో వలలో వేసుకోవడానికి కొన్ని సంస్థలు ఆర్థిక సహాయం చేస్తున్నాయని ఆరోపించారు.

1న మోదీ షెడ్యూల్ ఖరారు

- మధ్యాహ్నం 1.30 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు రాక
- బేగంపేటలో ఏవియేషన్ రీసెర్చ్ సెంటర్, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు



సాక్షి, హైదరాబాద్: వచ్చేనెల 1న (అక్టోబర్) ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఆదివారం మధ్యాహ్నం 11.20 గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి ఐఏఎఫ్ ప్రత్యేక విమానంలో బయల్దేరి మధ్యాహ్నం 1.30 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడికి దగ్గరలోనే ఉన్న ఏవియేషన్ రీసెర్చ్ సెంటర్, రైల్వే, ఇతర శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బేగంపేట నుంచి ఎంఐ–17 ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయల్దేరి మధ్యాహ్నం 3.05 గంటలకు మహబూబ్‌నగర్‌కు చేరుకుంటారు. మహబూబ్‌నగర్ శివార్లలోని భూత్పూర్‌లో మధ్యాహ్నం 3.15 నుంచి 4.15 గంటల వరకు జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. సాయంత్రం 4.30 గంటలకు మహబూబ్‌నగర్ హెలీపాడ్ నుంచి హెలీకాప్టర్‌లో 5.05 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 5.10 గంటలకు ఐఏఎఫ్ ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తిరుగు పయనమవుతారు.

3న మరోసారి రాష్ట్రానికి మోదీ

అక్టోబర్ 3న ప్రధాని మోదీ మరోసారి రాష్ట్రానికి రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన నిజామాబాద్‌లో రోడ్‌షో, బహిరంగసభలో పాల్గొంటారు. ఈ సందర్భంగా పసుపుబోర్డుకు సంబంధించిన ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించడంతోపాటు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

కాంగ్రెస్‌లోకి సోయం బాపూరావు?

- ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ పార్టీ మారనున్నట్లు ప్రచారం
- అవన్నీ ఊహాగానాలేనంటూ కొట్టిపారేసిన సోయం



సాక్షి, ఆదిలాబాద్: బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు కాంగ్రెస్‌లో చేరబోతున్నారనే ప్రచారం సాగుతోంది. ఇటీవల ఢిల్లీలో ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో పార్టీ పెద్దల సమక్షంలో స్వయంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నోటి నుంచి సోయం బాపూరావు చేరిక ప్రస్తావన వచ్చినట్టు చెప్పుకుంటున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సోయం పేరును ప్రకటిస్తారని అంటున్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా భైంసా పర్యటనలో ఉన్న ఆయనను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించింది. రేవంత్ నోటి వెంట మీ పేరు వచ్చిందని సోయంను అడగ్గా.. అభిమానంతో ఆయన చెప్పి ఉండొచ్చని బదులిచ్చారు. కాంగ్రెస్‌లో చేరిక విషయంలో అన్ని ఊహాగానాలేనంటూ కొట్టిపారేశారు. నాలుగు నెలల క్రితం కూడా సోయం కాంగ్రెస్‌లో చేరుతున్నారని జోరుగా ప్రచారం జరగగా, తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన బహిరంగంగా ఖండించారు. తాజాగా మళ్లీ ఈ ప్రచారం జరుగుతుండటం గమనార్హం. బీజేపీ ఎంపీలందరూ వచ్చే శాసనసభ ఎన్నికల బరిలో ఉండాలని అధిష్టానం ఆదేశించినప్పటికీ ఆయన దరఖాస్తు ప్రక్రియకు దూరంగా ఉన్నారు. తనయుడు వెంకటేశ్‌ను బోథ్ నుంచి దరఖాస్తు చేయించారు. గతంలో టీడీపీలో ఉన్నప్పుడు రేవంత్‌తో సోయంకు సత్సంబంధాలు ఉన్నాయనే ప్రచారం ఉంది. బోథ్ నియోజకవర్గంలో ఆదివాసీ ఓట్లు అధికంగా ఉన్నాయి. దీంతో బలమైన ఆదివాసీ నేత సోయంను ఇక్కడి నుంచి బరిలోకి దించాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన అనిల్ జాదవ్ లంబాడా సామాజిక వర్గానికి చెందినవారు. కాంగ్రెస్, బీజేపీ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ తర్వాత జరుగుతున్న రాజకీయ సమీకరణాలపై అందరి దృష్టి నెలకొంది.

'బీసీలకు టికెట్లు ఇవ్వకపోతే గాంధీభవన్‌కు తాళాలు వేస్తాం'




చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

ముషీరాబాద్ (హైదరాబాద్): తెలంగాణలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు టికెట్లు ఇవ్వకపోతే గాంధీ భవన్‌కు తాళాలు వేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ జెండాలు మోసిన బీసీలను కాదని పూటకొక పార్టీ మారే రెడ్లకు అత్యధిక టికెట్లు ఇవ్వాలని కాంగ్రెస్ చూస్తోందని..ఇదే జరిగితే లక్షలాది బీసీలు గాంధీభవన్‌ను ముట్టడించడం ఖాయమన్నారు. హైదరాబాద్ దోమలగూడలోని బీసీ భవన్‌లో మంగళవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 128వ జయంతి వేడుకలను బీసీ సంఘాలు ఘనంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు.

29న రాష్ట్ర కేబినెట్ భేటీ?

సీఎం కేసీఆర్ నిర్ణయం!

- గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై మళ్లీ నిర్ణయానికి అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం ముంచుకొస్తున్న నేపథ్యంలో ఈ నెల 29న సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించినట్టు తెలిసింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా డాక్టర్ దాసోజు శ్రావణ్ కుమార్, కుర్ర సత్యనారాయణలను నామినేట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన సిఫారసులను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించిన నేపథ్యంలో తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై మంత్రివర్గ భేటీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 171(3), 171(5)లో నిర్దేశించిన మేరకు సాహిత్యం, సైన్స్, కళలు, సహకార ఉద్యమం, సమాజ సేవ రంగాల్లో చెప్పుకోదగ్గ ప్రావీణ్యత కానీ ఆచరణాత్మక అనుభవం కానీ లేకపోవడంతో వీరి అభ్యర్థిత్వాలను తిరస్కరిస్తున్నట్టు గవర్నర్ ప్రకటించిన విషయం తెలిసిందే. గవర్నర్ లేవనెత్తిన అంశాలకు సమాధానమిస్తూ మళ్లీ వారి పేర్లనే సిఫారసు చేస్తూ... గవర్నర్ కోరిన వివరాలను పూర్తిగా తిరిగి పంపించాలని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఎన్నికలకు సన్నద్ధతపై సైతం విస్తృతంగా చర్చించే అవకాశం ఉంది. ఎన్నికల సందర్భంగా ఓటర్లను ఆకర్షించడానికి కొత్త పథకాలు, కార్యక్రమాల అమలుకు ఉన్న అవకాశాలను సైతం పరిశీలించనున్నట్టు తెలిసింది. అయితే మంత్రివర్గ సమావేశం నిర్వహణపై ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెల్లడి కాలేదు.

కేసీఆర్ అంటేనే గ్యారంటీ

కాంగ్రెస్ గ్యారంటీ కార్డులు పనిచేయవు: మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: 'మీ గ్యారంటీ కార్డులు తెలంగాణలో పనిచేయవు..కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష.. కేసీఆర్ అంటేనే గ్యారంటీ, వారంటీ' అని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లాకేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ, కుమ్మర మోడ్రన్ యాంత్రిక పరిశ్రమకు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ 50 ఏళ్ల నుంచి చేయని అభివృద్ధి, ఇప్పుడు చేస్తామని గ్యారంటీ కార్డులు, బాండ్‌పేపర్లు రాసిస్తున్నార న్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మాటలు చెప్పేవారయితే, చేతల్లో చూపేది, మాటతప్పని, మడమతిప్పని నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. సీఎం కేసీఆర్ బీసీలకు చేసే ఆర్థికసాయం పథకాన్ని కాపీ కొట్టారని, అది అప్పు రూపంలో మోదీ అందిస్తున్నారని విమర్శించారు. ఉద్యమస్ఫూర్తి, పోరా టస్ఫూర్తిని చాకలి ఐలమ్మ అందించిందన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు హక్కుగా రావాల్సిన రూ.లక్ష కోట్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు 71% ఫిట్‌మెంట్ ఇస్తోందన్నారు. త్వరలో సీఎం కొత్త పీఆర్‌సీ వేసి తీపికబురు చెబుతారన్నారు. అతి తక్కువ వేతనాలు ప్రధాని మోదీ సొంతరాష్ట్రం గుజరాత్‌లో ఉన్నాయని, చూసేందుకు వెజ్ గవర్న మెంట్, కానీ చేసేందుకు నాన్‌వెజ్ గవర్నమెంట్ అంటూ బీజేపీ ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ నిర్ణయంతో బీసీలకు అన్యాయం

- దేశంలో భారత రాజ్యాంగానికి బదులు బీజేపీ రాజ్యాంగం
- చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవిత, బండా ప్రకాశ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటాలో రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసిన ఇద్దరు ఎమ్మెల్సీల పేర్లను గవర్నర్ తమిళిసై తిరస్కరించడంతో వెనుకబడిన తరగతులకు తీవ్ర అన్యాయం జరిగిందని బీఆర్‌ఎస్ శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. వెనుకబడిన తరగతుల వారికి బీజేపీ వ్యతిరేకమని గవర్నర్ తాజా నిర్ణయంతో మరోమారు నిరూపితమైందన్నారు. శాసనమండలి ఆవరణలో మంగళవారం జరిగిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో కవిత పాల్గొన్నారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్‌తో కలిసి ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర మంత్రి మండలి ఎమ్మెల్సీ పదవులకు నామినేట్ చేసిన ఇద్దరి పేర్లను తిరస్కరించడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. దేశంలో భారత రాజ్యాంగానికి బదులు బీజేపీ రాజ్యాంగం నడుస్తుందనే అనుమానం కలిగేలా పలు రాష్ట్రాల్లో గవర్నర్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత, బీసీ కమిషన్ సభ్యుడు కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బీసీ నేతల చలో ఢిల్లీ

నేడు ఖర్గేను కలవనున్న టీం బీసీ బృందం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్‌లోని బీసీ నాయకులు ఢిల్లీ బయలుదేరారు. ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన టీం బీసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు అధిష్టానం పెద్దలను కలిసేందుకు మంగళవారం హస్తిన పయనమయ్యారు. మాజీ ఎంపీ వి. హనుమంతరావు, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, ఓబీసీ జాతీయ సమన్వయకర్త కత్తి వెంకటస్వామి మంగళవారమే ఢిల్లీ వెళ్లగా, మధుయాష్కీగౌడ్, పొన్నం ప్రభాకర్, అంజన్‌కుమార్ యాదవ్, గాలి అనిల్‌కుమార్, సురేశ్ షెట్కార్ తదితరులు బుధవారం బయలుదేరనున్నారు. వీరంతా బుధ లేదా గురువారాల్లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలవనున్నారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. త్వరలోనే ఖరారు చేయనున్న అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో బీసీలకు కనీసం 34 స్థానాలు కేటాయించడమే ఎజెండాగా తెలంగాణ బీసీ నేతలు ఢిల్లీ బయలుదేరారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోండి: ప్రదేశ్ ఎన్నికల కమిటీ, రాజకీయ వ్యవహారాల కమిటీలో ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలోని ప్రతి లోక్‌సభ స్థానంలో రెండు అసెంబ్లీ సీట్ల చొప్పున మొత్తం 34 సీట్లను బీసీలకు కేటాయించాలని కోరుతూ టీం బీసీ నేతలు మంగళవారం హైదరాబాద్‌లో ఉన్న ముఖ్య నేతలను కలిశారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు అంజన్‌కుమార్ యాదవ్, మహేశ్ కుమార్ గౌడ్, సురేశ్‌షెట్కార్, గాలి అనిల్‌కుమార్, ఎర్రశేఖర్, సంగిశెట్టి జగదీశ్వరరావు తదితరులు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు స్క్రీనింగ్ కమిటీ సభ్యుడు మధుయాష్కీగౌడ్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. బుధవారం అందుబాటులో ఉన్న నేతలు నల్లగొండ ఎంపీ, స్క్రీనింగ్ కమిటీ సభ్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కూడా కలవనున్నారు.

'డబుల్‌బెడ్రూం' సక్సెస్ కాలేదనే 'గృహలక్ష్మి'

సంక్షేమ పథకాలను అడ్డుకుంటే సహించను: ఎమ్మెల్యే రాజయ్య



స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం సక్సెస్ కాలేదని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం తెచ్చిందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'కాంగ్రెస్ హయాంలో మహానేత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇళ్లు నా చేతుల మీదుగానే ఇచ్చాను. ప్రస్తుతం గృహలక్ష్మి ఇళ్లు కూడా నేనే అందించనున్నాను. ఇదినా అదృష్టంగా భావిస్తున్నాను' అని చెప్పారు. బీసీల జనగణన చేయకపోవడంతో వారికి అన్యాయం జరుగుతోందని, అందుకే ఇటీవల బీఆర్‌ఎస్ ప్రకటించిన అసెంబ్లీ స్థానాల్లో రాష్ట్ర జనాభాలో 11 శాతం ఉన్న ముదిరాజ్‌లకు ఒక్కస్థానం కూడా దక్కలేదని అన్నారు. దీనిపై గ్రామాల్లో చర్చ జరుగుతోందని రాజయ్య పేర్కొన్నారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సుప్రీం అని, తాను ప్రతిపాదిస్తేనే సంక్షేమ పథకాలు వస్తాయని, ఎవరైనా అడ్డుకోవాలని చూస్తే సహించేదిలేదని హెచ్చరించారు.

అభివృద్ధికి తోడ్పడేవాడినే.. అడ్డుకునేవాడిని కాదు

ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



స్టేషన్‌ఘన్‌పూర్: తాను అభివృద్ధికి తోడ్పడేవాడినే గానీ, అడ్డుపడేవాడిని కాదని ఎమ్మెల్సీ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండలో మంగళవారం ఆయన బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. పని ఇప్పిస్తానని, పదవి ఇస్తానని ఎక్కడైనా తాను అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెబుతానన్నారు. నిజాయితీగా పనిచేస్తానని, మా ఎమ్మెల్యే కడియం శ్రీహరి అని గొప్పగా చెప్పుకునేలా అభివృద్ధి చేసి చూపిస్తానని ఉద్వేగంగా చెప్పారు. కాంగ్రెస్ ఉసిరికాయల మూట, కప్పల తడక వంటిదని, ఆ పార్టీ నేతల మధ్య సయోధ్య లేదని ఎద్దేవా చేశారు. ఆరు పథకాల గ్యారంటీ కాదు.. అసలు ఆ పార్టీకే రాష్ట్రంలో గ్యారంటీ లేదన్నారు. బీజేపీకి గ్రామాల్లో ఉనికి లేదని, రాష్ట్రంలో మూడు, నాలుగు సీట్లు వస్తేనే మహా ఎక్కువ అన్నారు. ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు పార్టీ మారే ఆలోచనలో ఉన్నారని తెలిపారు.

గ్రహాంతరవాసీ... నీవున్నావా?

గ్రహాంతరవాసుల ఉనికి, యూఎఫ్‌వో జాడలపై దశాబ్దాలుగా వాదోపవాదాలు

ఆయా వివరాలను ప్రభుత్వాలు దాస్తున్నాయంటున్న ఔత్సాహికులు

అలాంటి సమాచారమేదీ లేదంటున్న అమెరికా సహా ఇతర దేశాలు

మెక్సికోలో ఇటీవల రెండు వింత ఆకారాల ప్రదర్శనతో మళ్లీ ఊపందుకున్న చర్చ

దొడ్ల శ్రీనివాసరెడ్డి

విశ్వాంతరాళాల్లో గ్రహాంతరవాసుల ఉనికి, గుర్తుతెలియని ఎగిరే వస్తువు (యూఎఫ్‌వో)ల జాడకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాలుగా చర్చలు, వాదోపవాదాలు జరుగుతూనే ఉన్నాయి. గ్రహాంతరవాసులకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వాలు దాచిపెడుతున్నాయని కొందరు ఔత్సాహికులు ఆరోపిస్తుంటే తమ దగ్గర ఎలాంటి సమాచారం లేదని, ఈ విషయంలో పారదర్శకత అవసరమని ప్రభుత్వాలు చెబుతున్నాయి. వివిధ దేశాల పార్లమెంటరీ కమిటీలూ ఈ విషయమై ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రహాంతరవాసులు, యూఎఫ్‌వోలకు సంబంధించి మన దగ్గర ఉన్న సమాచారం ఏమిటి, వాటి నిజానిజాలు ఎంత అన్నది పరిశీలిద్దాం.



ఇటీవల మెక్సికో కాంగ్రెస్‌లో ప్రదర్శించిన వింత ఆకారం

గ్రహాంతరవాసుల ఉనికికి సంబంధించి ఇటీవల మెక్సికో కాంగ్రెస్‌లో ఓ ప్రత్యేక సమావేశం జరిగింది. అయితే అనూహ్యంగా సమావేశ మందిరంలో ప్రదర్శించిన వింత ఆకారంలోని రెండు భౌతిక కాయాలు యావత్ ప్రపంచాన్ని నివ్వెరపరిచాయి. ప్రముఖ జర్నలిస్టు, యూఎఫ్‌వో పరిశోధకుడు జైమీ మౌసాన్ ప్రదర్శనకు పెట్టిన ఆ భౌతికకాయాలు 45 ఏళ్ల క్రితం ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు స్పీల్‌బర్గ్ గ్రహాంతరవాసులపై కల్పిత కథ ఆధారంగా నిర్మించిన చిత్రం ఈటీ (ఎక్స్‌ట్రా టెరెస్ట్రియల్)లో చూపిన గ్రహాంతరవాసిని పోలినట్లుగా ఉన్నాయి. అవి పెరు దేశంలోని కుస్కో ప్రాంతంలో జరిపిన తవ్వకాల్లో బయటపడ్డాయని, వాటిని కార్బన్ డేటా ద్వారా పరీక్షించగా దాదాపు వెయ్యేళ్ల క్రితం నాటివిగా తేలిందని జైమీ మౌసాన్ చెప్పారు. డీఎన్‌ఏ పరీక్షల్లోనూ ఈ దేహాల్లో 30 శాతానికిపైగా గుర్తుతెలియని పదార్థాలు ఉన్నట్లు తేలిందని, ఆ భౌతికకాయాలు భూమిపై జన్మించిన జీవులు కాదని, ఇతర గ్రహాల నుంచి వచ్చిన వారివేనని ఆయన వాదించారు.

అయితే ఈ వాదనపై 'నాసా'అనుమానాలు వ్యక్తం చేసింది. తమ వద్ద ఉన్న అపారమైన సమాచారం మేరకు ఇంతవరకు గ్రహాంతరవాసుల ఉనికికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఏమైనా అనుమానాస్పద విషయాలు వెలుగులోకి వస్తే వాటిని శాస్త్రవేత్తల పరిశీలనకు అందుబాటులో ఉంచాలని కోరింది.

అమెరికాలోనూ ఇదే తంతు...

యూఎఫ్‌వోలకు సంబంధించి అమెరికా కాంగ్రెస్ కూడా ఇటీవల ప్రత్యేక సమావేశం నిర్వహించింది. అందులో అమెరికా మాజీ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ డేవిడ్‌గ్రుస్ అమెరికా ప్రభుత్వంపై అనేక ఆరోపణలు చేశారు. గ్రహాంతరవాసులకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వం రహస్యంగా ఉంచుతోందని, కూలిపోయిన యూఎఫ్‌వోలు వాటితోపాటు వచ్చిన గ్రహాంతరవాసుల భౌతికకాయాలు అమెరికా అధీనంలో ఉన్నాయని ఆయన ఆరోపించారు. అంతేకాదు.. అమెరికా ప్రభుత్వం ఈ గ్రహాంతర వాహనాలను రివర్స్ ఇంజనీరింగ్ ద్వారా మళ్లీ నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తన పరిశోధనలో తెలిసిందని కూడా డేవిడ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న అమెరికా నౌకాదళ మాజీ పైలట్ ర్యాన్‌గ్రేవ్స్ మాట్లాడుతూ గతంలో తాను విమానం నడుపుతున్నప్పుడు రెండు సందర్భాల్లో యూఎఫ్‌వోలను చూశానని వాంగ్మూలం ఇచ్చారు. అయితే అమెరికా రక్షణశాఖ ఈ వాదనలను తిరస్కరించింది. గ్రహాంతరవాసులు, వాహనాలకు సంబంధించి తమ వద్ద ఎలాంటి కచ్చితమైన సమాచారం లేదని పెంటగాన్ ప్రతినిధి సూగ్రాఫ్ ప్రకటన విడుదల చేశారు.

ఊహాగానాలకు నెలవుగా ఏరియా 51

అమెరికాలోని నెవడా రాష్ట్రంలో ఉన్న నిషేధిత ఏరియా 51 ప్రాంతం అనాదిగా వాదవివాదాలకు, ఊహాగానాలకు కేంద్రంగా నిలిచింది. ఈ నిషేధిత ప్రాంతంలో గ్రహాంతరవాసులు, వాహనాలకు సంబంధించిన అవశేషాలు ఉన్నట్లు విపరీతమైన ప్రచారం జరిగింది. దీనిపై అనేక పుస్తకాలు, టీవీ సీరియల్స్ సైతం వచ్చాయి. కొందరు ఔత్సాహికులు ఈ ప్రాంతంలోకి అడుగుపెట్టేందుకు విఫలయత్నాలు చేశారు. గ్రహాంతరవాసుల కథనాలతోపాటు అమెరికా చంద్రునిపై కాలుపెట్టిన ఉదంతం వాస్తవానికి ఏరియా 51లో కృత్రిమంగా రూపొందించారన్న ప్రచారం కూడా ఉంది. యాభైయ్యవ దశకంలో ఈ ప్రాంతంలో గ్రహాంతర వాహనాలు తరచూ కనిపించడం వల్లే ఏరియా 51కి అమెరికా అంతటా ఆసక్తి రేకెత్తింది. 2013లో సీఐఏ బహిర్గతం చేసిన రహస్య పత్రాల్లో అసలు విషయం బయటపడింది. యాభైయ్యవ దశకంలో ప్రయాణికుల విమానాలు 10 వేల నుంచి 20 వేల అడుగుల ఎత్తులో మాత్రమే పయనించగలిగేవి. కొన్ని రకాల యుద్ధవిమానాలు 40 వేల అడుగుల ఎత్తు వరకు పయనించేవి. 1955లో అప్పటి అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ మరింత ఎత్తులో ఎగిరే యుద్ధవిమానాలు యు-2ల నిర్మాణ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపారు. ఈ విమానాలు 60 వేల అడుగుల ఎత్తులో పయనించగలిగేవి. సాధారణ విమాన ప్రయాణికులకు ఈ విషయం తెలియక వాటిని గ్రహాంతర వాహనాలుగా ప్రచారం చేశారు. అయితే ఈ విషయం తెలిసిన వైమానికదళ అధికారులు వాటిని పెద్దగా పట్టించుకోలేదు. తరువాతి కాలంలో అత్యాధునిక యుద్ధవిమానాలను ఏరియా 51లో పరీక్షించేవారు.

అల్లంత దూరాన చిగురిస్తున్న ఆశలు...

జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ పంపిన సమాచారాన్ని విశ్లేషించిన 'నాసా'భూమికి సుదూరంగా ఉన్న కే2–18బీ అనే గ్రహంలో నీటితో నిండిన సముద్రాలు, అందులో జీవచరాలు ఉండే అవకాశం ఉందని ఇటీవల వెల్లడించింది. భూమికి కనీసం 8.6 రెట్లు పెద్దదైన ఈ గ్రహం మనకు 120 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. ఈ గ్రహం వాతావరణంలో అత్యధిక స్థాయిలో హైడ్రోజన్ ఉండటమే కాకుండా అదే స్థాయిలో మీథేన్, కార్బన్ డయాక్సైడ్, స్వల్ప పరిమాణంలో అమ్మోనియా వాయువులు ఉండటం వల్ల అక్కడ సముద్రజలాలు ఉండే అవకాశం ఉందని నాసా అంచనా వేసింది. అంతకుమించి కే2–18బీ గ్రహ వాతావరణంలో డిమిథైల్ సల్ఫైడ్ (డీఎంఎస్) అణువులు కూడా ఉన్నట్లు జేమ్స్ వెబ్ టెలిస్కోప్ కనుగొంది. భూమిపై ఈ డీఎంఎస్‌ను సముద్రంలో వృక్షజాతికి చెందిన నాచులాంటి మొక్కలు మాత్రమే ఉత్పత్తి చేయగలవు. దాంతో కే2–18బీపై కూడా జీవం ఉండే ఆస్కారం మెండుగా ఉందని నాసా భావిస్తోంది.

శుక్రుడిపైనా జాడలు...

తాజాగా శుక్రగ్రహంపై జీవం ఉండే ఆస్కారం ఉందనడానికి తగిన ఆధారాలు లభించాయి. యూకేలోని వేల్స్‌లో ఉన్న కార్డిఫ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం చేపట్టిన పరిశోధనల్లో శుక్రుడిపై వాతావరణంలో ఫాస్ఫైన్ వాయువులు ఉన్నట్లు బయటపడింది. కార్డిఫ్ బృందానికి చెందిన గ్రీవ్స్ అనే శాస్త్రవేత్త ఇటీవల రాయల్ ఆస్ట్రొనామికల్ సొసైటీ జాతీయ సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఫాస్ఫైన్ వాయువుపై ఇంత ఆసక్తి ఎందుకంటే భూమిపై ఈ వాయువు కేవలం జీవజాలాల నుంచే వెలువడుతుంది. భూమిపై స్వచ్ఛమైన హైడ్రోజన్ తక్కువ పరిమాణంలో ఉన్న చోట జీవజాలం గుండా ఫాస్ఫైన్ ఉత్పత్తి జరుగుతుంది. శుక్రుడు వాతావరణంలో దిగువ భాగంలోనే ఈ ఫాస్ఫైన్ మేఘాలు ఆవరించి ఉండటంతో అక్కడ జీవం ఉండే ఆస్కారం అత్యధికంగా ఉందనేది కార్డిఫ్ బృందం అభిప్రాయం. మూడేళ్ల క్రితం ఈ విషయం బయటపడ్డా అప్పట్లో శాస్త్రవేత్తలు అంతగా ఆసక్తి చూపలేదు. కేవలం ఫాస్ఫైన్ ఉన్నంత మాత్రాన జీవం ఉందని కచ్చితంగా చెప్పలేమని అన్నారు. కానీ ఇటీవల జరిగిన మరిన్ని పరిశోధనల ఫలితంగా ఇప్పుడు శుక్రుడిపై జీవం జాడలు కనుగొనేందుకు ఆసక్తి పెరిగింది.

ఆధారాలను కనుగొనే దిశగా...

గ్రహాంతరవాసులపట్ల మనిషికి అనాదిగా ఆసక్తి ఉంది. వాటి కోసం నిరంతర అన్వేషణ జరుగుతూనే ఉంది. రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా రోదసిలో ఈ గ్రహాంతర జీవుల కోసం వెదుకుతూనే ఉన్నాం. అయినా ఇంతవరకూ కచ్చితమైన ఆధారాలేమీ దొరకలేదు. మెక్సికో కాంగ్రెస్‌లో ప్రదర్శించిన భౌతికకాయాలపై జరుగుతున్న పరీక్షలు వాటిని గ్రహాంతరవాసులుగా తేలిస్తే అవే మనకు మొదటి ఆధారాలు కాగలవు. అంగారకుడిపై ఎప్పుడైనా జీవం ఉన్న దాఖలాలు ఏమైనా ఉన్నాయా అనే విషయంతోపాటు అంగారకుడిపై జీవం మనుగడకు అవకాశం ఉందా అనే విషయాన్ని పరిశీలించడానికి నాసా ఒక బృహత్తర కార్యక్రమం చేపట్టింది. నాసాకు చెందిన ప్రిసర్వేరన్స్ రోవర్ గత జనవరిలో అంగారకుడిపై అనేక ట్యూబ్‌లను వదిలింది. ఇవి అక్కడి మట్టి, రాళ్లను సేకరిస్తాయి. వాటిని తిరిగి భూమిపైకి తేవడానికి మార్స్ శాంపిల్ రిటర్న్ (ఎంఎస్ఆర్) కార్యక్రమాన్ని ప్రారంభించింది. నాసా అంచనా ప్రకారం ఇది 2030 నాటికి పూర్తవుతుంది.

విశ్వంలో జీవానికి మెండుగా అవకాశాలు...

అసలు గ్రహాంతరవాసులు ఉన్నాయా లేక కేవలం భూమిపైనే జీవం ఉందా అనే ప్రశ్నకు శాస్త్ర ప్రపంచం ఇచ్చే సమాధానం ఒక్కటే. అనంతకోటి విశ్వంలో భూమిని పోలిన పరిస్థితులు ఉన్న గ్రహాలు ఇంకా ఉండేందుకు అవకాశం మెండుగా ఉంది. విశ్వం మొత్తంలో కోటానుకోట్ల గెలాక్సీలు ఉన్నాయి. ఒక్క మన పాలపుంత (మిల్కీవే) గెలాక్సీలోనే 10,000 కోట్ల నక్షత్రాలు ఉన్నాయి. ఇన్నింటి మధ్య భూమిలాంటి వాతావరణం ఉన్న గ్రహాలు అనేకం ఉండే ఆస్కారం ఉంది. అలాంటిచోట జీవం ఆవిర్భవించే అవకాశాలూ ఉన్నాయి. ఏమో ఏదో రోజు మనకు ఈ గ్రహాంతర వాసులతో ములాఖత్ జరిగే అవకాశమూ ఉంది.

'రంగారెడ్డి'లో నాన్‌లోకల్‌లే ఎక్కువ

- పదోన్నతులు, ఉద్యోగ నియామకాల్లో తమకు అన్యాయం జరుగుతోందంటున్న జిల్లావాసులు
- తాతల కాలం నుంచి ఇక్కడే పుట్టి పెరిగిన తమ పరిస్థితి ఏమిటని స్థానిక నిరుద్యోగుల ఆందోళన



సాక్షి, హైదరాబాద్: పదోన్నతులు.. ఉద్యోగ నియామకాల్లో కొన్నేళ్లుగా రంగారెడ్డి జిల్లాకు అన్యాయం జరుగుతోందని ఆ జిల్లా ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజధాని ప్రాంతంలో భాగం కావడం వల్ల ఇతర జిల్లాల వారూ రంగారెడ్డి జిల్లాకే ప్రాధాన్యమిస్తున్నారు. ఉద్యోగరీత్యా దీర్ఘకాలం ఇక్కడే స్థిరపడడంతో వారి పిల్లలూ స్థానికులుగా గుర్తింపు పొందుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఆంధ్ర, రాయలసీయ జిల్లాలకు చెందిన వారు అప్పట్లో ఉద్యోగాలు పొంది ఇప్పటికీ ఇక్కడే కొనసాగుతున్నారు. తాతల కాలం నుంచి రంగారెడ్డి జిల్లాలో పుట్టి పెరిగిన స్థానికులకు నియామకాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని నిరుద్యోగులు వాపోతున్నారు. తెలంగాణలో హెచ్‌ఆర్‌ఏ ఎక్కువ ఇచ్చే జిల్లాల్లో రంగారెడ్డి కూడా ఉంది. ఈ కారణంగా స్థానికేతరులు కూడా సీనియారిటీ ప్రాతిపదికన ఈ జిల్లానే ఎంచుకుంటున్నారు. గత ఏడాది అమలు చేసిన 317 జీఓ తర్వాత స్థానికులకు సరైన అవకాశాలే లేకుండాపోయామని ఆ జిల్లావాసులు చెబుతున్నారు. ఉదాహరణకు స్కూల్‌అసిస్టెంట్ బయోసైన్స్‌లో రంగారెడ్డికి, మహబూబ్‌నగర్‌లోని 64 మండలాల నుంచి కేడర్‌కు మించి కేటాయించారు. ఇతర సబ్జెక్టుల్లో కూడా కేడర్‌కు మించి టీచర్ల కేటాయింపులు జరిగాయి. ఇదిలా ఉంటే స్పౌజ్ కోటాతో సమస్య మరింత జటిలమైంది. భర్త, లేదా భార్య ఈ జిల్లాలో పనిచేస్తున్నట్టు చూపించి దాదాపు 400మంది ఇదే జిల్లాకు వచ్చారు. దీర్ఘకాలం వీరు కొనసాగడం వల్ల ఖాళీలు లేకుండా పోయాయి. దీంతో టెట్, జాతీయ ఉపాధ్యాయ అర్హత పరీక్షలు పాసైన స్థానికులకు ఉద్యోగాలు పొందే అవకాశమే లేకుండా పోయింది. ఈ అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా నిరుద్యోగులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పాఠశాల విద్యార్థుల కథలు చరిత్రకు శ్రీకారం

'మన ఊరు మన చెట్టు' పుస్తకాలను ఆవిష్కరించిన మంత్రి సబిత



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి సబిత, జూలూరు గౌరీశంకర్, రావుల శ్రీధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ దార్శనిక ఆలోచనలకు అనుగుణంగా ఒకేరోజు.. ఒకే సమయానికి 5 లక్షల మంది పాఠశాల విద్యార్థులు 'మన ఊరు మన చెట్టు'అనే అంశంపై కథలు రాసి నూతన చరిత్రకు శ్రీకారం చుట్టారని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కొనియాడారు. మంగళవారం బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో సబిత 'మన ఊరు మన చెట్టు'పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ తరహా ప్రయత్నం దేశ చరిత్రలోనే తొలిసారి కావడం గొప్ప విషయమని, రాష్ట్ర విద్యార్థులు కలం పట్టి తమ ఊరి ప్రకృతిని అద్భుత కథలుగా మలచి దేశానికే మోడల్‌గా నిలిచారని కొనియాడారు. 33 జిల్లాలకు చెందిన విద్యార్థులు రాసిన కథలను 33 పుస్తకాలుగా తెలంగాణ సాహిత్య అకాడమీ ముద్రించి విద్యార్థులకు అందించడం అభినందించదగిన విషయమన్నారు. బాల సాహిత్య విస్తృతికి కృషి చేయడమే కాకుండా రాష్ట్రంలో పుస్తక ప్రదర్శనలతో జ్ఞాన తెలంగాణ కోసం కృషి చేస్తున్న సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్‌ను మంత్రి సబిత శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి నామోజు, తెలంగాణ విద్యా మౌలికవసతుల సంస్థ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, ప్రొ. నారా కిశోర్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డి. శ్రీపాల్ రెడ్డి, బి. కమలాకర్‌రావు పాల్గొన్నారు.

దసరా నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో దసరా పండుగ నుంచి 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం'అమలు చేస్తున్నట్టు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు దసరా పండుగ రోజు నుంచి ఉచిత అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పథకం అమలు తీరుతెన్నులపై ఆమె మంగళవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో కలిసి సమీక్షించారు. పథకానికి సంబంధించిన మెనూను త్వరగా నిర్ణయించాలని, విధివిధానాలు రూపొందించాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులకు సూచించారు.

రేపట్నుంచి స్కూల్ అసిస్టెంట్ బదిలీలకు ఆప్షన్లు



సాక్షి, హైదరాబాద్: స్కూల్ అసిస్టెంట్ టీచర్ల బదిలీల ప్రక్రియ మొదలైంది. ఈ నెల 28, 29 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు అధికారులు అనుమతించారు. అయితే, మల్టీజోన్–2 పరిధిలో కోర్టు స్టే కారణంగా స్థానిక సంస్థలకు చెందిన పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు బదిలీలు చేపట్టడం లేదని, 33 జిల్లాల్లో ప్రభుత్వ టీచర్లకు మాత్రం బదిలీలు ఉంటాయని విద్యాశాఖ తెలిపింది. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను పాఠశాల విద్య డైరెక్టరేట్ కార్యాలయం మంగళవారం ఆదేశించింది.

ఎన్‌ఆర్‌ఐ కోటా ఎంబీబీఎస్ సీట్లలో ఇతరులకూ అవకాశం

- 128 సీట్లు మిగిలిపోవడంతో ఆరోగ్య వర్సిటీ కీలక నిర్ణయం
- స్ట్రే వేకెన్సీ పద్ధతిలో భర్తీ చేసేందుకు ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో మిగిలిపోయిన 128 ఎన్‌ఆర్‌ఐ కోటా ఎంబీబీఎస్ సీట్లను ఇతరులకు కూడా కేటాయించాలని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం కీలక నిర్ణయం తీసుకుంది. వాస్తవంగా ఈ సీట్లను ఎన్‌ఆర్‌ఐ ధ్రువీకరణ పత్రం ఉన్నవారికే కేటాయిస్తారు. గతేడాది వరకు అన్ని విడతల కౌన్సెలింగ్ పూర్తయి, ఇలా మిగిలిన సీట్లను ఆయా ప్రైవేటు మెడికల్ కాలేజీలే నింపుకొనేవి. కానీ ఇప్పుడు అలా నింపుకొనే పద్ధతికి జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) బ్రేక్ వేసింది. దీంతో మిగిలిన సీట్లను స్ట్రే వేకెన్సీ పద్ధతిలో కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోనే భర్తీ చేయనుంది. అయితే అన్ని కౌన్సెలింగ్‌లు పూర్తయిన తర్వాత కూడా సీట్లు మిగిలిపోవడంతో అవి ఏ మేరకు నిండుతాయోనని అధికారులు అంటున్నారు.

128 సీట్ల మిగులు...

రాష్ట్రంలో 30 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 4,825 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. వాటిల్లో 15 శాతం అంటే 723 ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్లున్నాయి. వాటికి మాప్‌అప్ రౌండ్ వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. దాదాపు 12.20 లక్షల ర్యాంకు వచ్చిన వారికి కూడా ఎన్‌ఆర్‌ఐ కోటాలో సీట్లు లభించాయి. అంతకంటే ఎక్కువ ర్యాంకున్న వారికి కూడా సీట్లు వచ్చే అవకాశమున్నా విద్యార్థులు ముందుకు రావడంలేదు. దీంతో 128 ఎన్‌ఆర్‌ఐ సీట్లు మిగిలిపోయాయి. ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్ల ఫీజు ఏడాదికి రూ. 23 లక్షల వరకు ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇంతకంటే తక్కువ ఫీజుతో పక్క రాష్ట్రాల్లోని డీమ్డ్ వర్సిటీల్లోనూ సీట్లొచ్చే చాన్స్ ఉండటంతో విద్యార్థులు ముందుకు రావట్లేదన్న అభిప్రాయం నెలకొంది. దీనికితోడు రాష్ట్రంలో కొత్తగా మెడికల్ కాలేజీలు ఏర్పాటవడంతో వాటిల్లో ఎంబీబీఎస్ సీట్లు పెరిగాయి. కన్వీనర్ కోటా, బీ కేటగిరీ సీట్లూ పెరగడంతో ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్లవైపు రావడానికి చాలా మంది ముందుకు రావడంలేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎన్‌ఆర్‌ఐ సీట్లు మిగలడంతో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి. స్ట్రే వేకెన్సీ పద్ధతిలో మిగిలిన ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్లను భర్తీ చేయాలనుకున్నా తక్కువ ఫీజు తీసుకుంటేనే విద్యార్థులు చేరే అవకాశముంది.కొన్ని కాలేజీలు ఎన్‌ఆర్‌ఐ కోటా సీటును తక్కువ ఫీజుకే ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం.

రాష్ట్రంలో 5,263 డెంగీ కేసులు

- గతేడాదికంటే తక్కువే: వైద్య మంత్రి హరీశ్‌రావు
- వెల్‌నెస్ సెంటర్ల ద్వారా అందుతున్న సేవల పట్ల మంత్రి అసంతృప్తి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది డెంగీ కేసులు తక్కువగా నమోదయ్యాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గతేడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 7,988 డెంగీ కేసులు నమోదైతే, ఈ ఏడాది అదే సమయానికి 5,263 కేసులు నమోదైనట్లు చెప్పారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల పరిస్థితిపై మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీజనల్ వ్యాధుల పట్ల ప్రభుత్వం పూర్తి అప్రమత్తతతో ఉందని, అయితే వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా గడిచిన వారం పది రోజుల సమయంలో ఫీవర్ కేసుల్లో స్వల్పంగా పెరుగుదల ఉన్నట్లు పేర్కొన్నారు. మరింత అప్రమత్తంగా ఉంటే ఎలాంటి నష్టం జరగకుండా చూసుకోవడం సాధ్యమవుతుందన్నారు. మలేరియా, డెంగీ కేసుల విషయంలో భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని, జ్వర లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల చికిత్సకు అవసరమైన అన్ని మందులు పల్లె దవాఖానాలు మొదలుకొని అన్ని ఆసుపత్రులలో అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధి నిర్ధారించే ఎన్ఎస్1 కిట్స్, ఐజీఎం కిట్లకు కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ ద్వారా 24 గంటల్లో వైద్య పరీక్ష ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. అవసరమైతే జ్వరాల కోసం ప్రత్యేక ఓపీ కౌంటర్లు ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు డెంగీ చికిత్స పేరుతో ప్రజలను మభ్యపెడుతూ, ప్లేట్లెట్స్ ఎక్కించాలంటూ భయపెడుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి ఆసుపత్రుల పట్ల జిల్లా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. వెల్‌నెస్ సెంటర్ల ద్వారా అందుతున్న సేవల పట్ల మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెల్‌నెస్ సెంటర్లను సందర్శించి, అందుతున్న వైద్య సేవలను పరిశీలించాలని ఆరోగ్యశ్రీ సీఈవోను మంత్రి ఆదేశించారు. జూమ్ ద్వారా జరిగిన ఈ సమీక్షలో ఆ శాఖ కార్యదర్శి రిజ్వీ, ప్రజారోగ్య సంచాలకులు శ్రీనివాసరావు, డీఎంఈ రమేశ్‌రెడ్డి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌లు, టీచింగ్ హాస్పిటళ్లు, జిల్లా దవాఖానాల సూపరింటెండెంట్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

అభ్యర్థుల జీవితాలతో ఆటలా?

▶ మొదటి పేజీ తరువాయి

కదా అని పేర్కొంది. పరీక్ష నిర్వహించాక వెల్లడించిన అభ్యర్థుల సంఖ్యకు, కమిషన్ అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొన్న అభ్యర్థులకు 258 వ్యత్యాసం ఎందుకు వచ్చిందో చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను నేటి (బుధవారం)కి వాయిదా వేసింది. టీఎస్‌పీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, ప్రతివాదుల తరఫున సీనియర్ న్యాయవాది గిరిధర్‌రావు సుదీర్ఘ వాదనలు వినిపించారు.

మార్పుచేర్పులకు కమిషన్‌కు అధికారాలుంటాయి: ఏజీ

ఏజీ వాదనలు వినిపిస్తూ.. 'గ్రూప్–1 పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌లో నిబంధనల మార్పుచేర్పులకు కమిషన్‌కు అధికారాలు ఉంటాయి. కమిషన్ రాజ్యాంగ సంస్థ, దాని అధికారాల్లో కోర్టుల జోక్యం నామమాత్రమే. అభ్యర్థులకు జారీ చేసిన హాల్‌టికెట్లలోనూ బయోమెట్రిక్ విధానం లేదని, ఆధార్, పాన్ వంటి అధికారిక గుర్తింపు కార్డులతో హాజరుకావాలని స్పష్టంగా పేర్కొంది. హాల్‌టికెట్ తీసుకున్నాక అభ్యంతరాలు ఉంటే వెంటనే కోర్టును ఆశ్రయించాలి. కానీ, పరీక్ష నిర్వహించాక ఉద్దేశపూర్వకంగా ఆశ్రయించడం ఆమోదనీయంకాదు. పరీక్షల రద్దు కోరుతూ ముగ్గురు అభ్యర్థులు మాత్రమే హైకోర్టును ఆశ్రయించారు. 2.33 లక్షల మంది అభ్యర్థుల్లో ముగ్గురు కోరితే దానిని ఆమోదించడం సరికాదు. బయోమెట్రిక్‌ను అమలు చేయలేదని సింగిల్ జడ్జి.. ప్రిలిమ్స్‌ను రద్దు చేయడం చెల్లదు' అని పేర్కొన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. 'కమిషన్‌కు మార్పులు చేసేందుకు అధికారాలున్నా.. బయోమెట్రిక్ అమలు చేయట్లేదని అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయాలి కదా? అత్యంత కీలక ఐఏఎస్, ఐపీఎస్ వంటి పోస్టులకు వెళ్లే వారి నియామకంలో నిబంధనలను అత్యంత సమర్థవంతంగా అమలు చేయకపోతే ఎలా? అభియోగాల మేరకు అక్రమాలు జరిగి ఉంటే పోస్టుల భర్తీ లక్ష్యం నీరుగారుతుంది. అక్రమాలు జరగలేదని నిరూపణ కోసం ఓ అభ్యర్థి మ్యారేజీ సర్టిఫికెట్ తెచ్చే స్థాయికి కమిషన్ దిగజారింది' అని వ్యాఖ్యానించింది.

కావాలనే బయోమెట్రిక్ తీసుకోలేదు

ప్రతివాదుల తరఫున గిరిధర్‌రావు వాదనలు వినిపిస్తూ.. 'కమిషన్ ఉద్దేశపూర్వకంగానే జూన్ 11న బయోమెట్రిక్ అమలు చేయలేదు. గత అక్టోబర్‌లో ప్రిలిమ్స్ నిర్వహించినప్పుడు అమలు చేసింది. గత సంవత్సరం ఏప్రిల్‌లో ఇచ్చిన నోటిఫికేషన్ మేరకే రెండుసార్లు ప్రిలిమ్స్ నిర్వహించారు. అలాంటప్పుడు ఒకసారి బయోమెట్రిక్ తీసుకుని, ఒకసారి తీసుకోకపోవడం అక్రమాలకు తావిచ్చినట్లే అవుతుంది' అని అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'బయోమెట్రిక్ లేదనే విషయం హాల్‌టికెట్లపైనే ఉన్నప్పుడు పరీక్ష నిర్వహించడానికి ముందుగానే న్యాయస్థానాన్ని ఎందుకు ఆశ్రయించలేదు. ఒకసారి పేపర్ లీకేజీ కారణంగా పరీక్ష రద్దయింది. ఇప్పుడు బయోమెట్రిక్ అమలు చేయలేదని రద్దయింది. ఇలా అయితే అభ్యర్థుల పరిస్థితి ఏంటి? ఇది ప్రిలిమ్స్ మాత్రమే.. దీనిలో ఎంపికైనా తర్వాత 1:50 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ప్రతిభావంతులు కాకపోతే మెయిన్స్‌లో గట్టెక్కడం కష్టమే కదా' అని ప్రశ్నించింది.

అభ్యర్థులు ఎక్కువగా ఉన్న కారణంగానే..

అభ్యర్థుల సంఖ్య 2.33 లక్షలు ఉండటంతోనే బయోమెట్రిక్ తీసుకోవడం కష్టమని.. నిలిపివేసినట్లు ఏజీ చెప్పారు. దీనికి గిరిధర్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇతర పోస్టుల నియామక పరీక్షలకు కమిషన్ బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేసిందన్నారు. కానిస్టేబుల్ పోస్టులకు 1.30 లక్షలకుపైగా అభ్యర్థులు హాజరయ్యారని, జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు లక్ష మంది వరకు హాజరైనా బయోమెట్రిక్ తీసుకున్నారన్నారు. అనంతరం ఎన్ని కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు.. రాసిన అభ్యర్థుల వివరాలతో పూర్తి నివేదిక అందజేయాలని ధర్మాసనం కమిషన్‌ను ఆదేశించింది.

చెప్పాల్సింది ఇంతే: సరైనది చేయండి, పవిత్రంగా ఉండండి.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 27 సెప్టెంబర్ 2023

ఈ పరిస్థితి మారేదెట్లా?

భారత – కెనడా సంబంధాలు కొంతకాలంగా ఇరుకునపడ్డ మాట నిజమే కానీ, గత వారం రోజుల పరిణామాలతో అధఃపాతాళానికి పడిపోయాయి. కెనడా పౌరుడైన ఓ ఖలిస్తానీ సిక్కును భారత్ హతమార్చిందంటూ ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో గత వారం చేసిన ఆరోపణ ఒక్కసారిగా పరిస్థితిని దిగజార్చింది. భారత ప్రభుత్వం ఆ ఆరోపణల్ని తీవ్రంగా ఖండించడం, కెనడా తన మాట వెనక్కి తీసుకోకపోవడం, వరుస దౌత్యవేత్తల బహిష్కరణలు... కొద్దిరోజులుగా వేడిని పెంచుతూ వస్తున్నాయి. భారత్‌లో పర్యటించదలచినవారికి అనేక జాగ్రత్తలు చెబుతూ కెనడా ప్రత్యేక సూచన లిస్తే, కెనడా దేశస్థులకు వీసాల జారీని భారత్ నిలుపు చేసింది. ఆలస్యంగానైనా నిద్ర లేచిన భారత సర్కార్ సదరు ఖలిస్తానీ మద్దతుదార్లకు దేశంలో ఉన్న ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడం మొదలెట్టింది. తాజాగా ఐరాస వేదికపైనా అంతర్లీనంగా కెనడా వైఖరిని ఎండగట్టింది. వరుస చూస్తే, రెండు దేశాల మధ్య దౌత్యఘర్షణకు ఇప్పుడప్పుడే తెర పడేలా కనపడట్లేదు.

ఈ వ్యవహారంలో తప్పంతా కెనడా ప్రధానిదే. వారం క్రితం భారత్‌పై తీవ్ర ఆరోపణతో రెండు దేశాల మధ్య దౌత్య తుపాను రేపిన ట్రూడో ఇప్పటి వరకు సాక్ష్యం చూపలేకపోయారు. అదేమంటే, 'ఫైవ్ ఐస్' గూఢచర్య కూటమి సేకరించిన సమాచారమే ఈ ఆరోపణకు ఆధారమని కెనడా దేశపు మీడియాలో లీకులు వస్తున్నాయి. ఆ మాటకొస్తే ట్రూడో హయాంలో భారత్‌కు వ్యతిరేకంగా జరిగిన అరాచకాలు అనేకం. భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యను కొని యాడే శకటాలు, దౌత్యవేత్తలపై హింసను ప్రేరేపిస్తూ ''కిల్ ఇండియా'' పేరిట పోస్టర్లు, హిందూ ఆలయాలపై దాడుల లాంటివన్నీ ఆయన ఏలుబడిలో ఎగసిపడ్డవే. కెనడాలోని సిక్కు ఓట్ల కోసం తీవ్రవాద సభలకు సైతం ఆయన హాజరయ్యారు. అప్పట్లోనే భారత దౌత్యవేత్తలు తమ అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

కెనడా ప్రయోజనాల కన్నా తన స్వప్రయోజనాలకే ట్రూడో పెద్ద పీట వేస్తున్నట్టున్నారు. ఖలిస్తానీ మద్దతుదారుల్ని సంతోషపరచి, నాలుగు ఓట్లు ఎక్కువ సంపాదించాలన్నదే ఆయన తాపత్రయంగా కనిపిస్తోంది. పరిణతి లేని ఆయన రాజకీయ చర్యలపై నిపుణులైన కెనడా దౌత్యవేత్తలు ఇప్పటికే పెదవి విరిచారు. 2018లో భారత పర్యటన సందర్భంగా నేరస్థుణ్ణి విందుకు ఆహ్వానించి ఫోటోలు దిగి రచ్చ రేపిన ట్రూడో తన తాజా చర్యలతో ఏకంగా భారత్‌తో బంధానికే పూర్తిగా నిప్పంటించేశారు. నిజానికి, భారత అభ్యర్థనపై 2016 నుంచి ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీస్‌లో ఉన్న తీవ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ జూన్ 18న గుర్తు తెలియని దుండగుల తుపాకీ కాల్పులకు చనిపోయాడు. నాలుగు నెలల తర్వాత ట్రూడో నిద్ర లేచి, అది భారత్ చేసిన హత్య అనడం విడ్డూరం.

పడిపోతున్న ప్రతిష్ఠను నిలబెట్టుకొనేందుకే జస్టిన్ ట్రూడో ఇలా అంతర్జాతీయంగా భారత్‌పై బురద జల్లాలని ప్రయత్నిస్తున్నారు. గతంలో 1968 నుంచి 1984 మధ్య కెనడా ప్రధానిగా పనిచేసిన ఆయన తండ్రి ప్రియర్ ట్రూడో సైతం ఇలాగే పెడసరంగా వ్యవహరించారు. సిక్కు తీవ్రవాది తల్విందర్ సింగ్ పర్మార్‌ను అప్పగించమని అభ్యర్థిస్తే నిరాకరించారు. చివరకు ఆ తీవ్రవాది ఓ ఉగ్రసంస్థకు అధిపతై, 1985లో ఎయిరిండియా విమానాన్ని బాంబు పెట్టి పేల్చేసి, 329 మంది మరణానికి కారణమయ్యాడు. 2016లో తండ్రి లానే కొడుకు ప్రధాని కాగానే, ఆ కేసులో శిక్షపడ్డ ఏకైక వ్యక్తి పెరోల్‌పై విడుదలయ్యాడు. 2018లో ట్రూడో భారత్ సందర్శించినప్పుడు అప్పటి పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ తాము అన్వేషిస్తున్న తీవ్రవాదుల జాబితాను అందజేశారు. తాజాగా మరణించిన నిజ్జర్ పేరూ అందులో ఉంది. ఈసారి పెద్ద ట్రూడో బాటలోనే చిన్న ట్రూడో చర్యలేమీ చేపట్టలేదు.

నిజ్జర్ మరణంపై ఇంతవరకు చేసిన దర్యాప్తు, అనుమానితులు, అదుపులో తీసుకున్న పేర్లేమీ కెనడా చెప్పట్లేదు. ఇండియాపై ఆరోపణలు చేసి పది రోజులవుతున్నా తన వాదనకు బలం చేకూర్చే సాక్ష్యమేమీ ట్రూడో చూపలేకపోయారన్నది గుర్తించాలి. ఈ గొడవ ఇలా నడుస్తుండగానే, నాజీ సంబంధాలున్న ఓ వయోవృద్ధుడిని శుక్రవారం కెనడా పార్లమెంట్ గౌరవించి, మరో తప్పు చేసింది. ఆఖరికి స్పీకర్ క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. తాము నెత్తిన పెట్టుకుంటున్న వ్యక్తుల నేపథ్యం తెలుసుకోవడంలో కెనడా పాలనా యంత్రాంగం విఫలమవుతోందనడానికి ఇది మరో మచ్చుతునక. భారత్ సైతం విదేశీగడ్డపై నివసిస్తూ, మాతృదేశానికి ద్రోహం చేయాలని చూస్తున్నవారిపై ఇకనైనా కఠినంగా వ్యవహరించాలి. ఈ ఖలిస్తానీలకు నిధులెక్కడ నుంచి వస్తున్నాయి, వారికి తెరచాటు అండదండ ఎవరనేది కనిపెట్టి, సాక్ష్యాధారాలతో అంతర్జాతీయంగా బట్టబయలు చేయాలి.

దేశంలో ద్రవ్యోల్బణం, అధిక వడ్డీరేట్ల లాంటి వంద తలనొప్పులున్న ట్రూడో నిరాధార ఆరోపణలకు దిగే కన్నా ముందు ఆ సమస్యలపై దృష్టి పెట్టాలి. ఎనిమిదేళ్ళ క్రితం ఎన్నుకున్న తనను 63 శాతం మంది ఇప్పుడు వ్యతిరేకించడానికి కారణాలు గ్రహించాలి. ఎన్నికల్లో ఓట్లు, సీట్లు, నిధుల కోసం ఆయన పార్టీ వర్గాలు ఖలిస్తానీ అనుకూల వర్గాలపై అతిగా ఆధారపడడం మానుకోవాలి. పౌరుల భావస్వేచ్ఛను పరిరక్షించాల్సిందే కానీ, ఆ మిషతో తీవ్రవాదం సాగిస్తే సహించబోమని అక్కడి సిక్కు ప్రవాసీలకూ స్పష్టం చేయాలి. కెనడాకు 10వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి భారత్. అక్కడి పర్యాటకుల సంఖ్యలో నాలుగో స్థానం మనదే. కెనడాకెళ్ళే విద్యార్థుల్లో 40 శాతం మనవాళ్ళే. అందుకే ఎన్నికల్లో గెలుపోటముల కన్నా దేశాల మధ్య దశాబ్దాల బంధం ముఖ్యమని ట్రూడో గ్రహించాలి. భారత్ సైతం పరిస్థితిని చక్కదిద్దడమెలాగో ఆలోచించాలి. ఆ దిశగా అడుగులు వేయాలి. ఇరుపక్షాలకూ కావాల్సిన అమెరికా మధ్యవర్తిత్వమూ అందుకు కలిసిరావచ్చు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.8.49 వరకు తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ధనిష్ఠ ఉ.6.06 వరకు తదుపరి శతభిషం (తెల్లవారితే గురువారం), **వర్జ్యం:** ప.12.46 నుండి 2.15 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.29 నుండి 12.17 వరకు, **అమృత ఘడియలు:** రా.9.43 నుండి 11.14 వరకు.

సూర్యోదయం : 5.53
సూర్యాస్తమయం: 5.52
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

జెనరిక్ ఔషధాలంటే నాసిరకం కాదు!

విశ్లేషణ



డాక్టర్ కె.కె. తల్వార్

వైద్యులు తప్పనిసరిగా జెనరిక్ ఔషధాలనే రాయాలని ఇటీవల జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) ఓ ప్రకటన విడుదల చేసి, వైద్యుల ఆందోళన అనంతరం ఆ నిర్ణయాన్ని నిలిపివేసింది. దేశంలో అందుబాటులో ఉన్న కొన్ని జెనరిక్ ఔషధాలు నాసిరకమైనవన్న అభిప్రాయం సమాజంలో ఉంది. దీని కారణంగానే, రోగులు వాటిని ఉపయోగించడానికి ఇష్టపడటం లేదు. అధిక ధర ఉన్నప్పటికీ 'బ్రాండెడ్' మందులను తీసుకోవడానికే మొగ్గుచూపుతున్నారు. సాధారణంగా తయారీ ప్రక్రియలో నిర్లక్ష్యం, లేదా ఉద్దేశపూర్వకంగా తప్పు చేయడం వలన నాసిరకం మందులు (కలుషితమైనవి అయినా లేదా నాణ్యత లేనివైనా) ఉత్పత్తవుతాయి. అందువల్ల, మన నియంత్రణ యంత్రాంగాన్ని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలి.

ప్రపంచ ఫార్మసీగా భారత్‌ను పేర్కొంటారు. ప్రపంచవ్యాప్తంగా భారీ సంఖ్యలో జెనరిక్ మందులు భారత్ నుండి ఎగుమతి అవుతాయి. 21వ శతాబ్ది ప్రారంభం వరకు, మన దేశంలోని పేటెంట్ వ్యవస్థ ఉత్పత్తి పేటెంట్లను కాకుండా ప్రక్రియ పేటెంట్లను మాత్రమే అనుమతించింది. ఇది భారతీయ ఔషధ పరిశ్రమకు, పేటెంట్ ఉల్లంఘనకు పాల్పడకుండా ఔషధాలను తయారు చేయడానికి అవకాశాన్ని కల్పించింది. 'రివర్స్ ఇంజనీరింగ్' విధానం వల్ల వివిధ తయారీ ప్రక్రియలు అభివృద్ధి చెందగలవు. భారతీయ తయారీ రంగం విజయగాథల్లో ఒకటిగా భారతదేశ ఔషధ రంగాన్ని పరిగణిస్తున్నారు. ప్రత్యేకంగా, హెచ్ఐవి/ఎయిడ్స్, ప్రాణాలను కాపాడే వ్యాక్సిన్‌లు వంటి సంక్లిష్ట రంగాల్లో ఇవాళ మనం ప్రపంచం మొత్తానికి జెనరిక్ ఔషధాలకు సంబంధించి అతిపెద్ద సరఫరాదారుగా ఉన్నాము. 'బ్రాండెడ్' ఔషధాల లాగే జెనరిక్ మందులు కూడా అదేవిధమైన క్రియాశీల పదార్థం కలిగినవి కాబట్టి, ఒకేరకమైన ప్రయోజనాలను కలిగిస్తాయి.

జెనరిక్ ఔషధాల ధర తక్కువగా ఉండటమే వాటిని సమర్థించడానికి ప్రధాన కారణం. ఎందుకంటే అవి పదేపదే జంతు, క్లినికల్ అధ్యయనాలకు గురికావాల్సిన అవసరం లేదు. ధర సమస్య దృష్ట్యా, అవి అభివృద్ధి చెందుతున్న దేశాలకు చాలా ముఖ్యమైనవి. అలాగే ఇవి ప్రపంచానికి విపరీతంగా ప్రయోజనం చేకూర్చాయి. ఔషధాల నాణ్యత విషయంలో ఏ విధమైన రాజీ ఉండకూడదన్నది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే దేశంలో అందుబాటులో ఉన్న కొన్ని జెనరిక్ మందులు నాసిరకమైనవన్న అభిప్రాయం సమాజంలో ఉంది. దీని కారణంగానే, రోగులు సహేతుకంగానే జెనరిక్ ఔషధాలను ఉపయోగించడానికి ఇష్టపడటం లేదు. అధిక ధర ఉన్నప్పటికీ బ్రాండెడ్ మందులను తీసుకోవడానికే వీరు తరచుగా మొగ్గు చూపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన జన్ ఔషధి ఔట్‌లెట్లలో పేలవమైన అమ్మకాలే దీనికి నిదర్శనం.

వైద్యులు తప్పనిసరిగా జెనరిక్ మందులనే రాయాలని ఇటీవల జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఓ ప్రకటన విడుదల చేసింది. అందుబాటులో ఉన్న జెనరిక్ ఔషధాల నాణ్యతకు సంబంధించిన తీవ్రమైన సమస్యను ఇది తెరపైకి తెచ్చింది. ఆ ప్రకటనపై వైద్యులు సముచితమైన ఆందోళనలను వ్యక్తం చేశారు. ఇది మీడియాలో ప్రముఖంగా వచ్చింది. దీంతో జెనరిక్ ఔషధాలను వైద్యులు తప్పనిసరిగా రాయడానికి సంబంధించిన తన నిర్ణయాన్ని ఎన్ఎంసి ప్రస్తుతానికి నిలిపివేయడం సరైన చర్య. ఏదేమైనప్పటికీ, జెనరిక్ ఔషధాల ప్రాధాన్యతపై దృష్టి సారించాల్సిన అవసరమైతే ఉంది. నిజానికి, ఆరోగ్య సంరక్షణ కోసం పెట్టే ఖర్చును తగ్గించడానికి జెనరిక్ ఔషధాల వినియోగం చక్కటి మార్గం. ప్రభుత్వం కూడా నాణ్యమైన జెనరిక్‌లను నిర్ధారించడానికి అన్ని విధాలా కృషి చేయాలి.



మన దేశంలో నకిలీ లేదా నాసిరకం ఔషధాలు ఉండటం, ప్రధానంగా పేలవమైన క్రమబద్ధీకరణ వ్యవస్థ ఫలితమే. అలాంటి కొన్ని మందుల ఉపయోగం తర్వాత ఉత్పన్నమైన తీవ్రమైన సమస్యలకు సంబంధించిన సంఘటనలు కూడా బయటకు వచ్చాయి. గత సంవత్సరం, ఒక కంపెనీ తయారు చేసిన ప్రొపోఫోల్ ఇంజెక్షన్‌ను ఉపయోగించడం వల్ల ఏర్పడిన ప్రతికూల ఫలితాలు, ఆఖరికి మరణం సంభవించడం కూడా చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్ దృష్టికి వచ్చింది. భారతదేశం నుండి ఎగుమతైన దగ్గు సిరప్ వాడకం వల్ల గాంబియాలో నమోదైన మరణాలు, ఫార్మా హబ్‌గా మన దేశానికి ఉన్నపేరు ప్రతిష్ఠను దెబ్బతీశాయి.

నాసిరకం మందులు వాడిన తర్వాత ఉండే ప్రమాదాల్లో తగిన రీతిలో లేని ప్రతిస్పందన, ఆ ఔషధానికి నిరోధకత అభివృద్ధి కావడం వంటివి తీవ్రమైన ఆందోళన కలిగించే అంశాలు. సమర్థవంతమైన నియంత్రణ యంత్రాంగం లేనప్పుడు, కొన్ని ఔషధ తయారీ సంస్థలు డబ్బును ఆదాచేసుకునే ప్రయత్నంలో, అంత ర్జాతీయంగా ఆమోదించిన ఉత్తమ పద్ధతులను అనుసరించకుండా విస్మరిస్తున్నాయి. వీటి ఉత్పత్తుల విషయంలో కంపెనీలు చాలా తరచుగా రాజీపడి పోతున్నాయి. నిర్లక్ష్యం, కల్తీ ఉండటం వంటి నిజాయితీ లేని పద్ధతులను కూడా గమనించవచ్చు. సాధారణంగా తయారీ ప్రక్రియలో నిర్లక్ష్యం లేదా ఉద్దేశపూర్వకంగా తప్పు చేయడం వలన నకిలీ మందులు (కలుషితమైనవి అయినా లేదా నాణ్యత లేనివైనా) సంభవిస్తాయి. ఇది ఏ విధంగానూ ఆమోదయోగ్యం కాదు. దీన్ని తీవ్రంగా ఖండించాల్సి ఉంది.

బ్రాండెడ్ ఔషధాల లాగే ప్రభావవంతమైనవనీ, సురక్షితమైనవనీ, వాటికి ప్రత్యామ్నాయం కాగలవనీ తగిన ధ్రువీకరణ జరిగిన తర్వాత మాత్రమే యూరోపియన్ దేశాలు, అమెరికా జెనరిక్ ఔషధాలను ఉపయోగించడానికి ఆమోదిస్తాయనేది అందరికీ తెలిసిందే.

జెనరిక్ ఔషధాలను ఆమోదించడానికి కఠినమైన సమీక్షా ప్రక్రియ అమలులో ఉంటుంది. ఉదాహరణకు, అమెరికాకు చెందిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ), ఉత్తమ ఉత్పాదక పద్ధతులకు అనుగుణంగా ఉండేలా తయారీ ప్లాంట్‌లను కూడా తనిఖీ చేస్తుంది. ఇది జెనరిక్ ఔషధాలపై రోగి విశ్వాసాన్ని పెంచడానికి ఉపయోగపడుతుంది. ఐఎమ్ఎస్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ ప్రకారం, జెనరిక్ మందులు అమెరికాలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు ఒక దశాబ్దంలో (2009–2019) దాదాపు 2.2 ట్రిలియన్ డాలర్లను ఆదా చేశాయి. జెనరిక్ ఔషధాలు ఎంత ముఖ్యమైనవో ఈ సొమ్మే చెబుతోంది.

అందువల్ల, మనం పాఠాలు నేర్చుకుని, మన నియంత్రణ యంత్రాంగాన్ని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలి. కచ్చితమైన నాణ్యతా నియంత్రణ చర్యలు అమలులో లేకుంటే, అసమర్థమైన మందులు, తీవ్రమైన దుష్ప్రభావాల రూపంలో జంట ప్రమాదాలు అలాగే ఉంటాయి. మన ప్రస్తుత విధాన మార్గదర్శకాలను పునఃపరి శీలించి, అమలు ప్రక్రియను బలోపేతం చేయడం తక్షణ అవసరం. పూర్తి శిక్షణ పొందిన నిపుణులు నిర్వహించే పరీక్షా సౌకర్యాల రూపంలో తగిన మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలి. ప్రస్తుతమున్న చట్టబద్ధమైన, ఇతర రక్షణలకు చెందిన కచ్చితమైన పర్యవేక్షణ చాలా ముఖ్యమైనది. చట్టపరమైన నియంత్రణ విధానాలు కంపెనీలు స్వీయనియంత్రణను ప్రోత్సహించే విధంగా నిర్మాణాత్మకంగా ఉండాలి. అయితే వికృతమైన కేసులను సాహసంతో ఎదుర్కొ వటానికి సంకల్పం ఉండాలి. భారతదేశంలో ఔషధాల నాణ్యతను నియంత్రించడానికి బాధ్యత వహించే 'సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్' (సీడీఎస్‌సీవో)ను తప్పనిసరిగా బలోపేతం చేయాలి.

మన ఔషధ అప్రమత్తత, నిఘా వ్యవస్థ జాగరూకత కార్యక్రమాలను కూడా శక్తిమంతం చేయాల్సిన అవసరం ఉంది. మార్కెటింగ్ అనంతరం మన ఉత్పత్తుల భద్రతను నిర్ధారించడానికి ఇవి మార్గాలు. ఔషధ హెచ్చరికల తర్వాత, వాటిని వెనక్కి తీసుకునే ఏ తదుపరి చర్యనైనా తప్పనిసరిగా పబ్లిక్ డొమైన్‌లో వీలైనంత త్వరగా ఉంచాలి.

నాణ్యమైన జెనరిక్ ఔషధాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత, ఇక బ్రాండెడ్ మందులను మార్కెట్ చేయవద్దని ప్రభుత్వం ఔషధ కంపెనీలను ఆదేశించాలి. ఫార్మాస్యూటికల్ కంపెనీలు తమ మార్కెటింగ్ బడ్జెట్‌లను తగ్గించి, పరిశోధన, అభివృద్ధితో పాటు నాణ్యతా నియంత్రణపై ఎక్కువ ఖర్చు చేసేలా ప్రోత్సహించాలి.

నాణ్యమైన జెనరిక్ ఔషధాలను నిర్ధారించే సవాలును సీడీఎస్‌సీఓ తప్పనిసరిగా ఎదుర్కోవాలి. మన ఇంటిని మనం చక్కదిద్దుకున్న తర్వాత, జాతీయ వైద్య కమిషన్ ఆదేశాన్ని స్వాగతించవచ్చు.

వ్యాసకర్త పీజీఐఎంఈఆర్ మాజీ డైరెక్టర్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

తగిన గౌరవం

వహీదా రెహమాన్ (ప్రసిద్ధ నటి)ను దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారంతో గౌరవించనుండటం గొప్ప వార్త. కొంచెం ఆలస్యంగా వచ్చినా, ఇప్పటికైనా వచ్చింది.

– ఖాలిద్ మొహమద్, దర్శకుడు – సినీ విమర్శకుడు

కొన్నైనా చదవండి!

సగటు పాఠకుడు నిమిషానికి 240 పదాలు చదవగలడు. రోజుకు 20 నిమిషాలు చదివినా, ఏడాదికి 18 లక్షల పదాలు అవుతాయి. ఇంకో రకంగా చెప్పాలంటే, 25–30 అనువాద పుస్తకాలు అవుతాయి. మీతో అనువాదాలు చదివించాలన్నది నా ఆసక్తి!

– అరుణవ సిన్హా, అనువాదకుడు

మీకేం తెలుసు?

సినీ నటి పరిణీతి చోప్రా తన పెళ్లిలో ఎరుపు రంగు దుస్తులు ధరించలేదని కొందరు ట్రోల్ చేస్తున్నారు. కన్నడిగ, మలయాళీ వధువులు సంప్రదాయంగా పూర్తి తెలుపు లేదా భిన్నమైన అంచులతో కూడిన తెలుపు చీర కట్టుకుంటారు. తెలుగువాళ్లలో కొంతమంది పసుపు నీళ్లలో ముంచిన తెల్ల కాటన్ చీర కట్టుకుంటారు. వీళ్లంతా హిందువులు కాదనా వీళ్ల ఉద్దేశం?

– అనూషా రవి సూద్, జర్నలిస్ట్

వాళ్లకూ తెలుసు

పాకిస్తానీయుల నిజాయతీ నాకు నచ్చుతుంది. 'తీవ్రవాదాన్ని తిరస్కరించండి' అని నేను దేశం పేరైనా ఎత్తకుండా ఎప్పుడు ట్వీట్ చేసినా, వేలాది పాకిస్తానీయులు నా టైమ్‌లైన్‌లోకి వచ్చి నన్ను దూషిస్తుంటారు. తీవ్రవాద ఫ్యాక్టరీ పాకిస్తాన్ కాకుండా ఇంకోటి ఉండదని వాళ్లకు కూడా తెలుసు.

– సాజిద్ యూసుఫ్ షా, కశ్మీర్ న్యాయవాది

మురిపెం మాత్రమే!

ఇండియా గొప్ప దేశం. కానీ ప్రపంచ శక్తి కానిదాన్ని మోదీ ప్రభుత్వం అలా చూపించే యత్నం చేస్తోంది. ఈ తరహా తీవ్ర జాతీయవాదం ప్రమాదకరం. అది మరెవరినో కాదు, భారతీయులను ప్రభావితం చేస్తుంది. వేళ్లు గట్టిగా లేనంతవరకూ ఏ దేశమూ తన చివుళ్లను చూసి మురిసిపోదు.

– ఆశిస్ బసు, కెనడా ప్రొఫెసర్

నిశ్శబ్దం సుఖం

వాస్తవాలు, సత్యాలతో నిమిత్తం లేకుండా తమ భ్రమల్లో ఉండేవారితో వాదించడం కాలయాపన. అన్నీ సత్యాలు చూపినా కొంతమంది వాటిని అర్థం చేసుకోలేరు. కొంతమందికి అహం అడ్డొస్తుంది. అజ్ఞానం అరుస్తున్నప్పుడు, ప్రజ్ఞ తన పని తాను చూసుకోవడం మంచిది.

– అఫ్షైన్ ఇమ్రానీ, కార్డియాలజిస్ట్

నిజమైన కర్మయోగి

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నేటితో (26 సెప్టెంబర్) 91 ఏళ్లు. నాకు ఇష్టమైన జ్ఞాపకాల్లో ఒకటి, 1999లో ఆయన లోక్‌సభకు పోటీచేసినప్పుడు (ఓడిపోయారు) 'ఫాలో ద లీడర్' ప్రోగ్రామ్ చేయడం. ఆ రోజు వాళ్ల మనవడి బర్త్ డే అయితే, వాళ్ల కుటుంబం కేక్ కట్ చేయడాన్ని కూడా షూట్ చేయాలనుకున్నాం. 'మీరు నన్ను ఇంటర్వ్యూ చేస్తున్నారు, నా కుటుంబాన్ని కాదు' అని ఆయన సున్నితంగా తిరస్కరించారు.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ఆకుపచ్చ నగరం అందరికీ ఆదర్శం

సందర్భం



ప్రొ॥ మణికొండ వేదకుమార్

'సెప్టెంబర్ 28'... ఈ తేదీ రాగానే 1908లో హైదరాబాద్‌ను ముంచెత్తిన వరదలే గుర్తుకొస్తాయి. అప్పట్లో ఈ వరదలు నాటి నగరంలో అధిక భాగాన్ని జలమయం చేశాయి. వేలాది మందిని నిరాశ్రయులుగా మార్చాయి. వరదలు వచ్చి నేటికి 115 ఏళ్లు గడిచినా ఈ నగరానికి నాటి స్మృతులు నేటికీ తడి ఆరకుండానే ఉన్నాయి. అఫ్జల్ గంజ్ పార్క్ (నేడు ఉస్మానియా ఆసుపత్రిలో భాగం)లో ఉన్న ఓ చింత చెట్టునాటి జ్ఞాపకాలను నేటికీ గుర్తు చేస్తూనే ఉంటుంది. అంతేకాదు... ఈ ఏడాది సైతం సెప్టెంబర్ 28న అలనాటి వరద సమయంలో ఎంతో మందిని రక్షించిన చింతచెట్టు కింద జరిగే సమావేశం ఒక నాటి బీభత్సాన్ని గుర్తు చేసుకుంటూ... నేటి పరిస్థితుల్లో నగరాభివృద్ధికి నిపుణులు చేసే సూచనలకు వేదిక కానుంది.

మూసీ నదికి ఎన్నో సార్లు వరదలు వచ్చాయి కానీ 1908లో వచ్చిన వరద మాత్రం కని విని ఎరుగనిది. ఆ వరదలు వచ్చిన మూడేళ్లకు చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ గద్దెనెక్కారు. అలాంటి విపత్తు మరోసారి రావద్దని భావించారు. అందుకోసం సిటీ ప్లాన్ రూపొందించాలని, మౌలిక వసతులు కల్పించాలని సంకల్పించారు. 1914 లోనే సిటీ ఇంప్రూవ్ మెంట్ బోర్డు (సీఐబీ)ను ఏర్పాటు చేశారు. ప్రముఖ ప్లానర్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య మార్గదర్శకత్వంలో సీఐబీ అనేక పథకాలను అమలు చేసింది. అప్పట్లో నగర ప్రణాళిక... బాగ్ (ఉద్యానవనాలు), బౌలి (బావులు), తలాబ్ (చెరువులు)తో ముడిపడి ఉండింది. పచ్చదనం, జలాశ యాలు నగరప్రణాళికలో కీలక పాత్ర పోషించాయి.

ఈ శతాబ్ది కాలంలో నగరం ఎంతో అభివృద్ధి సాధించింది కాకపోతే... నగరం ఊహకు అందని విధంగా విస్తరించింది. జనాభా బాగా పెరిగిపోయింది. నగరంలో అనేక ప్రాంతాలు ఓ మోస్తరు వర్షానికే జలమయమైపోతున్నాయి. పుట్ట గొడుగుల్లా మురికివాడలు వెలిశాయి.

ఈ నేపథ్యంలోనే 'ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్', 'సెంటర్ ఫర్ దక్కన్ స్టడీస్' సంస్థలు ఇతర ఎన్జీఓలతో కలసి అర్బన్ ప్లానింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాయి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి, నగరాభివృద్ధితో ముడిపడిన సంస్థలకు అనేక సూచనలు చేశాయి. 1908 నాటి వరదల భయంకర పరిస్థితికి ప్రత్యక్షసాక్షిగా నిలిచిన చింతచెట్టు నీడలో 'ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్' ఎన్నో కార్యక్రమాలను నిర్వహించింది. 2008 సెప్టెంబర్ 28 నుంచి కూడా ఏటా ఈ కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగుతూనే ఉన్నాయి.

హైదరాబాద్ నగరం నేడు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోంది. వర్షాకాలంలో కాల్వలుగా మారుతున్న రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు మునిగిపోవడం, పెరిగిపోతున్న ట్రాఫిక్, వాహన కాలుష్యం, భూగర్భ జలాల కాలుష్యం, మంచి నీటి సమస్య, డ్రైనేజీ ఇక్కట్లు, ప్రజా రవాణా, మూసీ నది కలుషితం కావడం... మూసీ తీరంలో ఆక్రమణల తొలగింపు ఇలా చెబుతూ పోతే... ఈ జాబితాకు అంతు ఉండదు. ఈ సమస్యల్లో చాలా వాటిని పరిష్కరించేది హైదరాబాద్‌కు చక్కటి 'ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్' మాత్రమే.

హైదరాబాద్‌లో మంచినీటి సమస్య పరిష్కారమయ్యింది. రహదారులు వృద్ధి చెందాయి. ఓ.ఆర్.ఆర్. లాంటివి ఎన్నో వచ్చాయి. ఆర్.ఆర్.ఆర్.లు వస్తున్నాయి. ఫ్లై ఓవర్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఎయిర్ పోర్ట్, మెట్రో విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. నాలాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే నగరం శరవేగంగా విస్తరిస్తున్నందున సదుపాయాలను పెంచవలసి ఉంది. రాబోయే రోజుల్లో మంచిరేవుల నుంచి ఘట్ కేసర్ దాకా మూసీ మీదుగా రూ.10 వేల కోట్ల వ్యయంతో ఓఆర్ఆర్, విమానాశ్రయంతో పాటు, ఇతర ప్రాంతాలను కలుపుతూ ఎక్స్ ప్రెస్ వే కూడా రానుంది. ఇది ఒక్కటే కాదు. నగరానికి నాలుగు వైపులా సుమారుగా 100 కి.మీ దాకా ఇదే తరహా అభివృద్ధి కనిపిస్తోంది. ఇవన్నీ మనకు సానుకూల సంకేతాలే అనడంలో సందేహం లేదు. అభివృద్ధితో పాటూ సమస్యలూ తలెత్తుతాయి. వీటిని దుర్కొనడానికి మాస్టర్ ప్లాన్ అత్యంత కీలకం. 1975 నుంచి తెలంగాణ రాష్ట్రం



మూసీ వరదలకు 115 ఏళ్లు : ఆనాటి సాక్షి ఈ చింతచెట్టు

ఏర్పడే వరకు వివిధ సంస్థల ద్వారా హైదరాబాద్‌కు 6 మాస్టర్ ప్లాన్లు వచ్చాయి. వాటిని కలిపి ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ అమలుచేయాలి. హైదరాబాద్ నగరం ఎదుర్కొంటున్న సమస్యల్లో వాహన కాలుష్యం, ట్రాఫిక్ రద్దీ ముఖ్యమైన అంశాలుగా మారిపోయాయి. వీటిని నివారించేందుకు ప్రజా రవాణా ఒక్కటే మార్గం. అందులోనూ గ్రీన్ టెక్నాలజీ వినియోగాన్ని ప్రోత్సహించాలి. రెండవ దశ ఎమ్ఎమ్‌టీఎస్ వ్యవస్థను మరింతగా విస్తరించాలి. దాంతో పాటుగా ఇప్పటికే ఉన్న లోకల్ రైల్ లాంటి వాటిని అభివృద్ధి చేయాలి.

నగరం ఎదుర్కొంటున్న మరో ముఖ్యమైన సమస్య డ్రైనేజీ, వరదనీళ్లు. ఎక్కడికక్కడ మురుగునీటిని శుద్ధి చేసి ఆ నీటిని స్థానికంగా వినియోగించుకునేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలి. మిగులు నీటిని (శుద్ధి అయినవి మాత్రమే) స్థానిక చెరువుల్లోకి, మూసీనదిలోకి పంపించేలా చూడాలి. హైదరాబాద్‌కు వలసలను నివారించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. రాజధానికి 100 కి.మీ. వెలుపల కౌంటర్ మాగ్నెట్స్‌గా వివిధ చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి. ఈ తరహా ప్రయత్నాలు ఇప్పటికే మొదలయ్యాయి. వాటిని మరింత తీవ్రతరం చేయాలి. ఈ రోజున హైదరాబాద్ యావత్ దేశపు గ్రోత్ ఇంజిన్లలో ఒకటిగా నిలిచింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం కూడా హైదరాబాద్ నగరానికి ఇతోధికంగా నిధులు మంజూరు చేయాలి. హైదరాబాదు నగరంలో నేటికీ ఎన్నో చారిత్రక భవనాలు వారసత్వ జాబితాలోకి ఎక్కవలసి ఉన్నాయి. అలాంటి వాటిని పరిరక్షించుకోవాలి. కనీసం 5 లేదా 6 ప్రాంతాలు యునెస్కో గుర్తింపు వచ్చేందుకు అవకాశాలు ఉన్నాయి. ఆ ప్రక్రియను వేగవంతం చేయాలి. అఫ్జల్ గంజ్ పార్క్ లో ఉన్న చింత చెట్టునూ, ఆ స్థలాన్నీ నగర సహజ వారసత్వంలో భాగంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.


'నేను నిర్మించిన నగరం చేపలతో నిండిన మహా సముద్రంలా ఉండాలి' అని అప్పట్లో కులీ కుతుబ్ షా కోరుకున్నారు. అది నిజమైంది. నగరం జనసంద్రమైంది. ఇప్పుడు కావాల్సింది ఆ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మరింతగా అందించడం. హైదరాబాద్ నగరం కూడా శీతోష్ణస్థితి మార్పుల ప్రభావానికి లోనైంది. అతి తక్కువ సమయంలోనే అత్యంత భారీ స్థాయిలో వర్షాలు కురవడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. పరిస్థితి ఇలానే కొనసాగితే 115 ఏళ్ల క్రితం వరదలే మరోసారి నగరాన్ని ముంచెత్తే పరిస్థితి కూడా పొంచి ఉంది. పైన పేర్కొన్న అన్ని సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రణాళికలతో ముందుకెళ్లడం నేటి తక్షణావసరం.

వ్యాసకర్త 'ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్' ఛైర్మన్
మొబైల్: 98480 44713

ఉన్నది పంచుకోవాలి

బ్రహ్మచారులు, సాధువుల కన్నా సంసార జీవితాన్ని గడిపే వారికే కొన్ని దాన ధర్మాలు నిర్వర్తించే అవకాశముంది. వాళ్లను సాయం అడిగే వారుంటారు. అలాంటి వారికి సాయం చేసి పుణ్యం గడించే వీలు వీరికే ఎక్కువ.

సంసారి తన దగ్గర ఉన్నవాటిని ఎవరెవరికి ఏది అవసరమో వాటిని నిండు మనసుతో ఇవ్వాలి. ఏ మేరకు ఇవ్వగలరో ఆ మేరకు ఇస్తే చాలు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం వాటిలో ముఖ్యమైనది. కడుపునిండా అన్నం పెట్టిన మనిషి ముఖాన్ని చూడండి. అతని ముఖంలో ఓ తృప్తీ, ఓ ఆనందం కనిపిస్తాయి. కానీ మిగిలిన దానాల విషయంలో ఈ తృప్తి అంతగా కనిపించదు. ఎవరైనా తినడానికి వస్తున్నారేమోనని చూసిన తర్వాత తినాలనేది భారతీయ సంప్రదాయం. తన దగ్గర ఉన్నదాన్ని ఇతరులకు పెట్టక తానే తినడం, ఇతరులకు తెలీకుండా దాచిపెట్టి తినడాన్ని పాపమనే భావనా ఉంది. అందుకే అంటారు, ఎన్ని పూజలు, వ్రతాలు చేసినా దానం చేయడం ముఖ్యం. అందులోనూ 'అన్నదానా'న్ని మించింది మరొకటి లేదు.



ఓ ధనవంతుడు ఎన్నో పూజలు చేసి, భగవంతుడిని ఆరాధించి ఇక తానెవరికీ ఏదీ చెయ్యవలసిన అవసరం లేదని నిర్ణయించుకుని తన దగ్గరున్నది ఎవరికీ ఇవ్వక, ఎవరికీ పిడికెడు అన్నం కూడా పెట్టక 'తానూ, తన కుటుంబం' అనుకొని బతికాడు. తీరా ఆయన మరణించాక రాక్షసుడిగా మారి నదీ ప్రవాహంలో కొట్టుకొచ్చే శవాలను పీక్కుతింటూ తన తప్పు తాను తెలుసుకుని తనను క్షమించమని దేవుడిని వేడుకున్నాడు. దీంతో రాక్షస రూపం పోయి సద్గతి పొందినట్లు ఓ కథ ఉంది. ఇటువంటి కథల నుంచి గ్రహించాల్సిన నీతి ఒక్కటే: తాను తినడమే కాదు ఇతరులకూ పెట్టాలి.

– యామిజాల జగదీశ్

జీఎన్‌ఎం ప్రవేశ దరఖాస్తుల గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ(జీఎన్‌ఎం)లో 2023–2024 విద్యా సంవత్సరానికి మొదటి ఏడాదిలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి వెల్లడించారు. ఆన్‌లైన్ దరఖాస్తు, చెల్లింపు ప్రక్రియ గడువును 30వ తేదీ వరకు పొడిగించారు.

పుట్టిన 24 గంటలకే బైపాస్ సర్జరీ

- యూకే వైద్యుల ఆధ్వర్యంలో పసికందుకు నిమ్స్‌లో విజయవంతంగా శస్త్రచికిత్స
- వైద్యులకు బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ప్రశంసలు



లక్డీకాపూల్: గుండెలో రంధ్రంతో పుట్టిన ఒక రోజు వయసుగల ఆడశిశువుకు మంగళవారం నిమ్స్‌లో విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. యూకేకు చెందిన ఆల్డర్ హే ఆస్పత్రి కార్డియాక్ సర్జన్ డాక్టర్ రమణ ధన్నపునేని ఆధ్వర్యంలోని వైద్య బృందం నిమ్స్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ ఎ. అమరేశ్‌రావు, పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్‌తో కలసి ఈ సర్జరీ చేపట్టింది. నిజామాబాద్ జిల్లా చిట్టాపూర్‌కు చెందిన ప్రశాంత్ గ్రూప్–2 ప్రిపరేషన్ కోసం తన భార్య సమీర శ్రావణితో కలసి హైదరాబాద్ వచ్చి ఇబ్రహీంపట్నంలో ఉంటున్నాడు. ఆయన భార్య సోమవారం ఉదయం ఆడశిశువు (సిజేరియన్ శస్త్రచికిత్స ద్వారా)కు జన్మనివ్వగా శిశువుకు గుండెలో రంధ్రం ఉన్నట్లు గుర్తించిన వైద్యులు వెంటనే మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తరలించారు. అప్పటికే గుండె సంబంధ జబ్బులతో బాధపడుతున్న ఐదేళ్లలోపు చిన్నారులకు చార్లెస్ హార్ట్ హీరోస్ పేరిట నిమ్స్‌లో యూకే వైద్య బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని (ఈ నెల 24 మొదలు 30 వరకు) నిర్వహిస్తుండటంతో వారి ఆధ్వర్యంలో శిశువుకు బైపాస్ సర్జరీ చేశారు. కాగా, హైదరాబాద్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ (ఏపీ–తెలంగాణ) మంగళవారం నిమ్స్‌ను సందర్శించి డాక్టర్ రమణ, ఆయన బృందాన్ని కలిసి అభినందించారు. అలాగే గుండె సర్జరీ అనంతరం కోలుకుంటున్న ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు చెందిన చిన్నారి నిత్యను గారెత్ పరామర్శించారు. నవజాత శిశువులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను సమీక్షించారు.

మాయమవుతున్న రూ.కోట్ల విలువైన పీడీఎస్ బియ్యం

ఎంఎల్‌ఎస్ పాయింట్లలో ఇష్టారాజ్యం

- మెదక్‌లో రూ.3 కోట్ల విలువైన 18 లారీల బియ్యం గాయబ్
- పౌరసరఫరాల సంస్థ చైర్మన్ ఆకస్మిక తనిఖీలో వెల్లడి
- విజిలెన్స్ తనిఖీల్లోనూ బహిర్గతమవుతున్న వైనం
- ఎఫ్‌సీఐ గోదాముల నుంచే మొదలవుతున్న అక్రమాలు
- కాంట్రాక్టర్లు, మిల్లర్లు కుమ్మక్కు..దారి మళ్లుతున్న లారీలు



మెదక్‌లో తనిఖీలకు వెళ్తున్న పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్

సాక్షి, హైదరాబాద్/మెదక్: 'మెదక్‌లోని పౌరసరఫరాల సంస్థ మండల స్థాయి స్టాక్ (ఎంఎల్‌ఎస్) పాయింట్‌కు ఎఫ్‌సీఐ నుంచి వచ్చిన బియ్యంలో 362 టన్నుల మేర తేడా వచ్చింది. అంటే రూ.3 కోట్ల విలువైన 18 లారీల బియ్యం లెక్క దొరకడం లేదు. వీటితో పాటు 700 బేల్స్ గన్నీ బ్యాగులు లేవు. 320 టన్నుల ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ (ఎఫ్ఆర్‌కే) చెడిపోయాయి. మొత్తంగా ఈ మెదక్ ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో జరిగిన అక్రమాల విలువ సుమారు రూ.6 కోట్లు. ఆకస్మిక తనిఖీలో ఈ విషయాలు బహిర్గతమయ్యాయి..' పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ సోమవారం రాష్ట్ర స్థాయి అధికారుల వాట్సాప్ గ్రూప్‌లో స్వయంగా పోస్ట్ చేసిన వివరాలు ఇవి. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఎంఎల్‌ఎస్ పాయింట్లలో వ్యక్తిగతంగా తనిఖీలు నిర్వహించి శుక్రవారంలోగా నివేదిక ఇవ్వాలని ఆయన ఆ మెసేజ్‌లో స్పష్టం చేశారు.

నిఘా కరువు..రికార్డుల్లేవు

రైస్ మిల్లుల నుంచి సీఎంఆర్ కింద బియ్యం ఎఫ్‌సీఐ గోడౌన్‌లకు చేరతాయి. ఇక్కడి నుంచి ప్రజా పంపిణీ పథకం (పీడీఎస్) కింద ఎంఎల్‌ఎస్ పాయింట్లకు వెళతాయి. అక్కడి నుంచే జిల్లాల్లోని అన్ని రేషన్ దుకాణాలకు, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు సరఫరా అవుతాయి. అయితే ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద సరైన నిఘా, రికార్డుల వ్యవస్థ ఉండటం లేదు. రాష్ట్రంలో 171 ఎంఎల్‌ఎస్ పాయింట్లు ఉండగా, చాలాచోట్ల అధికారులు లేరు. ఔట్ సోర్సింగ్ కింద నియామకమైన డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈవో)ల పర్యవేక్షణలో నడుస్తున్నాయి. సెప్టెంబర్ 8న సంస్థ చైర్మన్ మంచిర్యాల ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసినప్పుడు రెండేళ్లుగా అక్కడ స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి లేడని, కేవలం డీఈవో ద్వారానే కోట్ల రూపాయల విలువైన బియ్యం పంపిణీ, సరఫరా ప్రక్రియ కొనసాగుతోందని తేలింది. అక్కడున్న 1,520 బ్యాగుల సన్నబియ్యం తినడానికి పనికిరాకుండా పోవడాన్ని కూడా గుర్తించారు.

గోదాముల నుంచే మొదలు..

ఎఫ్‌సీఐ గోదాముల నుంచి ఎంఎల్‌ఎస్ పాయింట్లకు బియ్యం వచ్చే సమయంలోనూ భారీగా అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్లతో మిల్లర్లు కుమ్మక్కై బియ్యం లోడ్‌లను పక్కదారి పట్టిస్తున్నట్లు ఇప్పటికే పలు సంఘటనల్లో బయటపడింది. గత ఏప్రిల్ మొదటి వారంలో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల ఎఫ్‌సీఐ గోదాం నుంచి సుల్తానాబాద్ ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు 5 లారీల్లో బియ్యం పంపించారు. కానీ 420 బస్తాల చొప్పున ఉన్న 3 లారీలు మాత్రమే గోదాంకు చేరాయి. మిగతా 2 లారీలు కాట్నపల్లి వద్ద ఉన్న ఓ రైస్ మిల్లులో అన్‌లోడ్ అయ్యాయి. ఈ విషయాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పౌరసరఫరాల సంస్థ చైర్మన్ లేఖ ద్వారా తెలియజేశారు. సంస్థ ప్రధాన కార్యాలయానికి సంబంధం లేకుండా పెద్దపల్లిలో సీఎంఆర్‌కు అదనంగా 30 వేల టన్నుల బియ్యం తీసుకున్నట్లు తేలిందని కూడా వివరించారు. ఈ ఘటనపై మరింత లోతైన విచారణ జరపాలని కోరారు. ఇక ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి చౌకధరల దుకాణాలకు బియ్యం పంపించే క్రమంలో కూడా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని స్పష్టమవుతోంది. ఎంఎల్‌ఎస్ పాయింట్లలో కూడా భారీ మొత్తంలో బియ్యం మాయం అవుతున్నాయి. మెదక్‌తో పాటు రామాయంపేట, తూప్రాన్ ఎంఎల్‌ఎస్ పాయింట్లలో 10 వేల క్వింటాళ్లకు పైగా పీడీఎస్, సన్న బియ్యం లెక్క తేలకుండా పోయినట్లు విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బయటపడింది. ఈ స్టాక్ పాయింట్ల ఇన్‌చార్జిలపై కేసులు కూడా నమోదయ్యాయి.

పట్టించుకోని అధికారులు

తనిఖీల్లో బయటపడుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు పెద్దగా దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. 171 ఎంఎల్‌ఎస్ పాయింట్లలో కనీసం 150 చోట్ల అక్రమాలు జరుగుతున్నాయని, జిల్లా స్థాయిల్లోని అధికార యంత్రాంగం అండతో బియ్యం యథేచ్ఛగా గాయబ్ అవుతున్నాయని సంస్థకు చెందినవారే అంగీకరించడం గమనార్హం.


'కడెం' నీరు వృథా

విరిగిన ప్రాజెక్టు 15వ నంబరు గేటు కౌంటర్ వెయిట్
ఇన్‌ఫ్లో లేకుంటే ప్రాజెక్ట్ మొత్తం ఖాళీనే

కడెం: నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్ట్ 15వ నంబరు గేటు కౌంటర్ వెయిట్(గేటుకు అనుసంధానంగా ఉండే భారీ దిమ్మె) మంగళవారం తెల్లవారుజామున విరిగిపోవడంతో నీరు వృథాగా పోతోంది. ప్రాజెక్ట్‌లోకి 13,428 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ఇరిగేషన్ అధికారులు నీటి విడుదలకు గేటును ఎత్తే క్రమంలో కౌంటర్ వెయిట్ విరిగిపోయింది. వరద గేటు మూసివేసే అవకాశం లేనందున నీరంతా వృథాగా పోతోంది. వెంటనే మరమ్మతులు చేయలేకపోయినా, ఇన్‌ఫ్లో లేకపోయినా ప్రాజెక్ట్ మొత్తం ఖాళీ అయ్యే ప్రమాదం పొంచి ఉంది. అయితే ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం ఉండడంతోపాటు ఇన్‌ఫ్లో వస్తున్నందున ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఎస్ఈ సుశీల్‌కుమార్, ఈఈ విఠల్ తెలిపారు. బుధవారం మెకానికల్ సిబ్బంది వచ్చి మరమ్మతులు చేపడుతారని, ఆయకట్టు రైతులు ఆందోళన చెందవద్దని భరోసానిచ్చారు.

ప్రస్తుత నీటిమట్టం 699అడుగులు

ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 700(7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 699.625(7.504టీఎంసీ) అడుగులు ఉందని, 3,461 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని, వరద గేటు ద్వారా 3,185 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోందని వెల్లడించారు. ఇదిలా ఉండగా ప్రాజెక్ట్ మొత్తం 18 వరద గేట్లకుగాను గతంలో 2వ నంబర్ గేట్‌కు కౌంటర్ వెయిట్ విరిగినా ఇప్పటికీ వేయలేదు. ఇప్పుడు తాజాగా 15వ నంబర్ గేట్ కౌంటర్ వెయిట్ విరగడంతో మొత్తంగా ఆ రెండింటినీ ఆపరేట్ చేసే పరిస్థితి లేదు.



కౌంటర్ వెయిట్ పడిపోవడంతో వృథాగా పోతున్న నీళ్లు

సింగరేణిలో 'బోనస్' బొనాంజా

సంస్థ లాభాల్లో 32 శాతం వాటా చెల్లింపు
- సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం
- సింగరేణి ఉద్యోగులకు రూ.711 కోట్ల బోనస్
- ఒక్కొక్కరికి సగటున రూ.1.6లక్షల నుంచి రూ.1.7లక్షలు వచ్చే అవకాశం



సాక్షిప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/హైదరాబాద్: సింగరేణి ఉద్యోగులకు లాభాల పంట పండింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో అర్జించిన రూ.2222 కోట్ల లాభాల్లో ఏకంగా 32 శాతం..అంటే రూ.711 కోట్లు సంస్థ ఉద్యోగులకు బోనస్‌గా చెల్లించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. గతేడాది లాభాల వాటాలో 30 శాతం బోనస్‌గా చెల్లించగా, ఈసారి రెండు శాతం పెంచారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ సీఎం ముఖ్యకార్యదర్శి ఎస్.నర్సింగ్‌రావు మంగళవారం రాష్ట్ర ఇంధనశాఖకు లేఖ రాశారు. దీంతో సగటున ఒక్కో ఉద్యోగికి రూ.1.60లక్షల నుంచి రూ1.70లక్షల వరకు లాభాల్లో వాటాగా చెల్లించే అవకాశముందని సంస్థ వర్గాలు అంచనా వేశాయి. ఏటా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం వచ్చే దసరా పండుగకు ముందే బోనస్ చెల్లిస్తారు. 11వ వేతన సవరణ సంఘం బకాయిల కింద ఈ నెలలో సింగరేణి సంస్థ ఉద్యోగులకు రూ.1450 కోట్లు చెల్లించిన విషయం తెలిసిందే. దీపావళి బోనస్ చెల్లింపులపై సైతం త్వరలో సంస్థ యాజమాన్యం ఓ నిర్ణయం తీసుకోనుంది. సింగరేణి సంస్థ చరిత్రలోనే ఇంత పెద్ద మొత్తంలో లాభాల బోనస్ చెల్లించనుండడం ఇదే తొలిసారి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి సింగరేణి లాభాల్లో వాటాను కార్మికులకు బోనస్‌గా ఇచ్చే సంప్రదాయం కొనసాగుతోంది. 1998లో తొలిసారిగా లాభాల్లో పది శాతాన్ని కార్మికులకు అందించారు.

ఎన్నికల ఎఫెక్ట్

రాష్ట్రంలో ఆరు జిల్లాల పరిధిలో సింగరేణి విస్తరించి ఉంది. 42 వేల మంది కార్మికులు/ఉద్యోగులు సంస్థలో పనిచేస్తున్నారు. హైకోర్టు తీర్పును అనుసరించి వచ్చే నెలలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే ఎరియర్స్, బోనస్ చెల్లింపులు చకచకా సాగుతున్నాయనే భావన కార్మిక వర్గాల్లో వ్యక్తమవుతోంది.

తెలంగాణ వచ్చాక సింగరేణిలో అందిన బోనస్ ఇలా...

ఆర్థిక సంవత్సరం	నికర లాభం	శాతం	ఒక్కో కార్మికుడికి వచ్చింది(సగటున)
2014-15	రూ. 490 కోట్లు	21	రూ. 17,522
2015-16	రూ. 1,066 కోట్లు	23	రూ. 41,923
2016-17	రూ. 395 కోట్లు	25	రూ. 17,563
2017-18	రూ.1,212 కోట్లు	27	రూ. 60,369
2018-19	రూ.1,763 కోట్లు	28	రూ. 1,00,889
2019-20	రూ. 993 కోట్లు	28	రూ. 60,468
2020-21	రూ. 272 కోట్లు	29	రూ. 18,647
2021-22	రూ.1,227 కోట్లు	30	రూ. 89,634
2022-23	రూ. 2,222 కోట్లు	32	రూ.1,60,000 (అంచనా)

- స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్)ను ఎన్నికలు ముగిసే వరకు స్తంభింపజేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి లేఖ రాశారు. కొద్దిరోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలకు విధివిధానాలు లేకుండా దబ్బులు పంచడం సరికాదన్నారు.

క్లుప్తంగా...

టీబీ మందుల కొరత లేదు

న్యూఢిల్లీ: భారత్‌లో టీబీ మందులకి ఎలాంటి కొరత లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం స్పష్టం చేసింది. ఆరు నెలలు, అంతకంటే ఎక్కువ రోజులకు సరిపడా మందులు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. నేషనల్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ (ఎన్‌టీఈపీ) కింద పంపిణీ చేసే ఔషధాలు లభించడం లేదని వచ్చిన కథనాలన్నీ తప్పుడువని పేర్కొంది. కీలకమైన సైక్లో సెరిన్ సహా అన్ని ఔషధాలు ఉన్నాయి. ఆగస్టులోనే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సరఫరా చేశామని కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది.

దక్షిణ కొరియా భారీ సైనిక పరేడ్

సియోల్: సోదర దేశం ఉత్తరకొరియాతో ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్న వేళ.. దక్షిణ కొరియా మంగళవారం భారీ సైనిక పరేడ్‌ను నిర్వహించింది. యుద్ధ ట్యాంకులు, ఫిరంగులు, డ్రోన్లు, శక్తివంతమైన బాలిస్టిక్ క్షిపణులు కలిపి 200 రకాలైన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను ప్రదర్శించింది. దీంతోపాటు 6,700 మంది కొరియా జవాన్లు, మరో 300 మంది అమెరికా సైనికులు పరేడ్‌లో పాల్గొన్నారు.

ఢిల్లీలోని దుకాణంలో 20 కోట్ల ఆభరణాలు చోరీ

న్యూఢిల్లీ: ఢిల్లీలోని భోగాల్ ఏరియాలోని ఓ నగల దుకాణంలోని రూ.20 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలను దొంగలు ఎత్తుకుపోయారు. ఆదివారం రాత్రి ఘటన చోటుచేసుకుంది. గుర్తు తెలియని ముగ్గురు దుండగులు ఉమ్రావ్ సింగ్ జువెల్లర్స్ దుకాణం గోడకు కన్నం వేసి లోపలున్న స్ట్రాంగ్ రూంను బద్దలు కొట్టారు. దుకాణంలో 30 కిలోల బంగారు ఆభరణాలు, రూ.5 లక్షల నగదు ఉన్నట్లు నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. అక్కడున్న సీసీకెమెరాలను దుండగులు ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు. సోమవారం కూడా దుకాణం మూసివేసి ఉండటంతో ఈ విషయం మంగళవారం వెలుగులోకి వచ్చినట్లు చెప్పారు.

జేపీ నడ్డా పూజలు చేస్తుండగా గణేశ్ మండపంలో మంటలు

పుణె: బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా పూజలు చేస్తున్న సమయంలోనే గణేశ్ మంటపంలో మంటలు చెలరేగాయి. భద్రతాధికారులు అప్రమత్తమై ఆయన్ను వెంటనే అక్కడి నుంచి బయటకు తీసుకువచ్చారు. మహారాష్ట్రలోని పుణెలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. లోకమాన్యనగర్‌లోని ఓ గణేశ్ మంటపంలో జేపీ నడ్డా, మహారాష్ట్ర బీజేపీ చీఫ్ చంద్రశేఖర్ బవాంకులేతో కలిసి పూజలు చేస్తున్నారు. అదే సమయంలో మంటపం పైభాగంలో మంటలు వ్యాపించాయి. దీంతో, భద్రతాధికారులు వారిని వెంటనే బయటకు తీసుకువచ్చారు.

రాజకీయ సౌలభ్యం కోసం... ఉగ్రవాదంపై మెతక వైఖరా?

ఐరాస వేదికపై కెనడాకు భారత్ చురకలు | పాక్, అమెరికాలకు కూడా



- అది పక్కా అవకాశవాద ధోరణే
- విదేశాంగ మంత్రి జై శంకర్ నిప్పులు
- ఏకస్వామ్య పోకడలు చెల్లవిక!
- పెద్ద దేశాల తీరునూ ఎండగట్టిన మంత్రి

ఐక్యరాజ్యసమితి: ఖలిస్తానీ ఉగ్రవాదం విషయంలో మెతకగా వ్యవహరిస్తున్న కెనడాకు ఐక్యరాజ్య సమితి వేదికగా భారత్ చురకలంటించింది. ఉగ్రవాదం, తీవ్రవాదం, హింసల విషయంలో కేవలం రాజకీయ సౌలభ్యం కోసం మెతక వైఖరి అవలంబించడం సరికాదని స్పష్టం చేసింది. ఇలాంటి అవకాశవాద ధోరణులకు దూరంగా ఉండాలని ఐరాస సభ్య దేశాలకు పిలుపునిచ్చింది. మంగళవారం ఐరాస 78వ సర్వ సభ్య సమావేశంలో మాట్లాడిన విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ ఈ మేరకు కుండ బద్దలు కొట్టారు. కశ్మీర్ విషయంలో అంతర్జాతీయ వేదికలపై పాకిస్తాన్ ప్రదర్శిస్తున్న కొద్ది బుద్ధులను కూడా ఏకిపారేశారు. 'ప్రాదేశిక సమగ్రత, ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో వేలు పెట్టరాదన్నవి కనీస మర్యాదలు. అంతే తప్ప ఇలాంటి విషయాల్లో తమ రాజకీయ స్వార్థాలకు, అవసరాలకు అనుగుణంగా ఇష్టానికి వైఖరులు మార్చుకునే తీరు సరి కాదు' అంటూ పాక్ తో పాటు పరోక్షంగా అమెరికా తీరును కూడా దుయ్యబట్టారు. ఐరాస వేదికగా పాక్ తాత్కాలిక ప్రధాని ఇటీవల దిగజారుడు వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఇక కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఇరు దేశాల మధ్య తీవ్ర విభేదాలకు, దౌత్య సంక్షోభానికి దారి తీసింది. హత్యలో భారత్ ప్రమేయం ఉందన్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో వ్యాఖ్యలతో మంటలు రాజుకున్నాయి. ఖలిస్తానీ అనుకూల పార్టీ మద్దతుతో అధికారాన్ని కాపాడుకుంటున్న ట్రూడో వారిని మంచి చేసుకునేందుకే ఇలా వ్యవహరిస్తున్నారని ఆయన సొంత పార్టీ ఎంపీలే విమర్శిస్తుండటం తెలిసిందే. అంతేగాక నిజ్జర్ హత్యకు సంబంధించి నిఘా సమాచారాన్ని కెనడాతో అమెరికా పంచుకుందని కూడా వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పాక్, అమెరికా తీరును పరోక్షంగా దుయ్యబడుతూ ఐరాస వేదికపై జై శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

పెద్ద దేశాలూ, కొద్ది బుద్ధులు!

పెద్ద దేశాల పెత్తందారీ, ఏకపక్ష పోకడలకు వ్యతిరేకంగా వర్ధమాన దేశాల గొంతుకను ఐరాస వేదికపై జై శంకర్ ఈ సందర్భంగా గట్టిగా వినిపించారు. కొన్ని పెద్ద దేశాలే తమ అవసరాలకు అనుగుణంగా అజెండాను నిర్దేశించి, మిగతా దేశాలన్నీ తమను అనుసరించాలని కట్టడి చేసే రోజులకు కాలం చెల్లిందని స్పష్టం చేశారు. 'ఈ పోకడలు ఎల్లకాలమూ చెల్లవు. వాటినెవరూ సవాలే చేయరని అనుకోవద్దు. వ్యాక్సిన్ల విషయంలో వర్ణ వివక్షను ఇంకెప్పుడూ అనుమతించరాదు. వాతావరణ మార్పులకు అడ్డుకట్ట వేయడంలో పెద్ద దేశాలు తమ బాధ్యతలను తప్పించుకోరాదు. నిరుపేద దేశాలకు అందాల్సిన ఆహార, ఇంధన నిల్వలను పెద్ద దేశాలు తమ మార్కెట్ బలాన్ని ఉపయోగించి చెరబట్టరాదు' అంటూ శషభిషలకు తావు లేకుండా స్పష్టం చేశారు. అభివృద్ధిలోనూ, అన్నింట్లోనూ అన్ని దేశాలకూ సమాన భాగస్వామ్యం కల్పించే నూతన ప్రజాస్వామిక వాతావరణం నెలకొని తీరుతుందని మంత్రి ధీమా వెలిబుచ్చారు. అంతర్జాతీయ మార్కెట్లలో కూడా అన్ని రకాల నిబంధనలు అన్ని విషయాల్లోనూ అన్ని దేశాలకూ సమానంగా వర్తించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్ ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. అలీనోద్యమానికి మద్దతిచ్చిన రోజుల నుంచి విశ్వమిత్ర (ప్రపంచ నేస్తం) స్థాయి దాకా భారత్ ఎదిగింది. మిగతా దేశాలన్నీ తమ జాతీయ ప్రయోజనాలే చూసుకుంటాయి. భారత్ మాత్రం విశ్వ శ్రేయస్సునే తన మేలుగా భావిస్తుంది' అని స్పష్టం చేశారు. ఆ గురుతర బాధ్యతను దృష్టిలో ఉంచుకునే జీ20 సారథ్యాన్ని భారత్ స్వీకరించిందని వివరించారు. 'ఇతర దేశాల వాదనను సానుభూతితో వినడం, వాటి వైఖరిని గౌరవించడం బలహీనత కాదు. పరస్పర సహకారానికి సూచిక. ఐరాస లక్ష్యానికి కొనసాగింపు' అంటూ చైనా మితి మీరిన దూకుడుకు కూడా జై శంకర్ చురకలు వేశారు.

శ్రీరాముడి విగ్రహ ప్రతిష్టకి జనవరి 22 ముహూర్తం ..?

న్యూఢిల్లీ: అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం వచ్చే ఏడాది జనవరి 20–24 మధ్య ఉంటుందని ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా చెప్పారు. మూడంతస్తుల్లో నిర్మాణం జరుపుకుంటున్న రామాలయంలో గ్రౌండ్ ఫ్లోర్ డిసెంబర్ చివరి నాటికి సిద్ధమైపోతుందని వెల్లడించారు. జనవరి 22న ఆలయంలో శ్రీరాముడి విగ్రహం ప్రాణప్రతిష్ట జరిపే అవకాశాలున్నాయని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని చెప్పారు. జనవరి 20–24 మధ్య ఆలయ ప్రారంభోత్సవానికి ముహూర్తాలు దివ్యంగా ఉన్నాయని ప్రధాని రావడానికి ఏ రోజు వీలవుతుందో అదే రోజు కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఆ తేదీని పీఎంఓ కార్యాలయం ఖరారు చేయాల్సి ఉంటుందని తెలిపారు. మంగళవారం ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

నిజ్జర్ హత్య విచారణకు సహకరించండి

వాషింగ్టన్: కెనడాలో ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యపై అమెరికా తన స్వరం పెంచుతోంది. నిజ్జర్ హత్యపై లోతుగా విచారించి కుట్రదారులకి తగిన శిక్ష విధించాలని కెనడా ప్రభుత్వానికి సూచించింది. ఈ విచారణలో కెనడా దర్యాప్తు సంస్థలకు సహకరించాలని భారత్‌పై ఒత్తిడి పెంచుతోంది. ఇప్పటికే నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని ట్రూడో ఆరోపిస్తే, దానిని భారత్ గట్టిగా తిప్పి కొట్టిన తెలిసిందే. నిజ్జర్ హత్య వెనుక భారత్ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని ట్రూడో చేసిన ఆరోపణలు అత్యంత ఆందోళనకరమైనవని, ఈ అంశంలో కెనడాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ అన్నారు. నిజ్జర్ హత్య వెనుకనున్న వారిని విచారించడం కెనడాకు అత్యంత సంక్లిష్టమైనదని, భారత్ ఈ విచారణకు సహకరించాలని మిల్లర్ విజ్ఞప్తి చేశారు.

మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

అదృశ్యమైన ఇద్దరు విద్యార్థులు దారుణ హత్య

- సామాజిక మాధ్యమాల్లో వారి ఫొటోలు వైరల్
- ఆగ్రహంతో నిరసనలకు దిగిన విద్యార్థులు
- హత్యకేసు దర్యాప్తు సీబీఐకి అప్పగింత
- అయిదు రోజులపాటు ఇంటర్నెట్ సేవలు నిలిపివేత

ఇంఫాల్: జూలై నుంచి కనిపించకుండా పోయిన ఇద్దరు విద్యార్థులు హత్యకు గురయ్యారని తెలియడంతో మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. మృతులను హిజం లింథోయింగంబి(17), ఫిజమ్ హేమ్‌జిత్(20)గా గుర్తించారు. వారి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మంగళవారం ఉదయం విద్యార్థులు ఇంఫాల్‌లో భారీ ర్యాలీ జరిపారు. సీఎం కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. అడ్డుకునేందుకు పోలీసులు లాఠీచార్జి చేయడంతోపాటు టియర్ గ్యాస్ ప్రయోగించాల్సి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం సంయమనం పాటించాలని, దర్యాప్తునకు సహకరించాలని ప్రజలను కోరింది. కిడ్నాప్, హత్యపై దర్యాప్తును సీబీఐకి అప్పగించామని తెలిపింది. విద్యార్థుల హంతకులను పట్టుకుని, కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేసింది. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్రంలో ఇంటర్నెట్ సేవలపై అయిదు రోజులపాటు నిషేధం విధిస్తున్నట్లు తెలిపింది. అన్ని స్కూళ్లకు శుక్రవారం వరకు సెలవులు ప్రకటించింది. దాదాపు నాలుగు నెలల అనంతరం రాష్ట్రంలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను ఈ నెల 23న పునరుద్ధరించిన విషయం తెలిసిందే. మైతేయి వర్గానికి చెందిన హిజం లింథో ఇంగంబి(17) ఆమె స్నేహితుడు ఫిజమ్ హేమ్‌జిత్(20) కలిసి జూలై 6వ తేదీన చురాచంద్‌పూర్‌లోని పర్యాటక ప్రాంతం లండాన్‌కు వెళ్లారు. ఆ తర్వాత వారి జాడ తెలియలేదు. వారి ఫోన్లు స్విచ్ఛాఫ్ అయ్యాయి. కుటుంబసభ్యులు ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా వారి మృతదేహాల ఫొటోలు సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఒక ఫొటోలో ఇద్దరు విద్యార్థుల పక్కన సాయుధులు నిలబడి ఉండగా, మరో ఫొటోలో ఇద్దరి మృతదేహాలున్నాయి. హంతకులను పట్టుకునేందుకు ఇప్పటికే పోలీసు బలగాలు వేట ప్రారంభించాయని సీఎం ఎన్.బిరేన్ సింగ్ తెలిపారు. హత్య ఘటనపై విచారణ చేపట్టేందుకు స్పెషల్ డైరెక్టర్ అజయ్ భట్నాగర్ నేతృత్వంలోని సీబీఐ బృందం ఇంఫాల్ చేరుకున్నట్లు అధికారులు తెలిపారు.

లాఠీచార్జిలో 45 మందికి గాయాలు

విద్యార్థుల కిడ్నాప్, హత్యను నిరసిస్తూ మంగళవారం విద్యార్థులు ఇంఫాల్‌లో భారీ ర్యాలీ చేపట్టారు. ముఖ్యమంత్రి కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా అడ్డుకున్న పోలీసులు, భద్రతాబలగాలతో బాహాబాహీకి దిగారు. దీంతో పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. లాఠీచార్జి చేశారు. ఈ ఘటనలో 45 మందికి పైగా విద్యార్థులు గాయపడ్డారు. వీరిలో ఎక్కువమంది బాలికలే ఉన్నారని పోలీసులు తెలిపారు. కాగా, ఇటువంటి అమానవీయ ఘటనలు జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గు చేటని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్‌లో మైతేయి, కుకీల మధ్య జరుగుతున్న ఘర్షణల్లో 175 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.



ఈ ఫోటోలో ఉన్నదెవరో గుర్తు పట్టారా ? ఒకరు బెంగళూరుకి చెందిన టెక్కీ, సిద్ పూరీ. అతని పక్కన బ్లూ జాకెట్, సన్‌గ్లాసెస్‌తో స్మార్ట్‌గా కనిపిస్తున్నదెవరో కాదు. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్. సామాజిక మాధ్యమాల్లో సిద్ ఈ ఫొటో షేర్ చేసిన వెంటనే అది వైరల్‌గా మారింది. లైక్‌లు, కామెంట్లు వెల్లువెత్తాయి. ఇటీవల శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్లినప్పుడు అక్కడ రోడ్డుపై అనుకోకుండా పిచాయ్ తారసపడ్డారని సిద్ పూరీ ఫొటో షేర్ చేస్తూ పంచుకున్నారు. సుందర్ పిచాయ్ చుట్టూ భద్రతా సిబ్బంది లేరని, ఒక గార్డ్ ఉంటే అతనే ఈ ఫోటో తీశాడని వెల్లడించారు. అలా వీధిలో సాక్షాత్తూ సుందర్ పిచాయ్ కనిపిస్తారని తనకెవరో ముందుగా చెప్పలేదంటూ జోక్ చేశారు. ఒక సామాన్యుడిలా ఉన్న సుందర్‌పిచాయ్‌ని ఎలా గుర్తు పట్టారంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

మన దౌత్యం... కొత్త శిఖరాలకు

ప్రపంచగతినే మలుపు తిప్పే నిర్ణయాలకు వేదికైన జీ20

- దూసుకెళ్తున్న నయా భారత్
- గత 30 రోజుల పరిణామాలే నిదర్శనం
- చంద్రయాన్ నుంచి జీ 20 దాకా ఎన్నో దిగ్విజయాలు
- ప్రధాని 'మంత్లీ ప్రోగ్రెస్ రిపోర్ట్'





ప్రగతిమైదాన్‌లోని భారత్ మండపంలో జరిగిన కార్యక్రమ వేదికపై ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: గత నెల రోజుల్లో భారత దౌత్య ప్రతిభ నూతన శిఖరాలను తాకిందని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా 21వ శతాబ్దిలో ప్రపంచ గతిని నిర్ణయించే పలు కీలక నిర్ణయాలకు ఢిల్లీ వేదికగా ఇటీవల జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సు వేదికైందన్నారు. నేటి భిన్న ధ్రువ ప్రపంచంలో అన్ని దేశాలను ఒకే వేదిక మీదికి తేవడం చిన్న విషయమేమీ కాదన్నారు. 'దేశ వృద్ధి ప్రస్థానం నిర్నిరోధంగా సాగాలంటే స్వచ్ఛమైన, స్పష్టమైన, సుస్థిరమైన పాలన చాలా ముఖ్యం. ప్రస్తుతం దేశంలో చోటుచేసుకుంటున్న సానుకూల పరిణామాలు, మార్పులకు రాజకీయ స్థిరత్వం, విధాన స్పష్టత, పాలనలో ప్రతి అడుగులోనూ పాటిస్తున్న ప్రజాస్వామిక విలువలే ప్రధాన కారణం' అని అభిప్రాయపడ్డారు. మంగళవారం ఇక్కడ జీ20 కనెక్ట్ లో విద్యార్థులు, బోధన సిబ్బంది, విద్యా సంస్థల అధిపతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అవినీతిని, వ్యవస్థలో లీకేజీలను అరికట్టేందుకు, దళారుల జాడ్యాన్ని నిర్మూలించేందుకు, పథకాల అమలుకు టెక్నాలజీని గరిష్ఠంగా వాడుకునేందుకు గత తొమ్మిదేళ్లలో తమ సర్కారు చిత్తశుద్ధితో ప్రయత్నించిందని చెప్పారు.

భారత్, ద హ్యాపెనింగ్ ప్లేస్!

భారత్ ఇప్పుడు ఎన్నో కీలక సంఘటనలకు వేదికగా మారుతోందని మోదీ అన్నారు. 'గత నెల రోజుల ఘటనలే ఇందుకు నిదర్శనం. దానిపై ప్రగతి నివేదిక ఇవ్వదలచుకున్నా. అప్పుడు నూతన భారతం వృద్ధి పథంలో పెడుతున్న పరుగుల తాలూకు వేగం, తీవ్రత అర్థమవుతాయి. గత నెల వ్యవధిలో నేను ఏకంగా 85 దేశాల అధినేతలతో భేటీ అయ్యా. ఇక ఆగస్టు 23ను మనమెప్పటికీ గుర్తుంచుకోవాలి. అది భారత్ సగర్వంగా చంద్రుని మీద అడుగు పెట్టిన రోజు. ప్రపంచమంతా మన వాణిని విన్న రోజు. మనందరి పెదవులపై గర్వంతో కూడిన దరహాసం వెలిగిన రోజు. అందుకే జాతీయ అంతరిక్ష దినంగా ఆగస్ట్ 23 మన దేశ చరిత్రలో అజరామరంగా నిలవనుంది. ఆ విజయపు ఊపులో వెనువెంటనే సౌర యాత్రకు మనం శ్రీకారం చుట్టాం' అన్నారు. ఇక మామూలుగా కేవలం ఒక దౌత్య భేటీగా జరిగే జీ20 సదస్సును మన ప్రయత్నాలతో పౌర భాగస్వామ్యంతో కూడిన జాతీయ ఉద్యమంగా మలచుకున్నాం. ఢిల్లీ డిక్లరేషన్‌కు జీ20 దేశాల నుంచి 100 శాతం ఏకాభిప్రాయం దక్కడం ప్రపంచ స్థాయిలో పతాక శీర్షికలో నిలిచింది. ఆఫ్రికన్ యూనియన్ జీ20లో శాశ్వత సభ్య దేశంగా చేరింది. ఇలాంటివన్నీ ఆ సదస్సు సారథ్య సందేశంగా మనం సాధించిన ఘనతలే. అంతేకాదు, భారత ప్రయత్నాల వల్ల మరో ఆరు దేశాలు బ్రిక్స్ కూటమిలో చేరాయి' అని వివరించారు.

వీరికి అండలం, వారికి అరదండాలు!

నేడు మన దేశంలో నిజాయితీపరులకు గుర్తింపు, అవినీతిపరులకు తగిన శిక్ష దక్కుతున్నాయని మోదీ చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మధ్య తరగతి శ్రేయస్సు కోసం గత నెల రోజుల్లో కేంద్రం ఎన్నో పథకాలు తెచ్చింది. పీఎం విశ్వకర్మ యోజన, రోజ్ గార్ మేళాతో లక్ష మంది యువతకు ఉపాధి వంటివన్నీ వాటిలో భాగమే' అన్నారు. 'మన దేశం మీద అంతర్జాతీయంగా భరోసా ఇనుమడిస్తోంది. విదేశీ పెట్టుబడుల వెల్లువ రికార్డులు తాకుతోంది. కేవలం ఐదేళ్లలో 13.5 కోట్ల భారతీయులు పేదరికం నుంచి బయటపడి నూతన మధ్య తరగతిగా రూపుదాల్చారు' అని వివరించారు.

యువతా! కలసి నడుద్దాం...!

జీ20 సదస్సు ఘన విజయానికి యువత భాగస్వామ్యం ప్రధాన కారణమని మోదీ అన్నారు. లోకల్ నినాదానికి ఊపు తెచ్చేందుకు కాలేజీ, వర్సిటీ క్యాంపస్ లు కేంద్రాలుగా మారాలని ఆశాభావం వెలిబుచ్చారు. 'ఖాదీ దుస్తులు ధరించడం ద్వారా వాటికి ప్రాచుర్యం కల్పించండి. క్యాంపస్‌లలో ఖాదీ ఫ్యాషన్ షోలు పెట్టండి' అని యువతను కోరారు. 'మన స్వాతంత్ర్య యోధుల్లా దేశం కోసం మరణించే అదృష్టం మనకు లేదు. కనీసం దేశం కోసం జీవితాలను అంకితం చేసే సదవకాశం మాత్రం మనందరికీ ఉంది' అని గుర్తు చేశారు. వందేళ్ల క్రితం యువత స్వరాజ్య భారతం కోసం కదం తొక్కింది. మనమిప్పుడు సమృద్ధ భారతం కోసం పాటుపడదాం. రండి, కలసి నడుద్దాం!' అని పిలుపునిచ్చారు.

బెంగళూరు బంద్ పాక్షికం

సాక్షి, బెంగళూరు: తమిళనాడుకు కావేరి నీటి విడుదలను నిరసిస్తూ వివిధ సంఘాలిచ్చిన పిలుపుపై మంగళవారం బెంగళూరు బంద్ పాక్షికంగా జరిగింది. సాధారణ జనజీవనానికి అంతరాయం కలిగింది. విద్యాసంస్థలు మూతబడ్డాయి. చాలా వరకు కార్యాలయాలు, దుకాణాలు, వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. పోలీసులు ముందు జాగ్రత్తగా నిషేధాజ్ఞలు విధించారు. మైసూరు బ్యాంకు సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. జేడీఎస్ పార్టీ కార్యాలయం జేపీ భవన్ నుంచి ఊరేగింపుగా బయలుదేరిన కార్యకర్తలు, నేతలను పోలీసులు అడ్డుకున్నారు. కర్ణాటక రక్షణ వేదిక నేతలు, కార్యకర్తలు సీఎం ఇంటి ముట్టడికి సాగుతుండగా వందలాది మందిని అదుపులోకి తీసుకున్నారు.

ఆ జవానుది తప్పుడు ఫిర్యాదు

వెల్లడించిన కేరళ పోలీసులు

కొల్లం(కేరళ): నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)కు చెందిన కొందరు తనను కొట్టి వీపుపై 'పీఎఫ్ఐ' అని రాశారంటూ ఓ జవాను చేసిన సంచలన ఫిర్యాదు ఉత్తిదేనని కేరళ పోలీసులు తేల్చారు. జవాను షైన్ కుమార్‌తోపాటు సహకరించిన అతడి స్నేహితుడిని పోలీసులు విచారిస్తున్నారు. రాజస్తాన్‌లో జైసల్మీర్‌లో ఉన్న ఆర్మీ విభాగంలో షైన్ కుమార్ పనిచేస్తున్నారు. ఇటీవల సెలవుపై సొంతూరు కడక్కల్‌కు వచ్చారు. ఆదివారం రాత్రి ఇంటికి సమీపంలోని రబ్బర్ ప్లాంటేషన్ వద్ద ఆరుగురు వ్యక్తులు తనను కొట్టి, పీఎఫ్ఐ అంటూ తన వీపుపై రాశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు షైన్ కుమార్ స్నేహితుడిని అదుపులోకి తీసుకున్నారు. కుమార్‌కు ప్రచార యావ ఉందని అతడి స్నేహితుడు తెలిపారు. మద్యం తాగాక అతడు చెప్పినట్లే వీపుపై రంగుతో పీఎఫ్ఐ అని రాసినట్లు చెప్పాడు. కొట్టాలని కూడా షైన్ కుమార్ కోరాడని, మత్తులో ఆ పనిచేయలేక పోయేసరికి నోటికి ప్లాస్టర్ అంటించమన్నాడని తెలిపాడు. ఈ మేరకు షైన్ కుమార్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఘటనకు సంబంధించి ఎవరినీ అరెస్ట్ చేయలేదని పోలీసులు తెలిపారు.

విజయవంతంగా క్రయోజనిక్ సీ-20 పరీక్షలు

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా మహేంద్రగిరిలో వున్న లిక్విడ్ ప్రపొల్లెంట్ స్పేస్ సెంటర్ (ఎల్‌పీఎస్‌సీ) ఈ నెల 22న క్రయోజనిక్ (సీఈ–20) ఇంజిన్‌కు భూస్థిర పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. మంగళవారం ఇస్రో తన వెబ్‌సైట్‌లో ఈ విషయం తెలిపింది. గగన్‌యాన్ ప్రయోగానికి సంబంధించి అప్పర్‌స్టేజీలో అంటే మూడో దశలో వినియోగించే క్రయోజనిక్ దశను సరికొత్తగా రూపొందించింది. ఇస్రో తాజాగా రూపొందించిన సీఈ–20 ఇంజిన్‌ను ఎల్‌వీఎం3 రాకెట్లకే వినియోగించబోతున్నారు. ఈనెల 22న క్రయోజనిక్ దశలో 20 టన్నుల ఇంధనాన్ని నింపి సుమారు 50 సెకన్లపాటు మండించి పరీక్షించారు. క్రయోజనిక్ దశలో మూడోరకం ఇంజిన్ అందుబాటులోకి వచ్చిందని ఇస్రో ప్రకటించింది.

గ్యాస్ స్టేషన్‌లో పేలుడు.. 20 మంది మృతి

యెరవాన్(ఆర్మీనియా): గ్యాస్‌స్టేషన్‌లో సంభవించిన భారీ పేలుడుతో 20 మంది చనిపోగా మరో 300 మంది వరకు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు అంటున్నారు. అజర్‌బైజాన్, ఆర్మీనియాల మధ్య మూడు దశాబ్దాల వివాదానికి కారణమైన నగోర్నో–కరబాఖ్‌లో సోమవారం రాత్రి ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. ఒకప్పటి సోవియెట్ యూనియన్‌లోని అజర్‌బైజాన్‌లో స్వతంత్ర ప్రాంతం నగోర్నో–కరబాఖ్. ఆర్మీనియన్ సంతతి ప్రజల ఆధీనంలో ఉండేది. సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నమయ్యాక ఆ ప్రాంత పాలకులు ఆర్మీనియాలో విలీనమయ్యేందుకు మొగ్గు చూపడం అజర్‌బైజాన్‌తో విభేదాలకు కారణమైంది. ఆ ప్రాంతానికి ఇంధనం, ఆహార సరఫరాలను అజర్‌బైజాన్ నిలిపివేసింది. వారం క్రితం అజర్‌బైజాన్ బలగాలు మెరుపుదాడులు చేసి ఆర్మీనియా వేర్పాటువాదులను అదుపులోకి తీసుకున్నాయి. అప్పటి నుంచి అక్కడున్న ఆర్మీనియన్లు ఆర్మీనియాలో తలదాచుకునేందుకు మూటాముల్లె సర్దుకుని బయలుదేరుతున్నారు. ఈ క్రమంలోనే భారీ పేలుడు సంభవించింది.

వచ్చేసారి ఊరుకోం!

- పెండింగ్‌లో 70 సిఫార్సులు
- న్యాయమూర్తుల నియామకంలో తీవ్రంగా జాప్యం
- కేంద్రంపై సుప్రీం అసహనం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా న్యాయమూర్తుల నియామకాల్లో జరుగుతున్న జాప్యంపై సుప్రీం కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. గత ఏడాది నవంబర్ నుంచి సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సులు 70 వరకు కేంద్రం దగ్గర పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించింది. వాటిని ఇన్నాళ్లు ఎందుకు పెండింగ్‌లో ఉంచారని కేంద్రాన్ని ప్రశ్నించింది. న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాంశు ధూలియాలతో కూడిన సుప్రీం కోర్టు బెంచ్ ఈ సమస్య పరిష్కారానికి అటార్నీ జనరల్ కార్యాలయం చొరవ తీసుకోవాలని పేర్కొంది. దీనికి అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి ఏడు రోజులు సమయం అడిగారు. దీనిపై జస్టిస్ సంజయ్ కిషన్ స్పందిస్తూ '' నేను ఎన్నో చెప్పాలనుకున్నాను. కానీ నన్ను నేను నియంత్రించుకుంటున్నాను. సమస్య పరిష్కారానికి అటార్నీ జనరల్ ఏడు రోజులు మాత్రమే సమయం అడిగారు. నేను ఇప్పటికి మౌనంగా ఉంటున్నారు. వచ్చేసారి ఇక ఊరుకోను. అటార్నీ జనరల్ కార్యాలయమే కేంద్రం దగ్గరున్న పెండింగ్ సిఫార్సుల సమస్యను పరిష్కరించాలి. ఎందుకంటే న్యాయమూర్తుల కొరత అన్నది అతి పెద్ద సమస్య'' అని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ కుండబద్దలు కొట్టారు. జడ్జీల నియామకం జాప్యం అవుతున్న కొద్దీ చాలా మంది లాయర్లు తమ దరఖాస్తుల్ని వెనక్కి తీసుకుంటున్నారని, అత్యంత ప్రతిభ కలిగిన లాయర్లు న్యాయమూర్తుల పదవుల్లోకి రాకుండా ఉండడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. ''కిందటి వారం వరకు 80 సిఫార్సులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ తర్వాత 10 మంది నియామకం జరిగింది. ఇప్పుడు పెండింగ్‌లో 70 ఉన్నాయి. వాటిలో 26 న్యాయమూర్తుల బదిలీలకు సంబంధించినవి. ఒక సమస్మాత్మక హైకోర్టుకు సంబంధించిన ప్రధాన న్యాయమూర్తి నియామకం కూడా ఇంకా పెండింగ్‌లో ఉంది'' అని జస్టిస్ కౌల్ వివరించారు. న్యాయమూర్తుల నియామకం అంశంలో కేంద్రం ఎందుకు మీనమేషాలు లెక్కిస్తుందో అర్థం కావడం లేదన్నారు.

బిల్లుకు ఆమోదం దేశానికి దిశానిర్దేశం: మోదీ

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంటు ఆమోదం నూతన భవితవ్యం వైపు దేశానికి దిశానిర్దేశం చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అపారమైన అవకాశాలకు యువతకు ద్వారాలు తెరిచేందుకు తమ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని పునరుద్ఘాటించారు. పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందిన 51 వేల మందికి మంగళవారం నియామక పత్రాలు అందజేసిన అనంతరం ఆయన వర్చ్యువల్ విధానంలో మాట్లాడారు. పాలనలో సాంకేతిక పరిజ్ఞానం వాడకం నానాటికీ పెరుగుతోందని గుర్తు చేశారు. 'దానివల్ల ప్రభుత్వ పథకాల అమలులో అవినీతికి అడ్డుకట్ట పడింది. సంక్లిష్టతలు తగ్గి సౌలభ్యం, విశ్వసనీయత పెరిగింది' అని వారికి వివరించారు. పౌరులే ముందు అన్నదే మూల మంత్రంగా పని చేయాలని ఉద్బోధించారు. పాలనను మరింత మెరుగు పరిచేలా టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. దేశం కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సిన, గొప్ప లక్ష్యాలను సాకారం చేసుకోవాల్సిన తరుణమిదని ప్రధాని అభిప్రాయపడ్డారు.

సీసీటీవీలో రికార్డయిన నిజ్జర్ హత్య

వాషింగ్టన్ పోస్టు సంచలన కథనం

వాషింగ్టన్: కెనడాలో ఖలిస్తాన్ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు సంబంధించి అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్టు కీలకమైన అంశాలను వెలుగులోకి తెచ్చింది. నిజ్జర్ హత్యకు చెందిన 90 సెకండ్ల పాటు ఉన్న సీసీటీవీ ఫుటేజ్ తమకు లభించిందని వెల్లడించింది. నిజ్జర్‌ను తుపాకీతో కాల్చిన దుండగుడు మొత్తం 50 తూటాలు పేలిస్తే అందులో 34 నిజ్జర్ శరీరంలో దూసుకువెళ్లి అతని ప్రాణాలు తీశాయని ప్రత్యక్ష సాక్షులు చెప్పినట్టుగా వివరించింది. నిజ్జర్ హత్య వెనకాల భారత్ ప్రమేయం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్ర ఆరోపణలు చేయడంతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలకు దారి తీసిన విషయం తెలిసిందే. నిజ్జర్ హత్యపై కెనడా ప్రభుత్వం నెమ్మదిగా స్పందించిందని వాషింగ్టన్‌పోస్టు తన కథనంలో ఆరోపించింది. సీసీ కెమెరా ఫుటేజ్‌లో దుండగులు నిజ్జర్‌పై కాల్పులు జరిపి వెళ్లిపోయిన దృశ్యాలు రికార్డయ్యాయి. బ్రిటీష్ కొలంబియాలోని సర్రేలో జూన్ 18న రాత్రి 8 గంటల ప్రాంతంలో గురు నానక్ సింగ్ గురుద్వార వెలుపల పార్కింగ్ ఏరియా నుంచి నిజ్జర్ తన ట్రక్‌ను బయటకు తీసుకు వస్తుండగా, అదే సమయంలో పార్క్ చేయడానికి తెల్ల రంగు సెడాన్ కారు వేగంగా వచ్చింది. హఠాత్తుగా సెడాన్ కారు వచ్చి ట్రక్కుకి అడ్డంగా ఆగింది. స్వెటర్లు ధరించిన ఇద్దరు వ్యక్తులు అప్పుడే అక్కడికి వచ్చారు. అందులో ఒకరు పాయింట్‌బ్లాంక్ రేంజ్‌లో ట్రక్‌లో డ్రైవింగ్ సీటులో ఉన్న నిజ్జర్‌పై గుళ్ల వర్షం కురిపించాడు. అక్కడ్నుంచి వెళ్లిపోయిన సెడాన్ కారు వెళ్లిన దిశగా ఆ ఇద్దరు వ్యక్తులు పరుగులు పెట్టినంత వరకు ఆ ఫుటేజ్‌లో రికార్డయింది. గురు ద్వారాకి సమీపంలో ఉన్న మైదానంలో సాకర్ ఆడుకుంటున్న వాలంటీర్ భూపీందర్‌జీత్ సింగ్ కాల్పుల శబ్దం విని అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చారు. అప్పటికే నిజ్జర్ మరణించాడని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తు ఎవరు చేపట్టాలనే అంశంపై కెనడా రాయల్ మౌంటెడ్ పోలీసు, సర్రే ఇన్వెస్టిగేషన్ బృందం మధ్య భేదాభిప్రాయాలు రావడంతో విచారణలో తీవ్ర జాప్యం, నిర్లక్ష్యం జరిగినట్టుగా వాషింగ్టన్ పోస్టు పేర్కొంది.



సినీ భాషలోనే డ్రగ్స్ దందా!
'టాలీవుడ్ డ్రగ్స్' కేసుల దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సినీ రంగానికి చెందిన వారు మాదకద్రవ్యాల దందాను వారి పారిభాషిక పదాలనే కోడ్ వర్డ్స్‌గా వినియోగిస్తున్నట్లు వెల్లడైంది.

-8లో



ఈ నెల 28న మ్యూజియానికి సెలవు
చార్మినార్: ఈ నెల 28వ తేదీన వినాయక నిమజ్జనం, మిలాద్-ఉన్-నబీ ఉత్సవాలను పురస్కరించుకొని సాలార్‌జంగ్ మ్యూజియానికి సెలవు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని పర్యాటకులు గమనించాలని సూచించారు.

బిల్లులు చెల్లించకుంటే పనులు చేయలేం
సాక్షి, సిటీబ్యూరో: దాదాపు ఏడాది క్రితం పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లుల్ని వెంటనే చెల్లించాలని జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్‌కు విజ్ఞప్తి చేసింది. గత జనవరి 31 నుంచి ఇప్పటి వరకు బిల్లుల చెల్లింపులు లేవని, ఈ పరిస్థితుల్లో వెంటనే బిల్లులు చెల్లించని పక్షంలో అక్టోబర్ 1వ తేదీ నుంచి తాము పనులు చేయలేమని కమిషనర్‌కు రాసిన వినతిపత్రంలో పేర్కొంది.

న్యూస్‌రీల్

నిలిచిపోయిన మెట్రో రైళ్లు..

ఇబ్బందులకు గురైన ప్రయాణికులు

సాక్షి, సిటీబ్యూరో: నాగోల్- రాయదుర్గం మధ్య నడిచే మెట్రో సేవలకు మంగళవారం కొద్ది సేపు అంతరాయం ఏర్పడింది. ఉదయం 8 గంటల సమయంలో నాగోల్ నుంచి రాయదుర్గం వెళ్తున్న మెట్రో రైలు సుమారు 20 నిమిషాలకు పైగా సికింద్రాబాద్ ఈస్ట్ స్టేషన్‌లో నిలిచిపోయింది. దాంతో దాని వెనుక వచ్చే మరో రైలు సైతం నిలిచిపోయింది. సాంకేతిక కారణాల వల్ల ఈ అంతరాయం ఏర్పడినట్లు సమాచారం. అనంతరం మెట్రో సేవలను యథావిధిగా పునరుద్ధరించినప్పటికీ రైళ్ల రాకపోకల్లో జాప్యం కారణంగా ఉదయం కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ఐటీ తదితర విభాగాలకు చెందిన ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కార్యాలయాలకు, కాలేజీలకు సైతం ఆలస్యంగా వెళ్లాల్సివచ్చిందని పలువురు ప్రయాణికులు తెలిపారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం జెద్దా నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడిని తనిఖీ చేయగా అతడి లోదుస్తుల్లో 399 గ్రాముల బంగారం దొరికింది. దీని విలువ 24.34 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీరనారి చాకలి ఐలమ్మ



హిమాయత్‌నగర్: వీరనారి.. సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ నేటితరానికి ఆదర్శమని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ కొనియాడారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ సరోజ తదితరులతో కలిసి ఆమె చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు విజయలక్ష్మి, యాదగిరి, కెన్నెడీ, బాషా, యూసీడీ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాష్ డ్రైవింగ్‌కు ఒకరి బలి

మరో ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలంలో జయమ్మ మృతదేహం

గచ్చిబౌలి: ర్యాష్ డ్రైవింగ్ కారణంగా ఓ వ్యక్తి మృతి చెందగా.. మరో ఇద్దరికి గాయాలైన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ మహేష్ చెప్పిన వివరాల ప్రకారం.. నారాయణ్‌పేట్ నిజ్జింత గ్రామానికి కోటకొండ జయమ్మ (50) మణికొండలో నివాసం ఉంటోంది, నాలుగేళ్లుగా ల్యాంకో హిల్స్‌లో గార్డెనింగ్ పనులు చేస్తోంది. మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో ల్యాంకోహిల్స్ విల్లాస్ సమీపంలో ఉన్న రోటరీలో గార్డెనింగ్ పనులు చేస్తున్నారు. అదుపు తప్పిన కారు జయమ్మతో పాటు పద్మను ఢీకొట్టి డివైడర్‌పైకి ఎక్కింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో జయమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. పద్మ అనే మహిళ తీవ్ర గాయాలతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మరో కార్మికురాలికి స్వల్పంగా గాయాలయ్యాయి. జిమ్‌కు వెళ్లి వస్తూ దీప్తి అనే మహిళ నిర్లక్ష్యంగా కారు నడిపినట్లు పోలీసులు తెలిపారు. నిందితురాలిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు.

చింతలేకుండా 'చివరి మజిలీ'

పంజాగుట్ట వైకుంఠ మహా ప్రస్థానం ప్రారంభం



జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పునరుద్ధరించిన పంజాగుట్ట వైకుంఠ మహాప్రస్థానాన్ని మంగళవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. వైకుంఠ మహాప్రస్థానంలో రోడ్ల నిర్మాణం, ప్రహరీ, పచ్చదనంతో పాటు స్నానపు గదులు, దహన సంస్కారాలు నిర్వహించేందుకు అత్యాధునికమైన ప్లాట్‌ఫాంలు, అస్థికలను భద్రపరిచేందుకు లాకర్లను ఏర్పాటు చేశారు. సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో రూ.4 కోట్ల వ్యయంతో ఫినిక్స్ సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా ఈ నిర్మాణాలను చేపట్టింది. కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రే, కవిత తదితరులు పాల్గొన్నారు. – బంజారాహిల్స్





ఉల్లాస ఉద్యానం

ఆవిష్కృతం

లేక్ ఫ్రంట్ పార్క్‌ను ప్రారంభించిన మంత్రి తలసాని

ట్యాంక్‌బండ్ వద్ద మరో పర్యాటక కేంద్రం ఆవిష్కృతమైంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో రూ.26.65 కోట్ల వ్యయంతో అద్భుతంగా రూపుదిద్దుకున్న లేక్ ఫ్రంట్ పార్క్‌ను మంగళవారం రాత్రి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంతో పాటు హైదరాబాద్ నగరం అద్భుతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ అర్వింద్ కుమార్ మాట్లాడుతూ.. ముంబై ఆర్కిటెక్ట్ కిశోర్ ప్రదాన్‌తో లేక్ ఫ్రంట్ పార్క్‌ను డిజైన్ చేయించినట్లు తెలిపారు. రాత్రి పదకొండు గంటల వరకు లేక్ ఫ్రంట్ పార్క్ సందర్శకులకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రభాకర్, బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ ఓఎస్డీ చంద్రారెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ పరంజ్యోతి, అసిస్టెంట్ డైరెక్టర్ విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, సిటీబ్యూరో

వినాయకుడికో కోడ్

- ప్రతి గణేష్ విగ్రహానికీ క్యూఆర్ కోడ్
- దాదాపు 12 వేల విగ్రహాల జియో ట్యాగింగ్
- ఊరేగింపు కదలికలు సీసీసీలో స్క్రీన్‌పై

సమన్వయంతో.. సమష్టిగా

– నిమజ్జనానికి ఏర్పాట్లు



నిమజ్జన ఊరేగింపు మార్గాన్ని పరిశీలిస్తున్న కొత్వాల్ సీవీ ఆనంద్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: గణేష్ నిమజ్జన సామూహిక ఊరేగింపుల పర్యవేక్షణకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుంటున్నారు. ప్రతి వినాయక మండపానికీ ఓ ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ కేటాయించడంతో పాటు వాటికి జియో ట్యాగింగ్ చేస్తున్నారు. ఇలా దాదాపు 12 వేల విగ్రహాలను ట్యాగ్ చేశారు. పోలీసులు గణేష్ విగ్రహాల వివరాలతో పోలీసులు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ ముద్రించి అందిస్తున్నారు. ఇలా ఈ విగ్రహాలను జియో ట్యాగింగ్ చేయడంతో పాటు ఐసీసీసీలోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించారు. ఈ క్యూఆర్ కోడ్స్, జియో ట్యాగింగ్ డేటాను పోలీసు అధికారిక యాప్ టీఎస్ కాప్‌లోకి లింకు ఇచ్చారు. దీంతో ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయిలో ఉండే పోలీసుల వరకు ఎవరైనా సరే తమ ప్రాంతంలో ఎన్ని మండపాలు ఉన్నాయి? ఎక్కడ ఉన్నాయి? ఎప్పుడు ఏర్పాటు అవుతాయి? నిమజ్జనం ఎప్పుడు? ఏ మార్గంలో వెళ్ళి, ఎక్కడ నిమజ్జనం చేస్తారు? తదితర వివరాలను తమ ట్యాబ్స్, స్మార్ట్‌ఫోన్స్‌లో చూసుకునే అవకాశం ఏర్పడింది.

సామూహిక గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా, భక్తులకు ఇబ్బందులు ఎదురవకుండా ఉండేందుకు వివిధ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేయనున్నాయి. జీహెచ్ఎంసీతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, సమాచారం, పౌరసంబంధాలు, పోలీసు, రవాణా, హెచ్ఎండీఏ, వాటర్ బోర్డు, మెడికల్‌అండ్ హెల్త్, ఫైర్‌సర్వీసెస్, టీఎస్ ఆర్టీసీ,టీఎస్ఎస్‌పీడీసీఎల్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, టూరిజం విభాగాలతో పాటు 108 ఈఎంఆర్ఐ విభాగాల ఉన్నతాధికారులు సమన్వయంతో పని చేసేలా ప్రణాళిక రూపొందించారు. అన్ని విభాగాల అధికారుల ఫోన్‌నెంబర్లు అందరి వద్ద అందుబాటులో ఉంచారు. నిమజ్జనాల సందర్భంగా వెలువడే వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు దాదాపు 3 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తారు. విభాగాల వారీగా అన్ని ప్రభుత్వ శాఖలు పని చేయనున్నాయి.

ఊరేగింపు మార్గాలను పరిశీలించిన సీపీ

సామూహిక నిమజ్జనం గురువారం జరగనుండటంతో నగర కొత్వాల్ సీవీ ఆనంద్ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. మంగళవారం ఆయన అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, జి.సుధీర్‌బాబు, సంయుక్త సీపీ ఎం.శ్రీనివాసులు తదితరులతో కలిసి చార్మినార్, ఎంజే మార్కెట్ సహా వివిధ ప్రాంతాల్లోని ఊరేగింపు మార్గాన్ని పరిశీలించారు. బాలాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు మొత్తం 19 కిమీ మేర ప్రధాన ఊరేగింపు జరగనుంది. ఈ మార్గంలో అనేక ఇతర ఊరేగింపులు వచ్చి కలుస్తాయి. బందోబస్తు, భద్రతా విధుల్లో మొత్తం 25,694 మంది సిబ్బంది, అధికారులు పాల్గొంటారు. వీరికి అదనంగా 125 ప్లటూన్ల సాయుధ బలగాలు, మూడు కంపెనీల ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ వినియోగిస్తున్నారు. ఈ బలగాలు హుస్సేన్‌సాగర్ చుట్టూతో పాటు 18 కీలక జంక్షన్లలో మోహరించి ఉంటాయి. ప్రతి ఊరేగింపు మార్గాన్ని ఆద్యంతం కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అవసరమైన సంఖ్యలో క్యూఆర్టీ, యాంటీ చైన్ స్నాచింగ్, షీ-టీమ్స్ బృందాలతో పాటు డాగ్ స్క్వాడ్స్‌ను రంగంలోకి దింపుతున్నారు. ఐసీసీసీలో ఉన్న కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి అన్ని విభాగాలకు చెందిన అధికారులు ఈ ఊరేగింపును పర్యవేక్షిస్తారు. నగర ప్రజలు సైతం తమకు సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.

రాచకొండ పరిధిలో..



వినాయక నిమజ్జనానికి రాచకొండ పరిధిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కమిషనరేట్ పరిధిలోని 56 చెరువుల వద్ద 3,600 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నిమజ్జన ఏర్పాట్లపై మంగళవారం రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ వివరాలను వెల్లడించారు. అన్ని చెరువులను సందర్శించి ఇప్పటికే క్రేన్లను ఏర్పాటు చేశామన్నారు. 6 వేల మంది పోలీసు సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉంటారని తెలిపారు. మరో 1000 మంది అదనపు సిబ్బందిని కూడా జిల్లాల నుంచి రప్పించామన్నారు. రూట్ టాప్, షీ టీమ్స్, మఫ్టీ పోలీస్‌లతో భద్రత కట్టుదిట్టం చేశామన్నారు.

అదనంగా ఆర్టీసీ బస్సులు, ఎంఎంటీఎస్, మెట్రో రైళ్లు

ఈ నెల 28న జరగనున్న వినాయక నిమజ్జన వేడుకల కోసం ఆర్టీసీ, ఎంఎంటీఎస్, మెట్రో సంస్థలు విస్తృత ఏర్పాట్లు చేపట్టాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో 535 బస్సులను అదనంగా నడిపేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ప్రయాణికుల రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు వివిధ మార్గాల్లో 8 ఎంఎంటీఎస్ సర్వీసులను అదనంగా నడపనున్నారు. భక్తుల రద్దీకనుగుణంగా మెట్రో రైళ్లను నడిపేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ చర్యలు చేపట్టింది. బస్సుల వివరాల కోసం ప్రయాణికులు 99592 26154, 99592 26160లను సంప్రదించవచ్చు.

మహా నిమజ్జనానికి ట్రయల్ రన్



ట్రాయిలర్ వాహనానికి వెల్డింగ్ పనులు

ఖైరతాబాద్: శ్రీ దశమహా విద్యాగణపతిగా ఖైరతాబాద్‌లో కొలువుదీరిన మహాగణపతి నిమజ్జనానికి పోలీసులు మంగళవారం ఉదయం 5.30 గంటలకు ఖైరతాబాద్ మండపం నుంచి ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నెం-4 వరకు ట్రయల్ రన్ నిర్వహించారు. నేటి ఉదయం 11 గంటల వరకే మహాగణపతి దర్శనాలు ఉంటాయని, తెల్లవారుజామున 5 గంటల నుంచి షెడ్డు తొలగించే పనులు ప్రారంభించి 7 గంటల కల్లా పూర్తి చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యుడు సందీప్ రాజ్ తెలిపారు.

మినట్ టు మినట్..


మంగళవారం రాత్రి నుంచే ట్రాయిలర్ వాహనానికి వెల్డింగ్ పనులు మొదలు పెట్టారు. నేటి రాత్రి నుంచే నిమజ్జన ఏర్పాట్లు ప్రారంభిస్తారు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు మహాగణపతి ఇరువైపులా ఉన్న విగ్రహాలను మరో వాహనంపైకి తెస్తారు. తెల్లవారుజామున 4 గంటల కల్లా రవి క్రేన్ సాయంతో మహాగణపతిని ఎస్‌టీసీ ట్రాన్స్‌పోర్ట్ వాహనంపైకి తెస్తారు. ఉదయం 7 గంటలకు మహాగణపతికి వెల్డింగ్ పనులు పూర్తి చేసి 9.30 గంటలకు మహా శోభాయాత్ర ప్రారంభిస్తారు. ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నెం-4 వద్ద మధ్యాహ్నం 12 గంటల వరకు నిమజ్జనం పూర్తయ్యేలా పోలీసులు మినట్ టు మినట్ కార్యక్రమాన్ని రూపొందించారు. ఆ విధంగానే ఏర్పాట్లు చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు.

'డబుల్' జంబో డ్రా



- రెండు పడక గదుల ఇళ్లకు మరో 36,907 మంది ఎంపిక
- ఇప్పటికే రెండు విడతల్లో 24,900 గృహాల అందజేత
- నేడు హైదరాబాద్ కలెక్టరేట్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ
- హాజరు కానున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో డబుల్ బెడ్రూం ఇళ్ల జంబో ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ డ్రా కోసం అధికార యంత్రాంగం సిద్ధమైంది. బుధవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో సుమారు 36, 907 ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ర్యాండమైజేషన్ డ్రా కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, హరీష్ రావు, సబిత ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, మహేందర్ రెడ్డి, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతారెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్, మూడు జిల్లాల కలెక్టర్లు తదితరులు హాజరు కానున్నారు. ఇప్పటికే రెండు విడతలుగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను పంపిణీ చేశారు. తాజాగా మూడు, నాలుగు విడతలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. ఎంపికైన లబ్ధిదారులకు వచ్చే నెల మొదటి వారంలో రెండు విడతలుగా ఇళ్లను కేటాయించి పంపిణీ చేయనున్నారు.



లక్షల్లో దరఖాస్తులు.. వేలల్లో ఇళ్లు

గ్రేటర్ పరిధిలో లక్షల్లో దరఖాస్తులు వచ్చినా.. కొద్ది మందికి మాత్రమే సొంతింటి కల సాకారమవుతోంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో సుమారు పది లక్షల మంది డబుల్ బెడ్రూం ఇళ్లపై ఆశతో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో మీ సేవ ఆన్‌లైన్ ద్వారా సుమారు 7.09 లక్షల కుటుంబాలు, ఆఫ్‌లైన్ (నేరుగా)లో 3 లక్షల వరకు కుటుంబాలు కలెక్టరేట్ ఆఫీసుల్లో దరఖాస్తులు చేసుకున్నాయి. అధికారులు కేవలం ఆన్‌లైన్ దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. ప్రాథమిక పరిశీలనతో సుమారు 3.60 లక్షల దరఖాస్తులను గుర్తించారు. ఇప్పటి వరకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు కలిసి దాదాపు 1.60 లక్షల దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేశారు. మరో 2 లక్షల దరఖాస్తులు విచారణకు నోచుకోలేదు. దీంతో విచారణ పూర్తయిన వారిలోనూ కేవలం 62 వేల కుటుంబాలకు మాత్రమే ఇళ్లు వచ్చాయి. అక్టోబర్ మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే సంకేతాలున్నందున నిర్మాణం పూర్తయిన ఇళ్లనన్నింటినీ ఆలోగా అర్హులకు పంపిణీ చేయాల్సిందిగా ప్రభుత్వం తాజాగా అధికారులకు సూచించినట్లు తెలిసింది. అందుకనుగుణంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఇప్పటి వరకు ఇలా...

నగర పరిధిలో ఇప్పటి వరకు 68,176 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. అందులో (ఇన్ సీటు)పేదల పాత గృహాలు తొలగించి కొత్తవి నిర్మించిన ప్రాంతాల్లో సుమారు 5,660 ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మిగిలిన 62,576 ఇళ్లలో ఇప్పటికే రెండు విడతల్లో ఎంపిక చేసిన లబ్ధిదారులకు సుమారు 24, 900 ఇళ్లను కేటాయించారు. తాజాగా 36,907 లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయించనున్నారు. ఇక నిర్మాణ పూర్తయినవి కేవలం 769 ఇళ్లు మాత్రమే మిగలనున్నాయి. వాటిని స్థానిక కోటా కింద కేటాయించి పంపిణీ చేసే అవకాశాలు లేకపోలేదు.

మొదటి దశ లక్ష్యం ఇలా..

గ్రేటర్ పరిధిలో సుమారు 111 ప్రాంతాల్లో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో పాత గృహాలు తొలగించిన (ఇన్ సీటు) 40 ప్రాంతాల్లో 8,898 గృహాలు, 71 ఖాళీ స్థలాల్లో 91,102 గృహాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించి పనులు చేపట్టారు. ఇప్పటి వరకు 68,176 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. మిగతా 38 ప్రాంతాల్లో వివిధ దశలో ఉన్నాయి. రెండు లొకేషన్లలో 2,026 గృహాలు వివిధ కారణాలతో నిలిచిపోయాయి.

35వ అంతస్తు నుంచి దూకి..

- టెన్త్ విద్యార్థి ఆత్మహత్య
- నాలెడ్జ్ సిటీలోని మై హోం భూజలో ఘటన
- ఒత్తిడితో చనిపోతున్నానంటూ తల్లికి మెసేజ్



రియాన్ష్‌రెడ్డి (ఫైల్)

గచ్చిబౌలి: చదువులో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నానంటూ 35వ అంతస్తు పై నుంచి దూకి 10వ తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీలోని మై హోం భూజలో హెచ్ టవర్ 6వ అంతస్తులోని ఫ్లాట్‌నంబర్ 604లో ఎం.సురేష్ కుమార్ రెడ్డి నివాసం ఉంటున్నారు. ఆయన ముంబైలో ఓ కంపెనీలో ఫైనాన్షియల్ ఎనలిస్ట్‌గా పని చేస్తున్నారు. ఏడాది క్రితం మై హోం భూజకు మకాం మార్చారు. ఆయన భార్య స్వరూప ఇద్దరు కొడుకులతో కలిసి ఉంటుండగా సురేష్ కుమార్ ముంబైలో ఉంటున్నారు. వారాంతాల్లో ఆయన నగరానికి వచ్చి పోతుంటారు. ఓక్రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్‌లో 10వ తరగతి చదివే పెద్ద కొడుకు ఎం.రియాన్ష్ రెడ్డి(14) సోమవారం సాయంత్రం 7.45 గంటలకు వ్యక్తి గత కారణాలతో చనిపోతున్నానంటూ తల్లి స్వరూప ఫోన్‌కు మెసేజ్ చేసి ఫ్లాట్ నుంచి బయటకు వెళ్లాడు. మెసేజ్ చూసుకున్న ఆమె అపార్ట్‌మెంట్‌లో గాలించినా, స్నేహితులను ఆరా తీసినా రియాన్ష్ ఆచూకీ లభ్యం కాలేదు.

కుమారుడు కనిపించడంలేదంటూ ఫిర్యాదు

అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటలకు రియాన్ష్ కనిపించడం లేదని రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో స్వరూప ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంటనే అపార్ట్‌మెంట్‌లోని అన్ని ఎంట్రీ, ఎగ్జిట్‌ల సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించినా రియాన్ష్ ఆచూకీ తెలియరాలేదు. దీంతో అపార్ట్‌లోని అన్నిచోట్లా గాలించారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో జె బ్లాక్‌లోని గేట్ వద్ద మెట్ల మధ్యలో ఉన్న డెక్‌లో రియాన్ష్ మృతదేహం పడి ఉండటాన్ని గమనించారు. తల ఛిద్రమై రక్తపు మడుగులో రియాన్ష్ మృతదేహం కనిపించింది. హెచ్ బ్లాక్ నుంచి జె బ్లాక్ వెళ్లిన రియాన్ష్ 35వ అంతస్తు నుంచి డెక్‌లోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. రియాన్ష్ కనిపించడం లేదని భార్య సమాచారం ఇవ్వడంతో సురేష్ కుమార్ రెడ్డి హుటాహుటిన నగరానికి వచ్చారు. ప్రాథమిక విచారణలో వ్యక్తిగత (చదువుల్లో) ఒత్తిడితోనే రియాన్ష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. స్నేహితులు, కుటుంబ సభ్యులు, టీచర్లను విచారించిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని ఏసీపీ పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

కావాలనే వెళ్లిపోయారా?

- ఇద్దరు బాలికల అదృశ్యం
- జీడిమెట్ల ఠాణా పరిధిలో ఘటన

జీడిమెట్ల: ఇంట్లో చెప్పాపెట్టకుండా ఇద్దరు బాలికలు వెళ్లిపోయిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.పవన్ చెప్పిన వివరాల ప్రకారం.. చింతల్ ద్వారకానగర్‌కు చెందిన శ్రీనివాస్, విజయ్ ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. శ్రీనివాస్ కుమార్తె దీక్షిత 9వ తరగతి, విజయ్ కుమార్తె పూజ పదో తరగతి చదువుతున్నారు. వీరిద్దరూ వేర్వేరు పాఠశాలల్లో చదువుతున్నప్పటికీ.. పొరుగు ఇళ్లలో ఉండటంతో స్నేహితులయ్యారు. పూజ రెండు రోజుల క్రితం వినాయక మండపం వద్దకు వెళ్లడంతో తల్లిదండ్రులు మందలించారు. మంగళవారం ఉదయం స్కూల్‌కు వెళ్లేందుకు యూనిఫాం వేసుకుంది. పాలు తాగుతుండగా అవి మీద పడటంతో డ్రెస్ మార్చుకుంది. పక్కింట్లో ఉండే దీక్షిత బయట నుంచి గడియపెట్టి ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఇద్దరూ ప్రణాళిక ప్రకారమే 8 గంటల కంటే ముందే ఇళ్లలోంచి వెళ్లిపోయారు. దీక్షిత బాత్రూంకు గడియ పెట్టడం, పూజ డ్రెస్ మార్చుకోవడంపై అనుమానం వచ్చిన ఇరువురి తల్లిదండ్రులు చుట్టు పక్కల వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా.. ఇద్దరు బాలికలు సికింద్రాబాద్‌లో రైలు ఎక్కి వరంగల్ వెళ్లినట్లు గుర్తించారు. వరంగల్ నుంచి ఆంధ్రాకు గాని చెన్నైకి గాని వెళ్లే అవకాశం ఉందని, ఓ బాలిక బంధువు సంగారెడ్డికి చెందిన యువకుడికి పూర్తి విషయాలు తెలిసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సదరు యువకుడిని ప్రశ్నించేందుకు జీడిమెట్ల ఠాణాకు తీసుకువచ్చినట్లు సమాచారం.



బయటకు వెళ్తున్న బాలికలు (సీసీ ఫుటేజీ)

సినీ భాషలోనే డ్రగ్స్ దందా!

- స్క్రిప్ట్, రైటర్, షెల్ వీ మీట్... ఇవే కోడ్స్
- కేసుల దర్యాప్తులో గుర్తించిన పోలీసులు
- ప్రారంభమైన నవదీప్ సెల్‌ఫోన్ విశ్లేషణ
- విచారణకు హాజరైన కలహర్‌రెడ్డి, సూర్య

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్లలోని ఠాణాల్లో నమోదైన 'టాలీవుడ్ డ్రగ్స్' కేసుల దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సినీ రంగానికి చెందిన వారు మాదకద్రవ్యాల దందాను వారి పారిభాషిక పదాలనే కోడ్ వర్డ్స్‌గా వినియోగించే చేస్తున్నట్లు వెల్లడైంది. మరోపక్క టీఎస్ నాబ్ అధికారులు నటుడు నవదీప్ నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌ను విశ్లేషిస్తున్నారు. న్యాయస్థానం నుంచి ముందస్తు బెయిల్ పొందిన నిందితులు మంగళవారం దర్యాప్తు అధికారి ఎదుట హాజరయ్యారు. ఇటీవల కాలంలో టాలీవుడ్‌తో లింకులు ఉన్న డ్రగ్స్ కేసులు రెండు నమోదయ్యాయి. సైబరాబాద్ పోలీసులు పట్టుకున్న కేపీ రెడ్డికి సంబంధించిన కేసు మాదాపూర్ ఠాణాలో నమోదైంది. టీఎస్ నాబ్ అధికారులు గుట్టురట్టు చేసిన వెంకటరమణరెడ్డి లింకులకు సంబంధించిన కేసు హైదరాబాద్ కమిషనరేట్‌లోని గుడిమల్కాపూర్ ఠాణాలో రిజిస్టరైంది. ఈ కేసులోనే హీరో నవదీప్ పేరు బయటపడింది. ఈ రెండు కేసుల్లోనూ అనేక మంది టాలీవుడ్ నటులు, నిర్మాతలు, దర్శకులతో పాటు మోడళ్ళు సైతం డ్రగ్స్ వినియోగదారులుగా ఉన్నట్లు బయటపడింది. వీళ్ళు రహస్య ప్రాంతాల్లో, పొరుగు రాష్ట్రాల్లో పార్టీలు నిర్వహించుకుంటూ, మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సాధారణంగా డ్రగ్స్ క్రయవిక్రయాల్లో వాటి పేర్లను డైరెక్టుగా వాడరు. ఎవరికి వాళ్ళు కొన్ని కోడ్ వర్డ్స్ పెట్టుకుని పని పూర్తి చేస్తుంటారు. ఈ నేపథ్యంలోనే సినీ రంగానికి చెందిన వారు ఆ పారిభాషిక పదాలతోనే డ్రగ్స్‌కు కోడ్ వర్డ్స్ రూపొందించినట్లు పోలీసులు గుర్తించారు. నటులు, దర్శకులు, నిర్మాతలతో పాటు మోడల్స్ సైతం ఎక్కువగా కొకైన్‌ను వినియోగిస్తుంటారని అధికారులు చెప్తున్నారు. దీంతో ఈ డ్రగ్‌కు స్క్రిప్ట్ అనే కోడ్ వర్డ్ ఏర్పాటు చేసుకున్నారు. అలాగే మాదకద్రవ్యాలు సరఫరా చేసే డ్రగ్ పెడ్లర్‌కు రైటర్ అని, డ్రగ్స్ రావాలని అడగటానికి 'షెల్ వీ మీట్' అని కోడ్స్ ఏర్పాటు చేసుకున్నారు. వారి వారి ఫోన్లు విశ్లేషించినప్పుడు ఈ పదాలే కనిపించాయని దర్యాప్తు అధికారులు చెప్తున్నారు. మరోపక్క నవదీప్ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫోన్ విశ్లేషణ ప్రారంభమైంది. ఈ ఫోన్‌ను పోలీసులకు అప్పగించే ముందే నవదీప్ ఫార్మాట్ చేసినట్లు గుర్తించారు. దీంతో డిలీట్ అయిన డేటాను రిట్రీవ్ చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే దర్యాప్తులో గుర్తించిన అంశాలను బట్టి ఈ డ్రగ్స్ క్రయవిక్రయాలన్నీ స్నాప్‌చాట్ ఆధారంగా జరిగాయి. ఈ సోషల్‌మీడియా యాప్‌లో ఉన్న డిజ్అప్పీర్ ఆప్షన్‌ను పెడ్లర్లు, వినియోగదారులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు.

గుడిమల్కాపూర్ కేసులో నిందితులుగా ఉండి, న్యాయస్థానం నుంచి ముందస్తు బెయిల్ తీసుకున్న వ్యాపారి కలహర్‌రెడ్డి, పబ్ నిర్వాహకుడు సూర్య కాంత్ సహా మరో వ్యక్తి మంగళవారం దర్యాప్తు అధికారి ఎదుట హాజరయ్యారు. గుడిమల్కాపూర్ ఠాణాలో ష్యూరిటీలు సమర్పించడంతో పాటు ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరవుతాయని హామీ ఇచ్చారు. కలహర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... 'హైకోర్టు ఆదేశాల మేరకు గుడిమల్కాపూర్ పోలీసుస్టేషన్ లో లొంగిపోయా. నాకు, డ్రగ్స్ కేసుకి ఎలాంటి సంబంధం లేదు. విచారణకు పూర్తిగా సహకరించాను.. తర్వాత కూడా సహకరిస్తాను. పోలీసులు ఎప్పుడు పిలిస్తే అప్పుడు వస్తా. నాకు డ్రగ్స్ తీసుకునే అలవాటు లేదు' అని అన్నారు.

9 వేల మందితో 'నిమజ్జన' బందోబస్తు

నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సీవీ ఆనంద్, వేదికపై రాఘవరెడ్డి, భగవంతరావు తదితరులు

అబిడ్స్: గణేష్ నిమజ్జనం శాంతియుతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా 9 వేల మంది పోలీసు బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన పలు శాఖల కో ఆర్డినేషన్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. వినాయక నిమజ్జనం సాఫీగా సాగేందుకు పోలీసు శాఖ తరపున దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. నగరంలో 3 గంటల పాటు పోలీసు అధికారులకు కాన్ఫరెన్స్ నిర్వహించి అన్ని నియమ నిబంధనలను వివరించినట్లు వెల్లడించారు. నిమజ్జనంలో డీజేలను వాడకపోవడం మంచిదన్నారు. ప్రతి వాహనంలో భక్తి గీతాలను ఆలపిస్తూ ముందుకు సాగాలన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి విజ్ఞప్తి మేరకు గణేష్ మండప నిర్వాహకులు గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకే పాతబస్తీ నుండి దాటాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు తాను పోలీసు అధికారిగా 15 సార్లు గణేష్ బందోబస్తు నిర్వహించానని గుర్తుచేశారు. ఆ అనుభవాలతో నిమజ్జనం మరోసారి విజయవంతంగా కొనసాగుతుందన్నారు. మొదటిసారి గణేష్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఒకేసారి రావడంతో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను వాయిదా వేసుకున్నారని, అందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలపాలన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంతరావు మాట్లాడుతూ ఈసారి కూడా వినాయక సాగర్‌లోనే నిమజ్జనం చేపడుతామన్నారు. చివరి నిమిషంలో నిమజ్జనం వేరే ప్రాంతాల్లో చేసుకోవాలంటే కుదరదన్నారు. ఈ కార్యక్రమంలో రాచకొండ పోలీస్ కమిషనర్ చౌహాన్, ఉత్సవ సమితి అధ్యక్షుడు రాఘవరెడ్డి, రంగారెడ్డి జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, డీసీపీ శ్రీనివాస్, అదనపు డీసీపీ ఆనంద్, ఏసీపీ చంద్రశేఖర్, ఉత్సవ సమితి నాయకులు శ్రీరామ్‌వ్యాస్, వనమాల గోపాల్, నట్రాజ్ నామ్‌దారి, కంది మోహన్‌రెడ్డి, అరుణజ్యోతి, రూబి మిశ్రలతో పాటు గ్రేటర్ పరిధిలోని పలువురు మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలో దళితులకు అన్యాయమే..

జస్టిస్ చంద్రకుమార్



విశ్లేషణ పత్రాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

పంజగుట్ట: ముఖ్యమంత్రి కేసీఆర్ మాయ మాటలతో యావత్ తెలంగాణ దగాపడిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో దగాపడ్డ తెలంగాణ దళితులు అనే విమర్శనాత్మక విశ్లేషణ పత్రం ఆవిష్కరించారు. ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, యాదగిరాచారిలు పుస్తకాన్ని ప్రచురించగా, తెలంగాణ జల సాధన సమితి అధ్యక్షులు నైనాల గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, సీపీఐఎంఎల్, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జేవీ చలపతిరావు, ప్రొఫెసర్ పద్మజాషాలతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ..కేసీఆర్ దళితులను మొదటి నుంచీ మోసం చేస్తూనే ఉన్నారని విమర్శించారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తొమ్మిది సంవత్సరాల్లో దళితులకు పెద్దగా చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో భారత జాతీయ ఉద్యమం సంఘం అధ్యక్షులు కృష్ణ ప్రసాద్, ఎంసీపీఐయూ రాష్ట్ర నాయకులు వనం సుధాకర్, సీపీఐఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో అన్ని రంగాలకు మెరుగైన విద్యుత్

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

అమీర్‌పేట: తెలంగాణలో గృహ, వాణిజ్య, పరిశ్రమలు, విద్యుత్ రంగాలకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. క్వాలిటీ ఫోరం ఆఫ్ ఇండియా (సీసీక్యూసీ–2023) హైదరాబాద్ చాప్టర్ 37వ వార్షిక కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్స్ సదస్సు ముగిసింది. అమీర్‌పేట మ్యారీగోల్డ్ హోటల్‌లో రెండో రోజు మంగళవారం నిర్వహించిన సదస్సులో దయాకర్‌రావు మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులు, ఔత్సాహికుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో క్యూసీఎఫ్ కృషి అభినందనీయమన్నారు. యశోద ఆసుపత్రుల చైర్మన్ జి.రాఘవేందర్‌రావు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ దేవీప్రసాద్, క్యూసీఎఫ్ఐ చైర్మన్ బాలకృష్ణరావు, వైస్ చైర్మన్ మనోహర్ హెగ్డే, జయలక్ష్మి పాల్గొన్నారు.

నేషనల్ హార్టికల్చర్ బోర్డు డైరెక్టర్‌గా వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి

వనస్థలిపురం: నేషనల్ హార్టికల్చర్ బోర్డు డైరెక్టర్‌గా ఎల్‌బీనగర్‌కు చెందిన వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. భారత ప్రభుత్వ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ దేశ వ్యాప్తంగా 8 మంది డైరెక్టర్లను నియమించగా, తెలంగాణ నుంచి శ్రీనివాస్‌రెడ్డికి ఈ అవకాశం దక్కింది. కాగా శ్రీనివాస్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో సొంత వ్యవసాయ క్షేత్రంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. సులువైన, తక్కువ నీటితో పండే పంటను రైతులకు పరిచయం చేయాలన్న ఉద్దేశంతో తన ప్రభుత్వ ఉద్యోగం వదులుకుని వ్యవసాయ క్షేత్రంలోకి అడుగుపెట్టాడు. దేశంలో మొదటిసారిగా వ్యవసాయరంగానికి 2005లో డ్రాగన్ ఫ్రూట్‌ను పరిచయం చేశాడు. తెలుగు రాష్ట్రాల డ్రాగన్ ఫ్రూట్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుతం కొనసాగుతున్నారు.

ఉమ్రా యాత్రికులకు ఘన స్వాగతం


శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉమ్రా యాత్రికులకు స్వాగతం

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర నుంచి 15 రోజుల ఉమ్రా యాత్రను పూర్తి చేసుకున్న యాత్రికులు మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్నారు. యాత్రికులకు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు శంషాబాద్ విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. యాత్రను అల్‌మిజాన్ నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షించారు.

కృత్రిమ మేధస్సుతో రక్షణ వ్యవస్థ పటిష్టం


సదస్సులో ప్రసంగిస్తున్న జయేష్ రంజన్


శత్రువుల డ్రోన్లను పసిగట్టి నిర్వీర్యం చేసే పరికరం

రసూల్‌పురా: అధునాతన సాంకేతిక కృత్రిమ మేధస్సును వినియోగించి భారత సైన్యాన్ని, రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు తమ భాగస్వామ్యాన్ని అందజేస్తున్నట్లు తెలంగాణ ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. సికింద్రాబాద్ తిరుమలగిరి ఎంసీఈఎంఈ ఆడిటోరియంలో 'భారత రక్షణరంగంలో కృత్రిమ మేధస్సు–సాంకేతికత' అంశంపై మంగళవారం ఏర్పాటు చేసిన సదస్సుకు జయేష్‌రంజన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా కృత్రిమ మేధస్సు అభివృద్ధి చెందిందని, గతంలో కంటే అనేక ప్రయోగాలు విజయవంతం అయ్యాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృత్రిమ మేధస్సుకు ప్రాధాన్యం ఇస్తూ టీఎస్ సంస్థ ద్వారా పెద్ద కంపెనీలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎంసీఈఎంఈ లెఫ్టినెంట్ జనరల్ జేఎస్ సిదానా మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ప్రత్యక్ష వినియోగం అంశంపై సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం కృత్రిమ మేధస్సుతో ఆర్మీ రూపొందించిన పలు పరికరాలు, యంత్రాలను జయేష్ రంజన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేజర్ జనరల్ అజయ్ శర్మ, కల్నల్ మనోజ్ సింగ్ సిలోత్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో రూ.కోట్ల విలువైన భూమికి ఎసరు

- కోకాపేటలో 4 ఎకరాల భూమి విక్రయానికి యత్నం
- సమీపంలోని భూమిలో కూల్చివేతలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన యజమాని
- ఎట్టకేలకు అరెస్టు..రిమాండ్


మాటూరి శ్రీనివాస్

మణికొండ: ఓ ప్రైవేటు భూమి ఒకరి పేరుతో రికార్డులలో వస్తుండటం, సదరు వ్యక్తి ఎక్కడ ఉంటున్నాడో తెలియక పోవటంతో దాన్ని కొట్టేసేందుకు ఓ ఫేక్ బృందం చేసిన ప్రయత్నం వికటించింది. ఏకంగా రూ.200 కోట్లకు పైగా విలువైన భూమి కావటంతో నకిలీ రాయుళ్లు ఓ బృందంగా ఏర్పడి దాన్ని స్వంతం చేసుకోవాలని పథకం రచించారు. అందుకనుగుణంగా ఆధార్ కార్డు, పాన్‌కార్డులను అతని పేరుతో సృష్టించటంతో పాటు అదే సంస్థకు చెందిన పక్క భూమిలోకి వెళ్లిం విధ్వంసం సృష్టించారు. సదరు భూ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన నార్సింగి పోలీసులు ఎట్టకేలకు ఫేక్ భూ యజమానిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కోకాపేట రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 168లో 1995 సంవత్సరంలో ఆశ్రేయ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రస్తుత ఓషియన్ పార్కు) పేరుతో 15.32 ఎకరాలను కొందరు వ్యక్తులు కొనుగోలు చేశారు. సదరు సంస్థకు అప్పట్లో కోపూరి శ్రీనివాస్ గుప్తా ఎండీగా ఉన్నారు. కొనుగోలు చేసిన వ్యక్తుల మధ్య విభేదాలు రావటంతో తర్వాత అతను సంస్థకు దూరంగా ఉన్నాడు. వారు కొనుగోలు చేసిన భూమిలో 4 ఎకరాలు వారి పేరుతో అప్పట్లో మ్యుటేషన్ కాలేదు. ఇటీవల ధరణి పోర్టల్‌లో పరిశీలించగా మ్యుటేషన్ కాని 4 ఎకరాల భూమి ఆశ్రేయ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరు, దాని యజమాని కోపూరి శ్రీనివాస్‌గుప్తాగా నమోదై ఉంది. అతను సంస్థకు దూరంగా ఉండటం, ఎక్కడ ఉన్నాడో సదరు సంస్థ వారికే తెలియక పోవటాన్ని ఆసరాగా తీసుకుని మాటూరి శ్రీనివాస్ కుమార్ అనే వ్యక్తి తన ఆధార్ కార్డు, పాన్ కార్డులను అతని పేరుతో నకిలీవి తయారు చేసుకుని సదరు భూమిని విక్రయించేందుకు మార్కెట్‌లో పెట్టాడు. అతని బృందంలోని గజ్జెల కాంతం, కోలా శ్రీనివాస్, ఈగ రవీందర్‌రెడ్డి, మదన్‌గుప్తా, ఒదేలులకు ఈ సంవత్సరం ఏప్రిల్ 18వ తేదీన అగ్రిమెంట్ చేశాడు. జూన్ 24వ తేదీ ఉదయం అగ్రిమెంట్ చేసుకున్న వ్యక్తులు సర్వేనెంబర్ 168కి బదులుగా పక్కనే ఉన్న సర్వే నెంబర్ 166లోకి అక్రమంగా ప్రవేశించి జేసీబీ, ట్రాక్టర్ దోజర్‌లతో గేట్, ప్రహరీ, వాచ్‌మెన్ గది, లేబర్ గదులను కూల్చివేశారు. విషయం తెలుసుకున్న సదరు సంస్థ భాగస్వామి అరవింద్‌కుమార్ అగర్వాల్, అతని అనుచరులు అక్కడకు వెళ్లి వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా చంపేస్తామని బెదిరించారు. దీంతో నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు అక్కడకు వెళ్లే లోపు వారంతా పారిపోయారు. ముఠాలో ప్రధాన నిందితుడు శ్రీనివాస్‌కుమార్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా...

వినాయకుడికి ప్రత్యేక పూజలు



సాక్షి,సిటీబ్యూరో: హిమాయత్‌నగర్‌లోని వినాయక విగ్రహం వద్ద మంగళవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు మిట్టకంటి వినోద్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నయీం తదితరులు పాల్గొన్నారు.

విష్ణువర్ధన్‌రెడ్డిపై బోరబండ పీఎస్‌లో ఫిర్యాదు

రహమత్‌నగర్ : జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డిపై ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు వెంకట స్వామి బోరబండపోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. విష్ణువర్ధన్ రెడ్డి తనను తుపాకీతో బెదిరించాడని, అతడి నుంచి తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ సందర్భంగా వెంకట స్వామి మాట్లాడుతూ సోమవారం సాయంత్రం కార్మిక నగర్‌లో కారులో వెళ్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి తనకు పిలిచి దుర్భాషలాడటమేగాక తుపాకీతో బెదిరించినట్లు ఆరోపించాడు. తనకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరాడు.

వ్యాపారవేత్తలకు అత్యుత్తమ వేదిక 'ఎస్బీఏ'



పంజగుట్ట: వ్యాపారాలను విస్తరించుకోవడంతోపాటు వ్యాపారాభివృద్ధికి దశాదిశను సూచించేందుకు స్వావలంబి భారత అభియాన్(ఎస్బీఏ) మంచి వేదిక అని తెలంగాణ ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సంచాలక్ దక్షిణామూర్తి అన్నారు. మంగళవారం సోమాజిగూడలోని రాజభవన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన స్వావలంబి భారత్ అభియాన్ నూతన కార్యాలయాన్ని ఆయన ఎస్బీఏ సంరక్షక్, బీజేపీ నేత బొల్లంపల్లి ఇంద్రసేనారెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ స్వావలంబి భారత్ అభియాన్ ద్వారా వ్యాపార రంగంలో ఎటువంటి సమస్యలు ఎదురైనా పరిష్కారాలు చూపేందుకు దోహదపడుతుందన్నారు. ఇంద్రసేన్ రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ అందించే సేవలు అన్ని పూర్తిగా ఉచితమని తెలిపారు. యువకులు మహిళలు వ్యాపారవేత్తలుగా మారాలనుకునే వారు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హరీష్ బాబు, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ అగ్రిమెంట్‌తో ఫ్లాట్‌లో తిష్ట

- ఇద్దరిపై కేసు నమోదు

బంజారాహిల్స్: నకిలీ ఒప్పంద పత్రాన్ని సృష్టించి దాని ద్వారా ఖరీదైన ఫ్లాట్‌లో అక్రమంగా తిష్టవేసిన ఇద్దరు వ్యక్తులపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 78 భవానీ లే అవుట్ చెందిన నార్ల కవిత, కుమారుడు నార్ల సూర్యతో కలిసి అమెరికాలోని న్యూజెర్సీలో ఉంటోంది. ఇటీవల ఆమె కుమారుడితో సహా నగరానికి వచ్చింది.ఈ నేపథ్యంలో లంక సూర్యకుమారి, వేమూరి శకుంతల ఆమెను చూసేందుకు భవానీ లే అవుట్‌కు వచ్చారు. నార్ల కవిత అమెరికాకు వెళ్లగా సూర్య కుమారి, శకుంతల తాము రెండు రోజులు ఉండి ఫ్లాట్ తాళాలను వాచ్‌మెన్ ఇచ్చి వెళతామని చెప్పారు. కొద్ది రోజుల అనంతరం కవిత వాచ్‌మెన్‌కు ఫోన్ చేయగా శకుంతల ఆమె కుమారుడు వేముల నాగేశ్వరరావు ఇంట్లో ఉన్నట్లు చెప్పాడు. అంతే కాకుండా నాగేశ్వరరావు ఫ్లాట్‌ను మరొకరికి అద్దెకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపాడు. దీంతో నగరానికి తిరిగివచ్చిన కవిత ఫ్లాట్‌కు వెళ్లగా ఇంట్లో ఉన్న శకుంతల, నాగేశ్వరరావులను ప్రశ్నించగా వారు తన సంతకం లేని నకిలీ ఒప్పందం చూపించడంతో పాటు రూ.2.40 లక్షలు తన కుమారుడికి ఇచ్చినట్లు చెప్పారు. దీంతో బాధితురాలు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి తాళాలు పగులకొట్టిన వ్యక్తిపై కేసు నమోదు

బంజారాహిల్స్: హత్య తాలూకు ఆధారాలను నాశనం చేసేందుకు ఇంటి తాళాలు పగులకొట్టిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చెన్నైకి చెందిన యాన ప్రణీత్‌కు ఎమ్మెల్యే కాలనీ జ్యోతి విల్లా అపార్ట్‌మెంట్‌లో రెండు ఫ్లాట్లు ఉన్నాయి. అతని తల్లి యాస హేమలత ఇదే ఫ్లాట్‌లో 2014లో హత్యకు గురయ్యారు. ఈ హత్య అతని తండ్రి యాన ప్రభాకరెడ్డి చేసినట్లు ఆరోపణలు రావడంతో కోర్టులో విచారణ జరుగుతోంది. ఇదిలా ఉండగా 15 రోజుల క్రితం యాన ప్రభాకర్, అతని అనుచరుడు దాస్ అక్రమంగా ఫ్లాట్ తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రణీత్ ఫిలింనగర్ పోలీసులను ఆశ్రయించాడు. తన తల్లి హత్య కేసులో సాక్ష్యాలు, ఆధారాలను తొలగించేందుకు యాన ప్రభాకరెడ్డి ఉద్దేశపూర్వకంగా తన ఆధీనంలో ఉన్న ఫ్లాట్‌లోకి ప్రవేశించారని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మిక శోభ

బంజారాహిల్స్: ఒక వైపు అన్నదాన కార్యక్రమాలు, మరోవైపు నిమజ్జన శోభాయాత్రలు, ఇంకోవైపు విశేష పూజా కార్యక్రమాలతో వినాయక మండపాల చెంత ఆధ్యాత్మికత వెల్లివిరిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో గణనాథులకు ప్రత్యేక పూజలు జరుగుతుండగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. మండపాల వద్ద ఉత్సవ కమిటీ నిర్వాహకులు పూజలకు తోడు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుండటంతో సందడి నెలకొంది. పంజగుట్ట ప్రతాప్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ నేత నల్ల శివ ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ద్వారకా నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడికి వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్, జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, సీఐ రామకృష్ణతో పాటు ఎస్ఐలు పూజలు చేశారు. ఇందిరానగర్, శ్రీకృష్ణానగర్ షాప్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు విశేష పూజలు నిర్వహించారు.



పంజగుట్ట ప్రతాప్‌నగర్‌లో గణనాథుడి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్



ఫిలింనగర్ బీజేఆర్‌నగర్‌లో గణనాథుడి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం



గౌరీ శంకర్ కాలనీలో..



ద్వారకానగర్‌లో..



నందినగర్‌లో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న పీసీసీ కార్యదర్శి పి. విజయారెడ్డి

తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలి

పంజగుట్ట: తెలంగాణ కోసంపోరాడిన అసలైన ఉద్యమకారులకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ అమరవీరుల ఆశయ సాధన జాయింట్ యాక్షన్ కమిటీ కో కన్వీనర్ రుద్ర శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభలో ప్రతి తెలంగాణ ఉద్యమకారుడికి 250 గజాల స్థలం కేటాయిస్తామని ప్రకటించడం హర్షనీయమన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రేవంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్లాటుతో పాటు ఇల్లు కట్టుకునేందుకు రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాధనకోసం 1200 మంది బలిదానం చేసుకున్నారని ఎన్నో సభల్లో స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించారని కానీ పరిహారం మాత్రం కొందరికే దక్కిందన్నారు. వెంటనే వారికి కూడా పరిహారం ఇవ్వాలని అమరుల పిల్లలకు ప్రతి విద్యాసంస్థలో 10 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అమరులు, ఉద్యమకారుల కుటుంబాలకు కనీసం 10 ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించాలని, ప్రత్యేక హెల్త్‌కార్డు ఇచ్చి అన్ని ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించాలని, తెలంగాణ ఉద్యమంలో సర్వస్వం కోల్పోయిన ఉద్యమకారులకు నెలకు రూ. 25వేలు గౌరవవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గల్ఫ్ కార్మికులకోసం ప్రత్యేక ఎన్ఆర్ఐ సెల్ ఏర్పాటు చేసి, షబ్బీర్‌అలీని మంత్రిగా పెట్టారని ఆయన తర్వాత గల్ఫ్ బాధితులను పట్టించుకున్న వారే కరువయ్యారని ఆగ్రహంవ్యక్తం చేశారు. గల్ఫ్ దేశంలో సుమారు 18 లక్షల మంది కార్మికులు ఉంటారని, ఎంతో మంది భారత్‌కు తిరిగివచ్చేందుకు చూస్తూ అక్కడే మగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలని, లేకపోతే:గల్ఫ్ కార్మికుల కుటుంబాలు సుమారు 28 నియోజకవర్గాల్లో గెలుపు, ఓటములు ప్రభావితం చేస్తారని వారిని రాబోయే ఎన్నికల్లో బరిలో దించుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్.యాదగిరి, పి.తుల్జారెడ్డి, డాక్టర్ కానుగంటి రాజు, ఎస్.ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రుద్ర శంకర్

నిరాశ్రయులకు హక్కులు కల్పించాలి

పంజగుట్ట: నిరాశ్రయుల కోసం తగినన్ని షెల్టర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యంగా మహిళలకు అన్ని సదుపాయాలతో షెల్టర్స్ ఏర్పాటు చేయాలని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోరారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 1న నాంపల్లి, సికింద్రాబాద్‌లో నిరాశ్రయలతో ఒక రాత్రి గడపనున్నట్లు తెలిపారు. వారితో కలిసి భోజనం చేయడం, ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిరాశ్రయులతో ఒక రాత్రి కరపత్రాన్ని ఆయా సంస్థల ప్రతినిధులు సంధ్య, అనురాధ, అంబిక, వెంకట రెడ్డి, జీవన్, కన్నెగంటి రవి, ఫిరోజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో నిరాశ్రయులకు షెల్టర్స్ తగ్గుతున్నాయని హైదరాబాద్‌లో 120 అవసరం కాగా కేవలం 14 మాత్రమే ఉన్నాయన్నారు. ప్రభుత్వం వారి కోసం ప్రత్యేక చట్టం చేయాలన్నారు. వారి పిల్లలకు ఆధారం లేక విద్యకు దూరమవుతున్నారన్నారు. వారు గౌరవ ప్రదంగా జీవించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. వారికి ప్రతి మున్సిపాలిటీల్లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో శ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ జయశ్రీ, జనని ఫౌండేషన్ ప్రతినిధి మల్లేష్ పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

కేబీఆర్ పార్క్ వద్ద కొండచిలువ కలకలం



బంజారాహిల్స్: కేబీఆర్ పార్క్ సమీపంలోని ఫుట్ పాత్‌పై పాములు భయాందోళనకు గురిచేస్తున్నాయి. మంగళవారం ఫుట్‌పాత్‌పై కొండచిలువ కనిపించడంతో వాకర్లు ఆందోళనకు గురయ్యారు. పార్కు సిబ్బంది వాటిని పట్టుకుని పార్కులో వదిలేస్తున్నా తిరిగి గ్రిల్స్ ద్వారా బయటికి వస్తున్నాయి.

చైన్ స్నాచర్ అరెస్ట్



నిందితుడు మహ్మద్ అబ్దుల్ అలీం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12 ప్రధాన రహదారిలో జగన్నాథ టెంపుల్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన కేసులో నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు మంగళవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్ఐ రాంబాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... గోల్కొండ మహ్మది లైన్స్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ అలీం ఆర్టిఫిషియల్ జ్యువెలరీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అతను ఈజీ మనీ కోసం దొంగతనాలకు పాల్పడుతున్నాడు. మూడు రోజుల క్రితం బంజారాహిల్స్ లోని ఎన్బీటీ నగర్‌కు చెందిన బోడ కిషన్ అనే వ్యక్తి వాకింగ్‌కోసం కేబీఆర్ పార్కు వైపు వస్తుండగా రాంగ్‌రూట్‌లో వచ్చిన ఫహాద్ అతడి మెడలో నుంచి రెండు తులాల గొలుసు లాక్కుని పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన బంజారాహిల్స్ క్రైం పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితుడిని గుర్తించారు. జేబులో కత్తి పెట్టుకుని తిరుగుతూ ఎదురుతిరిగిన వారిని బెదిరిస్తూ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లుగా గుర్తించారు. నిందితుడి నుంచి కత్తితో పాటు బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. అతడిపై లంగర్‌హౌజ్, ఫలక్‌నామా, మైలార్‌దేవుల పల్లి, గోల్కొండ పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. బంజారాహిల్స్ డీఐ షేక్ జాకీర్ హుస్సేన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెట్టుబడుల పేరుతో టోకరా

- రూ.47లక్షలు స్వాహా
- నిందితుడి అరెస్టు



నిందితుడు క్షితిజ్ కుమార్

హిమాయత్‌నగర్: ప్రముఖ కంపెనీ 'టాటా క్యాపిటల్ ఫైనాన్స్'లో ఇన్వెస్ట్ చేస్తే అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించిన ఓ ఉద్యోగి భారీ అవకతవకలకు పాల్పడ్డాడు. పదుల సంఖ్యలో కస్టమర్ల నుంచి పెట్టుబడి పెట్టించి ఆ డబ్బును, అందుకు సంబంధించిన కమీషన్లను కాజేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు క్రైం, సిట్ జాయింట్ కమిషనర్ గజరావు భూపాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గాజుల రామారానికి చెందిన క్షితిజ్ కుమార్ టాటా క్యాపిటల్ కంపెనీలో ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం కన్నన్ అనే మహిళ, మరికొందరికి తమ కంపెనీ దేశంలోనే అత్యుత్తమమైనదని, తమ కంపెనీ ద్వారా పెట్టుబడి పెడితే పదిరెట్లు అధిక లాభాలు వస్తాయన్నాడు. దీంతో 'ప్రాడిజైన్ అడ్వర్టైజ్‌మెంట్, అర్బన్ వన్, బిజినెస్ వన్ కార్పొరేషన్, మగ్నూస్ కార్పొరేషన్, గ్రామ్‌గ్నెట్, వాల్డీస్ ప్రాజెక్ట్స్' తదితర పేర్లు చెప్పి కన్నన్, మరికొందరి నుంచి రూ.3కోట్ల 56లక్షల 74వేలు పెట్టుబడి పెట్టించాడు. ఏడాదికి 12శాతం లాభాలు ఇస్తామని చెప్పి, ఒక్క రూపాయి కూడా వీరికి లాభాలు ఇవ్వలేదు. ఇందుకుగాను దాదాపు రూ.47లక్షలు కమీషన్‌గా తీసుకున్నాడు. వచ్చిన లాభాలను దారి మళ్లించాడు. తాము పెట్టుబడి పెట్టిన మొత్తాన్ని ఇవ్వాలని బాధితులు పలుమార్లు కోరినా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశాడు. పలు పోలీసుస్టేషన్‌లలో క్షితిజ్‌కుమార్‌పై కేసులు నమోదు కావడం, అవి సీసీఎస్‌కు బదిలీ కావడంతో సీసీఎస్ పోలీసులు మంగళవారం క్షితిజ్ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు జాయింట్ సీపీ వివరించారు.

విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాలి

పంజగుట్ట: విద్యా వ్యవస్థను సమూలంగా మార్పు చేస్తేనే విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పడతాయని పలువురు వక్తలు అన్నారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం, మదర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హైదరాబాద్ జిల్లాలో దిగజారిన విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలని కోరుతూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి, బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ గంజి వేణుగోపాల్, రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి కన్నెగంటి రవి మాట్లాడుతూ .. విద్యావ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం జిల్లాల వారీగా పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ విడుదల చేసిందని ఈ నివేదిక ప్రకారం హైదరాబాద్ జిల్లాలో అభ్యాసన సామర్థ్యం 121 పాయింట్లతో 14వ స్థానంలో ఉందన్నారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ప్రకారం ఎనిమిదో తరగతి విద్యార్థులు తెలుగులో 48 శాతం, లెక్కల్లో 30, సామాన్య శాస్త్రంలో 35, సాంఘీక శాస్త్రంలో 34 శాతం మాత్రమే వారి విద్యాసామర్థ్యాలు కలిగి ఉన్నారని తెలిపారు. సామాజిక వర్గాల వారీగా తీసుకుంటే ఎస్సీ విద్యార్థులు 26 నుండి 51, ఎస్టీ విద్యార్థులు 27 నుండి 53 శాతం, బీసీలు 27 నుండి 54 శాతం మాత్రమే సామర్థ్యం కలిగి ఉండడం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లోనూ పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఇందుకు ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో చిరంజీవి, ఇటిక గోపి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి ఆహ్వానం



ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకోవాలని కోరుతూ మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. బుధవారం ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ ఉత్సవ కమిటి సభ్యుడు బాల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నగర నాయకుడు మంగళవారపు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

మహిళ అదృశ్యం



మల్లెల సలోమి

ఫిలింనగర్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ఫిలింనగర్‌లోని అంబేడ్కర్‌నగర్ బస్తీకి చెందిన మల్లెల సలోమి(33) షేక్‌పేట సమీపంలోని కోకిల రియల్ ఎస్టేట్ సంస్థలో పని చేసేది. గత కొంత కాలంగా భార్యా భర్తల మధ్య గొడవలు జరగడంతో ఆమె గత నెలలో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. నానక్‌రామ్‌గూడలో ఓ ఇంట్లో ఉంటున్నట్లు తెలుసుకున్న భర్త ప్రేమ్‌కుమార్ ఆమెను ఇంటికి రావాలని పలు మార్లు కోరాడు. అయితే ఇటీవల అక్కడి నుంచి కూడా ఆమె చెప్పకుండా వెళ్ళిపోయింది. ఆమె కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో తన భార్య కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పోలీసు విధులను అడ్డుకున్న వ్యక్తికి జైలు



భరత్

వెంగళరావునగర్ : పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి ఉప్పల్ ప్రాంతానికి చెందిన భరత్ అనే యువకుడు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పెట్రోలింగ్ సిబ్బంది అతడిని ఇంటికి వెళ్లాలని సూచించారు. దీంతో అతను పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించడమే గాక దుర్భాషలాడాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని మధురానగర్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరు పరచగా నాంపల్లిలోని పదో అదనపు మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కె. లలిత నిందితుడికి రెండు రోజులు జైలు శిక్ష, రూ.50 జరిమానా విధించారు.

రాకపోకల పునరుద్ధరణ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 48లో జూబ్లీహిల్స్ కో–ఆపరేటివ్ హౌజ్ బిల్డింగ్ సొసైటీ నిర్మించిన సొసైటీ కమ్యూనిటీహాల్ మధ్యలో నుంచి ఆక్రమిత ప్రహరీని జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం అధికారులు కూల్చివేసి వాహనదారుల రాకపోకలను పునరుద్ధరించారు. మంగళవారం నుంచి ఈ రోడ్డు మీదుగా రాకపోకలు జూబ్లీహిల్స్ రోడ్ నెం. 51 వైపు చిరెక్ పబ్లిక్ స్కూల్ వైపు ప్రారంభమయ్యాయి. ఇన్నాళ్లు ఇరుకైన రహదారులతో చుట్టూ తిప్పుకొని సమస్యాత్మకంగా వెళ్తున్న వాహనదారులకు ఈ రోడ్డు అందుబాటులోకి రావడంతో రాకపోకలు తేలికయ్యాయి. గత కొన్నేళ్లుగా జూబ్లీహిల్స్ సొసైటీ రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా రోడ్డు ఆక్రమణలు తొలగించడంతో పాటు కబ్జా చేసి ప్రహరీని కూల్చివేయడంతో రాకపోకలు సులువయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు కూడా కబ్జా చెర నుంచి రోడ్డును విముక్తి చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యకు దీంతో చెక్ పడిందని వారు పేర్కొన్నారు.



జూబ్లీహిల్స్ రోడ్ నెం. 48 నుంచి మొదలైన రాకపోకలు

మహిళా సమాఖ్యలను బలోపేతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న టీఎల్ఎఫ్ మహిళలు

బంజారాహిల్స్: మహిళా సమాఖ్యలను బలోపేతం చేయాలని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని జీహెచ్ఎంసీ సీఎంటీసీ భవన్‌లోజీహెచ్ఎంసీ సర్కిల్–18 టౌన్‌లెవల్ ఫెడరేషన్ మహిళా అధ్యక్షుల సమావేశం జరిగింది. 31 మంది టీఎల్ఎఫ్ అధ్యక్షులు, 31 మంది రిసోర్స్‌పర్సన్లు హాజరైన ఈ సమావేశంలో యూసీడీ విభాగం సీవోలు బుచ్చమ్మ, ఉపేందర్, భావ్‌సింగ్ పాల్గొన్నారు. ఆర్పీలు, సమాఖ్యలు కలిసికట్టుగా ఉంటూ మహిళా సమాఖ్యలను మరింత బలోపేతం చేయాలని వారు సూచించారు. ఎన్నికల సమయంలో రిసోర్స్ పర్సన్లు పలు సర్వేలు, ఇతర ప్రభుత్వ కార్యకలాపాల్లో పాల్గొనాల్సి ఉంటుందని, మహిళా గ్రూపులపై ఎక్కువగా రెండు నెలల పాటు శ్రద్ధ పెట్టకపోవచ్చునని సమాఖ్యలు అర్థం చేసుకోవాలని సీవోలు సూచించారు. అవసరమైతే సమాఖ్యలు కూడా పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. తమపై ఒత్తిడి బాగా పెరుగుతున్నదని గ్రూపులకు ఎక్కువ సమయంలో కేటాయించలేకపోతున్నామని ఇదంతా కొద్ది రోజులే ఉంటుందని ఈ సందర్భంగా ఆర్పీలు వెల్లడించారు. టీఎల్ఎఫ్ అధ్యక్షురాలి ఎంపికకు సమయం పడుతుందని వెల్లడించారు.

30న సైఫాబాద్ సైన్స్ కాలేజీలో అంతర్జాతీయ సదస్సు

బంజారాహిల్స్: యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైఫాబాద్ సైన్స్‌లో ఈ నెల 30న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె. లక్ష్మణ్ నాయక్ తెలిపారు. ఈ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం కళాశాలలో ఆయన ఆవిష్కరించారు. సుమారు 500 మంది ఈ సదస్సులో పాల్గొననున్నట్లు తెలిపారు. ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. రవీందర్‌యాదవ్ చొరవతో ఈ ఏడాది నుంచి డిగ్రీలో మూడు కొత్త కోర్సులు ప్రవేశ పెట్టడం జరిగిందని పీజీలో కొత్తగా మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, డాటా సైన్స్ కోర్సులకు ఈ విద్యాసంవత్సరం నుంచి అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సైఫాబాద్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్ తదితరులు

రోడ్డు నిర్మాణాలు వేగవంతం చేయాలి



మధురానగర్‌లో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి

వెంగళరావునగర్ : కాలనీల్లో శంకుస్థాపన చేసిన సీసీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి, సాధ్యమైనంత త్వరలో ప్రజలకు అందుబాటులోకి తేవాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. వెంగళరావునగర్ డివిజన్, మధురానగర్‌లో రూ.9.40 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మంగళవారం ఆయన స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీల్లో ఎక్కడ ఎలాంటి అవసరం ఉన్నా తక్షణమే తనను నేరుగా సంప్రదించాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్‌ను నగరంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నానన్నారు. అనంతరం సిద్ధార్థనగర్‌కాలనీ, కల్యాణ్‌నగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమాల్లో వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్, నాయకులు కోడె సాంబశివరావు, కళ్యాణ చక్రవర్తి, రాజేంద్రప్రసాద్, ఎస్ఎస్ఎస్‌వి ప్రసాద్, అంబటి రామకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు అర్థరహితం

హిమాయత్‌నగర్: ముదిరాజ్‌లను ఓసీ జాబితాలో కలపాలని తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని ముదిరాజ్ సంక్షేమ సమితి నేతలు అన్నారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సమితి అధ్యక్షుడు అల్లాదుర్గం సురేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్న సోమవారం తాజ్ కృష్ణాలో ఏర్పాటు చేసిన బీసీ సంఘాల సదస్సులో ముదిరాజ్‌లను ఓసీల్లో కలవాలని ప్రకటించడం దారుణమన్నారు. తీన్మార్ మల్లన్న తన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ముదిరాజ్‌ల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యదర్శి గోనెల కుమారస్వామి ముదిరాజ్ మాట్లాడుతూ..దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2009లో ముదిరాజ్‌లను జీవో 15 ద్వారా 'బీసీ ఏ' లో చేర్చారని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు బాబు రావు ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, సంజయ్, మధు, సత్యనారాయణ ముదిరాజ్, కొటికే రాము ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమితి నేతలు

చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

వెంగళరావునగర్ : తెలంగాణా వీరనారి చాకలి ఐలమ్మ తెగువ అందరికీ ఆదర్శం కావాలని, ఆమె స్ఫూర్తితో విజయాలను సాధించాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. చాకలి ఐలమ్మ 128వ జయంతి వేడుకలు మంగళవారం వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ సాయిబాబా దేవాలయం సమీపంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం నేటితరం మహిళలకు ఆదర్శనీయమన్నారు. తొలుత ఐలమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్, చిన్న రమేష్, నాయకులు సత్యనారాయణ, పూజారి బాల్‌రాజ్, పవన్ ముదిరాజ్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరం

పంజగుట్ట: మైనర్ డ్రైవింగ్ ఎంతో ప్రమాదమని, చట్ట ప్రకారం నేరమని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు అన్నారు. మంగళవారం సోమాజిగూడ విల్లామేరీ కాలేజీలో రోడ్డు నిబంధనలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.గిరితో కలిసి మాట్లాడుతూ .. విద్యార్థి దశనుండే ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని సూచించారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపరాదన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన సైనింగ్ బోర్డుల సూచనలు, సలహాలు పాటిస్తూ సురక్షిత డ్రైవింగ్‌తో గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. వేగంగా వెళ్లే వాహనానికి, సాధారణ స్పీడ్‌తో వెళ్లే వాహనానికి తేడా కేవలం 15 నిమిషాలు మాత్రమే ఉంటుందన్నారు. ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పక హెల్మెంట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలన్నారు. వాహనదారుల్లో, ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే రోడ్డుప్రమాదాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఫెలోమినా, సెక్రటరీ చిన్నమ్మ, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రావు, ప్రిన్సిపాల్ రేవతి తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్ రాజు

టెస్కాబ్‌కు జాతీయస్థాయి అవార్డులు



అవార్డులు అందుకుంటున్న నేతి మురళీధర్, కొండూరి రవీందర్‌రావు

సాక్షి, హైదరాబాద్: సహకార రంగంలో దేశానికే తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) ఆదర్శంగా నిలిచింది. రాష్ట్ర సహకార బ్యాంకుల జాతీయ సమాఖ్య ద్వారా టెస్కాబ్‌కు అవార్డులు దక్కాయి. మూడంచెల విధానంలో టెస్కాబ్ వరుసగా అవార్డులను కైవసం చేసుకుంటోంది. అందులో భాగంగా రాజస్తాన్‌లోని జైపూర్‌లో మంగళవారం 2020–21, 2021–22 సంవత్సరాలకు ప్రథమ, ద్వితీయ అవార్డులను టెస్కాబ్ అందుకుంది. అలాగే దేశంలోని అన్ని రాష్ట్ర సహకార శిక్షణ సంస్థల్లో టెస్కాబ్‌కు చెందిన సహకార శిక్షణ సంస్థ (సీటీఐ)కు 2020–21, 2021–22 సంవత్సరాలకు ప్రథమ అవార్డును ప్రదానం చేశారు. కాగా, దేశంలోని 351 జిల్లా సహకార బ్యాంకుల్లో కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు 2020–21, 2021–22 సంవత్సరాలకు ద్వితీయ, ప్రథమ అవార్డులను ప్రదానం చేశారు. అలాగే దేశంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి 2021–22 సంవత్సరానికి సుభాష్ యాదవ్ అవార్డు కింద ప్రథమ బహుమతిని అందజేశారు. ఈ అవార్డులను రాజస్తాన్ సహకారశాఖ ముఖ్యకార్యదర్శి శ్రేయ గుహ నుంచి టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మేనేజింగ్ డైరెక్టర్ నేతి మురళీధర్ అందుకున్నారు.

జీఎమ్మార్ ఎయిర్‌పోర్టుకు నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మరోసారి ప్రతిష్టాత్మక 'నేషనల్ ఎనర్జీ లీడర్' అవార్డు లభించింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహించిన 'ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్'– 24వ జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో 'నేషనల్ ఎనర్జీ లీడర్', 'ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ యూనిట్'అవార్డులను గెలుచుకుంది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి 'నేషనల్ ఎనర్జీ లీడర్'అవార్డు లభించడం వరుసగా ఇది ఐదోసారి కాగా 'ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ యూనిట్' అవార్డు లభించడం వరుసగా ఇది ఏడవసారి. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ సీఈవో ప్రదీప్ పాణికర్ మాట్లాడుతూ... ఇంధన వినియోగంలో సమర్థ వంతమైన, నాణ్యమైన విధానాలను అమలు చేయడం వల్ల సత్ఫలితాలను సాధించామ న్నారు. పర్యావరణ పరిరక్షణకు అనేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. 2030 నాటికి కార్బన్ న్యూట్రాలిటీని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు.


6,7,8 తేదీల్లో నరెడ్కో ప్రాపర్టీ షో

నరెడ్కో ప్రెసిడెంట్ సునీల్ చంద్రా రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో అక్టోబర్ 6,7,8 తేదీల్లో నరెడ్కో 13వ ప్రాపర్టీ షో జరగనుందని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) తెలంగాణ ప్రెసిడెంట్ బీ సునీల్ చంద్రారెడ్డి తెలిపారు. కష్టమర్ల అవసరాలకు అనుగుణంగా నివాస, కార్యాలయ, వాణిజ్య, రిటైల్ సముదాయాల వివరాలు ఈ ప్రాపర్టీ షోలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ ప్రాపర్టీ షోకు ప్రవేశం ఉచితమని మంగళవారం ఇక్కడ మీడియా సమావేశంలో వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానపరమైన నిర్ణ యాలు, మెరుగైన మౌలిక వసతులతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పరుగులు పెడుతోందని సునీల్ చంద్రారెడ్డి తెలిపారు. గత కొన్ని త్రైమాసికాలుగా హైదరాబాద్ రియల్టీ రెండంకెల వృద్ధి రేటును నమోదు చేస్తోందన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ ఆనంద్ కన్నుమూత



సాక్షి, న్యూఢిల్లీ: సీనియర్ జర్నలిస్టు యు.ఆనంద్ కుమార్ (61) మంగళవారం ఢిల్లీలో కన్నుమూశారు. ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో చదివిన ఆయన మూడున్నర దశాబ్దాల క్రితం జర్నలిజాన్ని కెరీర్‌గా స్వీకరించారు. ఢిల్లీలో సాక్షి, ఉదయం, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లలో కరస్పాండెంట్‌గా పని చేశారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీలోని ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు కార్యాలయంలో మీడియా కోఆర్డినేటర్‌గా పని చేస్తున్నారు. ఆనంద్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. ఆనంద్ ఆకస్మిక మృతి పట్ల ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఇక టాప్ గేర్!

ఆరు నెలలు కీలకం.. సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌చార్జ్‌లకు ఏపీ సీఎం జగన్ దిశానిర్దేశం

> ప్రజల్లో... ఎవరికి ఇస్తే సరైంది? అనే ప్రాతిపదికనే టికెట్లు ఇస్తా. టికెట్ ఇవ్వనంత మాత్రాన.. ఆ మనిషి నా మనిషి కాకుండా పోతాడని అనుకోవద్దు. టికెట్ ఇస్తే అది ఒక బాధ్యత. టికెట్ వచ్చినా, రాకున్నా మీరు ఎప్పటికీ నా వాళ్లుగానే ఉంటారు. అది కచ్చితంగా గుర్తు పెట్టుకోండి. జుత్తు ఉంటేనే ముడివేసుకోగలం. అధికారంలో ఉంటేనే ప్రజలకు మరింత మంచి చేయగలం. టికెట్ ఇవ్వలేని పక్షంలో వారికి మరొకటి ఇస్తా. లీడర్ మీద, పార్టీ మీద నమ్మకం ఉంచాలి. అప్పుడే అడుగులు సరైన మార్గంలో పడతాయి. టికెట్ల విషయంలో నేను తీసుకోబోయే నిర్ణయాలకు అందరూ పెద్ద మనసుతో సహకరించాలి.
>
> – సీఎం వైఎస్ జగన్



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు

సాక్షి, అమరావతి: శాసనసభ సమావేశాలు బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో ఇక మనం గేర్ మార్చాల్సిన సమయం ఆసన్నమైందని పార్టీ నేతలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఇన్ని రోజులు మనం చేసిన ప్రచారం, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఒక ఎత్తు కాగా శాసనసభ సమావేశాలు ముగిశాక నిర్వహించే కార్యక్రమాలు, ఎన్నికలకు సన్నద్ధమయ్యే తీరు ఇంకొక ఎత్తు అని పేర్కొన్నారు. ఇన్ని రోజులు మనం బాగా చేశాం కదా..! వచ్చే ఆరు నెలలు సరిగా పని చేయకపోయినా పర్వాలేదనే భావన సరి కాదని హితవు పలికారు. రానున్న ఆర్నెళ్ల ఎలా పని చేస్తామన్నదే చాలా ముఖ్యమైన విషయమని, ఇది మనసులో పెట్టుకుని ప్రతి అడుగూ ముందుకు వేయాలని పార్టీ నేతలకు సూచించారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, ఎమ్మెల్సీలతో ముఖ్యమంత్రి జగన్ సమావేశమయ్యారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఏపీకి జగనే కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) అనే పేరుతో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై వచ్చే రెండు నెలల్లో నిర్వహించే ప్రచారంపై చర్చించారు. ఎన్నికలకు సన్నద్ధం కావాల్సిన తీరుపై పార్టీ నేతలకు మార్గనిర్దేశం చేశారు.

సాధ్యమేనని నేను గతంలోనే చెప్పా..

''నేను ఇంతకు ముందే చెప్పా.. 175కు 175 స్థానాల్లో గెలుపు ఎందుకు సాధ్యం కాదు? వైనాట్ 175? ఇది సాధ్యమే. క్షేత్రస్థాయిలో అందుకు తగ్గ సానుకూల పరిస్థితులు ఉన్నాయి కాబట్టే ఇది సాధ్యం. మనం క్షేత్ర స్థాయిలో అంత బలంగా ఉన్నాం కాబట్టే ప్రతిపక్షాలు ఒంటరిగా పోటీ చేయలేక, భయపడి పొత్తులకు వెళ్తున్నాయి. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో మన పార్టీ పట్ల, ప్రభుత్వం పట్ల ప్రజల సానుకూల స్పందనను మీరంతా కళ్లారా చూశారు. ప్రతి ఇంటికీ మీరు వెళ్లినప్పుడు, అక్కచెల్లెమ్మలకు లేఖలను అందించినప్పుడు వారిలో వచ్చిన స్పందనను మీరు చూశారు. ఇదే ఆత్మవిశ్వాసం, ఇదే ధైర్యం, ఇదే ముందు చూపు, ఇదే ముందస్తు ప్రణాళికతో అందరూ అడుగులు ముందుకేయాలి'' అని సీఎం చెప్పారు.

చంద్రబాబు ఏ-1.. లోకేశ్ ఏ-14

▶ మొదటి పేజీ తరువాయి

భూబాగోతాన్ని సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆధారాలతో సహా బట్టబయలు చేసింది. క్విడ్ ప్రోకో కింద చంద్రబాబు పొందిన కరకట్ట నివాసాన్ని, నారాయణ కుటుంబ సభ్యులు సీడ్ క్యాపిటల్‌లో పొందిన 75,888 చ.గజాల ప్లాట్లు, కౌలు మొత్తంగా పొందిన రూ.1.92 కోట్లను అటాచ్ చేయాలని ఇప్పటికే నిర్ణయించింది. ఈమేరకు న్యాయస్థానంలో పిటిషన్ కూడా దాఖలు చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఏ–1గా చంద్రబాబు, ఏ–2గా నారాయణను పేర్కొన్న సిట్ నారా లోకేశ్‌ను ఏ–14గా పేర్కొంటూ విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో మంగళవారం ప్రత్యేక మెమో దాఖలు చేసింది. లింగమనేని రమేశ్, రాజశేఖర్‌లతోపాటు హెరిటేజ్ ఫుడ్స్ సంస్థను కూడా ఈ కేసులో నిందితులుగా పేర్కొంది.

ఐఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌లో అవినీతి మెలికలు..

అమరావతి ముసుగులో చంద్రబాబు సాగించిన భారీ భూదందాలో ఐఆర్‌ఆర్ కుంభకోణం ఓ భాగం! మాజీ మంత్రి పొంగూరు నారాయణతో పాటు లోకేశ్ ఈ కుంభకోణంలో కీలక పాత్ర పోషించారు. చంద్రబాబు తమ బినామీ, సన్నిహితుడైన లింగమనేని రమేష్‌తో క్విడ్ ప్రోకోకు పాల్పడి ఆయన భూముల విలువను భారీగా పెరిగేలా చేశారు. అందుకు ప్రతిగా బినామీల పేరిట భారీగా భూములను పొందడమే కాకుండా కరకట్ట నివాసంతోపాటు హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు కానుకగా దక్కించుకున్నారు. నాడు సీఆర్‌డీఏ అధికారులు రూపొందించిన 94 కి.మీ. అమరావతి ఐఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌పై చంద్రబాబు, నారాయణ మండిపడ్డారు. ఆ అలైన్‌మెంట్ ప్రకారం ఇన్నర్ రింగ్ రోడ్డు అమరావతిలోని పెదపరిమి, నిడమర్రు, చిన వడ్లపూడి, పెదవడ్లపూడి మీదుగా వెళ్తుంది. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి చెందిన భూములకు 3 కి.మీ. దూరం నుంచి దాన్ని నిర్మించాల్సి వస్తుంది. దీంతో తమ భూముల విలువ అమాంతం పెరగదని వారు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారి ఆదేశాలతో సీఆర్‌డీయే అధికారులు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు. చంద్రబాబు, లింగమనేని కుటుంబానికి చెందిన వందలాది ఎకరాలున్న తాడికొండ, కంతేరు, కాజాను పరిగణలోకి తీసుకున్నారు. అందుకోసం ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కిలోమీటర్లు దక్షిణానికి జరిపారు. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి కంతేరు, కాజాలో ఉన్న భూములను ఆనుకుని ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా 97.50 కి.మీ. అలైన్‌మెంట్‌ను రూపొందించారు. అయితే ఆ విషయాన్ని గోప్యంగా ఉంచారు. అనంతరం సింగపూర్‌కు చెందిన సుర్బానా జ్యురాంగ్ కన్సల్టెన్సీని రంగంలోకి తెచ్చి అప్పటికే ఖరారు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్ డిజైన్‌ను అమరావతి మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు. ఎస్టీయూపీ అనే కన్సల్టెన్సీని నియమించి మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచిన అలైన్‌మెంట్‌కు అనుగుణంగా ఉండా లని ఆదేశించారు. అప్పటికే సీఆర్‌డీయే అధికారుల ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీ యూపీ కన్సల్టెన్సీ ద్వారా ఆమోదించేలా చేశారు. ఈ క్రమంలో తాడికొండ, కంతేరు, కాజాలో హెరి టేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకుని అలైన్‌మెంట్‌ను ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసింది.

హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు

ఐఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మెలికలు తిప్పడం ద్వారా లింగమనేని కుటుంబం భూముల విలు వను భారీగా పెరిగేలా చేశారు. కంతేరు, కాజాలో లింగమనేని కుటుంబానికి ఉన్న 355 ఎకరాలను ఆనుకునే అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. అందుకు ప్రతిగా అదే ప్రాంతంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములను పొందారు. ఐఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని కంతేరులో హెరిటేజ్ ఫుడ్స్‌కు 10.4 ఎకరాలు పొందగా 2014 జూన్ నుంచి సెప్టెంబరు మధ్యలో కొనుగోలు చేసినట్టు చూపించారు. లింగమనేని కుటుంబ నుంచి మరో 4.55 ఎకరాలను కొనుగోలు పేరిట హెరిటేజ్ ఫుడ్స్ దక్కించుకుంది. అప్పటికే ఈ కుంభకోణం గురించి బయటకు పొక్కడంతో ఆ సేల్ డీడ్‌ను రద్దు చేసుకున్నారు. ఐఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని లింగమనేని కుటుంబానికి చెందిన 355 ఎకరాలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్ భూములు ఉండటం గమనార్హం.

లోకేశ్ కీలక 'భూ'మిక

క్విడ్‌ప్రోకోకు పాల్పడి హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములను దక్కేలా చేయడంలో లోకేశ్ కీలక భూమిక పోషించారు. ఆయన 2008 జూలై 1 నుంచి 2013 జూన్ 29 వరకు హెరిటేజ్ ఫుడ్స్‌లో డైరెక్టర్‌గా ఉన్నారు. అనంతరం 2017 మార్చి 31 వరకు నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఐఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని కొనుగోలు పేరిట భూములను దక్కించుకోవాలని నిర్ణయించిన హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో లోకేశ్ కూడా పాల్గొన్నారు. క్విడ్ ప్రోకో కింద భూములను పొందే ప్రక్రియలో ఆయన కీలక భూమిక పోషించారు. లోకేశ్ పేరిట హెరిటేజ్ ఫుడ్స్‌లో 23,66,400 షేర్లు ఉన్నాయి. అంటే హెరిటేజ్ ఫుడ్స్‌లో లోకేశ్‌కు 10.20 శాతం వాటా ఉంది.

బాబుకు కరకట్ట నివాసం..

క్విడ్‌ప్రోకోలో భాగంగా లింగమనేని రమేశ్ విజయవాడ వద్ద కృష్ణా కరకట్టపై ఉన్న తన బంగ్లాను చంద్రబాబుకు ఇచ్చారు. దీనిపై కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారాన్ని మసిపూసేందుకు చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ఆ బంగ్లాను అద్దెకు ఇచ్చానని లింగమనేని రమేశ్ బుకాయించారు. కానీ ఆయన అద్దె వసూలు చేసినట్టుగానీ, చంద్రబాబు చెల్లించినట్టుగానీ ఆదాయపన్ను వివరాల్లో లేవు. తరువాత ఆ ఇంటిని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చానని చెప్పారు. మరి చంద్రబాబు ప్రభుత్వం నుంచి హెచ్‌ఆర్‌ఏ ఎందుకు పొందారన్న ప్రశ్నకు సమాధానం లేదు. దీంతో ఆ బంగ్లాను చంద్రబాబుకు వ్యక్తిగతంగా క్విడ్‌ప్రోకో కింద ఇచ్చారని స్పష్టమైంది. లింగమనేని నుంచి కానుకగా స్వీకరించిన కరకట్ట ఇంట్లోనే చంద్రబాబు, లోకేశ్ దర్జాగా నివసించడం గమనార్హం.

పవన్‌కూ వాటా..

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా ఈ అవి నీతి పాపంలో పిడికెడు వాటా ఇచ్చారు. కాజాకు సమీపంలో ఐఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌కు చేరువలో పవన్‌కల్యాణ్‌కు 2.4 ఎకరాలున్నాయి. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్లు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కల్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.

భారీగా పెరిగిన విలువ..

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారుకు ముందు లింగమనేని కుటుంబం ఆ ప్రాంతంలో ఎకరా భూమి రూ.8 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. మార్కెట్ ధర ప్రకారమైతే ఎకరా రూ.50 లక్షలు ఉంది. అంటే ఆ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్లు. ఇక ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు తరువాత ఎకరం రూ.36 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. అంటే రిజిస్టర్ విలువే నాలుగున్నర రెట్లకుపైగా పెరిగింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.2.50 కోట్లు పలికింది. 355 ఎకరాల విలువ మార్కెట్ ధర ప్రకారం అమాంతంగా రూ.887.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే సీడ్ క్యాపి టల్ ప్రాంతంలో ఎకరా విలువ రూ.4 కోట్లకు చేరు తుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్ర బాబే ప్రకటించారు. ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ ఎకరా రూ.6 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. అంటే అమరావతి నిర్మాణం పూర్తయితే ఆ 355 ఎకరాల విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు చేరుతుందని అంచనా. ఆ ప్రకారం మార్కెట్ ధరను బట్టి హెరిటేజ్ ఫుడ్స్ 10.4 ఎకరాల మార్కెట్ విలువ రూ.5.20 కోట్ల నుంచి రూ.41.6 కోట్లకు కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే రూ.62.4 కోట్లకు చేరుతుందని తేలింది. హెరిటేజ్ ఫుడ్స్ ఒప్పందం చేసుకుని రద్దు చేసినట్టు చూపిన మరో 4.55 ఎకరాల విలువ కూడా రూ.27.3 కోట్లకు చేరుతుంది. ఇక చంద్రబాబు బినామీల పేరిట ఉన్న వందలాది ఎకరాల విలువ అమాంతం పెరిగింది.

ప్రపంచ బ్యాంకులో ఏపీ పలుకు'బడి'


- విద్యా రంగానికి సీఎం వైఎస్ జగన్ ఎంతో ప్రాధాన్యమిస్తున్నారు
- వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు వివరించిన రాష్ట్ర విద్యార్థులు
- ఆసక్తిగా విన్న ప్రతినిధులు.. ముఖ్యమంత్రి కృషికి అభినందనలు



ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏపీ విద్యార్థిని

సాక్షి, అమరావతి: పేదరికం, అసమానతలను తగ్గించేందుకు విద్య అత్యంత శక్తివంతమైన సాధనమని, అందుకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యా సంస్కరణలను చేపట్టారని రాష్ట్ర విద్యార్థులు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు వివరించారు. రాష్ట్రం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న 10 మంది విద్యార్థుల బృందం అమెరికాలో ఐక్యరాజ్య సమితి సదస్సుకు వెళ్లిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఐక్యరాజ్యసమితి స్పెషల్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్ కుమార్ నేతృత్వంలో వాషింగ్టన్ వెళ్లిన విద్యార్థుల బృందం అక్కడ ప్రపంచ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సోమవారం బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాల ద్వారా అందిస్తున్న మేలును ఇంగ్లిష్‌లో చక్కగా వివరించారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రతినిధుల అడిగిన పలు ప్రశ్నలకు విద్యార్థులు సోదాహరణంగా సమాధానాలు చెప్పారు. ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు.. విద్యార్థులు చెప్పిన అంశాలను ఆసక్తిగా విని విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పేదరిక నిర్మూలన, విద్యారంగం అభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషిని వారు అభినందించారు.

సుప్రీంలో నేడు బాబు పిటిషన్ విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (క్రిమినల్)ను బుధవారం సుప్రీంకోర్టు విచారించనుంది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాస నం ఈ పిటిషన్‌పై విచారణ జరపనుంది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో తనను అరెస్టు చేసే ముందు గవర్నర్ నుంచి అనుమతి తీసుకోలే దని చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించగా, పిటి షన్ కొట్టివేసిన విషయం విదితమే. అందువల్లే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాగా, జస్టిస్ ఎస్‌వీ ఎన్ భట్టి 2014లో ఏపీ హైకోర్టు శాశ్వత న్యాయ మూర్తిగా నియమితులు కావడం వల్ల ఈ పిటిషన్ విచారణ ధర్మాసనంలో ఉంటారా? వైదొలుగు తారా? అనేది న్యాయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

బీసీల అభ్యున్నతికి సర్కారు కృషి

వీరనారి ఐలమ్మ జయంతి వేడుకల్లో మంత్రి గంగుల



గన్‌ఫౌండ్రీ(హైదరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేస్తోందని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం ఇక్కడి రవీంద్రభారతిలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీరనారి చిట్యాల(చాకలి) ఐలమ్మ 128వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఐలమ్మ ఏ ఒక్క కులానికో పరిమితం కాదని, ఆమె తెలంగాణ ఆస్తి అని పేర్కొన్నారు. గతంలో బీసీలకు 19 గురుకులాలు ఉంటే ఇప్పుడు 327 గురుకులాలు ఉన్నాయని, 1,68,500 మందికి ప్రపంచస్థాయి విద్య అందుతోందని తెలిపారు. రజకుల సంక్షేమం కోసం 250 యూనిట్ల ఉచిత కరెంటు అందజేస్తున్నామని, దీనివల్ల 61 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్‌తోపాటు వివిధ జిల్లాలకు చెందిన రజక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంలో వాటా దక్కితేనే బీసీలకు న్యాయం..

చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో ఎంపీ లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: రాజ్యాధికారంలో బీసీలకు తమవంతు వాటా దక్కినప్పుడే వారికి న్యాయం జరిగినట్లు అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. రాను న్న ఎన్నికల్లో బీసీలే ప్రధాన పాత్ర వహించాలని చెప్పారు. గత తొమ్మిళ్లలో బీసీలను ఆదుకునేలా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, పథకాలను ఆదరించి మద్దతుగా నిలవాలని కోరారు. దేశంలోని కుల, చేతివృత్తుల బలోపేతానికి మోదీ– పీఎం విశ్వకర్మ యోజన వంటి బృహత్తరమైన పథకాన్ని తీసుకొచ్చారని చెప్పారు. 'కాంగ్రెస్, బీఆర్‌ఎస్ బీసీలను వంచించి దగా చేశాయి. బీసీలకు రాజకీయంగా ఇవ్వాల్సిన 33 శాతం వాటాకు కోతపెట్టి.. ఇప్పుడు ఓబీసీ ఎజెండా ఎత్తుకుని ఓట్ల కోసం పాకులాడుతు న్నాయి' అని మండిపడ్డారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి లక్ష్మణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆధి పత్య, పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా, కుల వృత్తులు, వ్యవసాయాధారిత పేద కుటుంబాలకు మద్దతుగా ఐలమ్మ పోరాటం చేశారని కొనియాడారు.

గ్యాదరి కిశోర్ పిటిషన్ మరోసారి కొట్టివేత...

సాక్షి, హైదరాబాద్: తుంగతుర్తి ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ వేసిన పిటిషన్ (ఇంటర్‌లొక్యుటరీ అప్లికేషన్–ఐఏ)ను హైకోర్టు మరోసారి కొట్టేసింది. తన ఎన్నిక చెల్లదంటూ కాంగ్రెస్ అభ్యర్థి అద్దంకి దయాకర్ వేసిన ప్రధాన పిటిషన్‌ను కొట్టేయాలని గ్యాదరి కిశోర్ 'ఐఏ'దాఖలు చేశారు. 2018 శాసనసభ ఎన్నికల్లో దయాకర్‌పై కిశోర్ విజయం సాధించారు. అయితే కిశోర్ ఎన్నికల అఫిడ విట్లో తప్పుడు సమాచారం ఇచ్చారని.. అలాగే పోలైన ఓట్లకు, ఈవీఎం, వీవీప్యాట్‌ల లెక్కల్లో తేడాలున్నాయని దయాకర్ 2019లో హైకోర్టులో ఎన్నికల పిటిషన్ వేశారు. కిశోర్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడాన్ని రద్దు చేసి తనను ఎమ్మెల్యేగా ప్రకటించేలా రిటర్నింగ్ అధికారిని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్ హైకోర్టులో ఇంకా పెండింగ్‌లోనే ఉండగానే కిశోర్ 'ఐఏ'దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎం.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. వాదనల అనంతరం ప్రధాన పిటిషన్ విచారణార్హమైనదేనని స్పష్టం చేశారు. తదు పరి విచారణలోగా ఓట్ల లెక్కింపు, వీవీ ప్యాట్‌ల భద్రతకు సంబంధించి సీసీ ఫుటేజీ వీడియోలను అందజేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను అక్టోబర్ 3కు వాయిదా వేశారు.

కమలంలో కాక!

▶ మొదటి పేజీ తరువాయి

ఇతర అవినీతి, అక్రమాల ఆరోపణలపై తగిన చర్యలపై ప్రధాని మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్‌షా స్పష్టత ఇవ్వకపోవడంపై వీరంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వివిధ కీలక అంశాలు లేవనెత్తినా ఎలాంటి స్పందన లేకపోవడంతో రాజీనామా నిర్ణయానికి వచ్చినట్టుగా తెలుస్తోంది. కేసీఆర్‌ను ఎలాగైనా గద్దెదించాలనే ఉద్దేశంతోనే బీజేపీలో చేరామని, ఆ దిశలో కేంద్ర ప్రభుత్వం, జాతీయ నాయకత్వం చర్యలు కనిపించడం లేదంటూ ఓ మాజీ ఎంపీ 'సాక్షి'కి స్పష్టం చేశారు. అసంతృప్త నేతల అభిప్రాయాలు, తమ భేటీలో చర్చకు వచ్చిన అంశాలు, మొత్తంగా ఈ వ్యవహారంలో తమ దృష్టికోణం ఏమిటీ, అసలు ఏం చేయాలని అనుకుంటున్నామన్న దానిపై ఆయన పలు సంకేతాలిచ్చారు. వెంటనే కవిత అరెస్ట్‌తో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్, కేసీఆర్ సర్కార్ ఇతర అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టి బీఆర్‌ఎస్–బీజేపీ ఒకటి కాదనే భరోసా ప్రజలు, కేడర్‌కు కల్పించాలనే తాము కోరుకుంటున్నట్టు తెలిపారు. అయితే బీజేపీ అగ్రనాయకత్వం నుంచి ఎలాంటి భరోసా లభించకపోవడంతో ఇక పార్టీలో కొనసాగి ప్రయోజనం లేదనే అభిప్రాయానికి వచ్చినట్టు చెబుతున్నారు. కేసీఆర్‌ను ఓడించే సత్తా ఉందని భావిస్తున్న పార్టీలోకి వెళ్లేందుకు కూడా తాము సిద్ధమని తెలిపారు. పైకి కనిపిస్తున్నట్టుగా ఆరేడుగురు నేతలే కాకుండా మరికొంతమంది నాయకులు కూడా వీరితో టచ్‌లో ఉన్నట్టుగా ప్రచారం జరుగుతోంది.

విజయశాంతి తాజా ట్వీట్ కలకలం...

పార్టీ ప్రయోజనాల్లో హత్యలే ఉంటే కార్యకర్తలు ఏం చేయాలంటూ ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ కార్యవర్గస భ్యురాలు విజయశాంతి మంగళవారం ఎక్స్(ట్విట్టర్)లో చేసిన ట్వీట్ పార్టీ వర్గాల్లో కలకలం రేపింది. పరోక్షంగా పార్టీ అనుసరిస్తున్న విధానాలను తప్పుబడుతూ ఆమె ఈ ట్వీట్ చేశారని భావిస్తున్నారు. విజయశాంతి చేసిన ట్వీట్ పూర్తి పాఠం.. 'ఈ మధ్య కొందరు నాయకులు రాజకీయాల్లో ఆత్మహత్యలు తప్ప హత్యలుండవు అంటున్నారు. అది నిజం.. ఎందుకంటే, పార్టీ కార్యకర్తలు కూడా అదే విశ్వాసంతో ఉండాలి. పార్టీలో ఎప్పుడైనా కొన్ని కారణాల వల్ల పార్టీ ప్రయోజనాల్లో హత్యకు గురయ్యే ప్రయత్నాలు అగుపడ్డా, కార్యకర్తలు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ఆత్మహత్యలకు పాల్పడకుండా ఉండాలి. అయితే, రాజకీయంగా పార్టీ ప్రయోజనాల్లో హత్యలే ఉంటున్నప్పుడు, అవి కార్యకర్తలకు ఆత్మహత్యా సదృశ్యంగా గోచరిస్తున్నపుడు, కార్యకర్తలకు ఏమి దిశానిర్దేశం చేయాలో కూడా ఆ పై నేతలే చెప్పాలి మరి'అని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే సునీతకు రూ.10 వేల జరిమానా

సాక్షి, హైదరాబాద్: ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతకు హైకోర్టు రూ. 10 వేల జరిమానా విధించింది. ఆమెపై గతంలో దాఖలైన పిటిషన్‌లో ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయనందుకు ఈ చర్య చేపట్టింది. అక్టోబర్ 3లోగా కౌంటర్ వేయకుంటే తాము నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి గొంగిడి సునీత, కాంగ్రెస్ నుంచి భిక్షమయ్యగౌడ్ పోటీ చేశారు. దాదాపు 30 వేలకుపైగా ఓట్ల మెజారిటీతో సునీత విజయం సాధించారు. అయితే ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తులను చూపకుండా తప్పుడు సమాచారాన్ని ఇచ్చారంటూ సతీశ్‌రెడ్డి 2019లో హైకోర్టులో ఎన్నికల పిటిషన్ వేశారు. ఇది విచారణలో ఉండగానే సతీశ్‌రెడ్డి మృతిచెందారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం పిటిషనర్ చనిపోయి ఇతరులెవరూ ఇంప్లీడ్ కాకపోతే విచారణ ముగించాల్సి ఉంటుంది. దీంతో ఆలేరుకు చెందిన కాంగ్రెస్ నేత బోరెడ్డి అయోధ్యరెడ్డి ఈ పిటిషన్‌లో ఇంప్లీడ్ అయ్యారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్ మంగళవారం మళ్లీ విచారించారు. వాదనలు విన్న ధర్మాసనం ఇంతకాలమైనా కౌంటర్ వేయకపోవడంపై అసహనం మండిపడింది. కాగా, బీఆర్‌ఎస్‌కు పెరుగుతున్న ఆదరణను తట్టుకోలేక కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని సునీత 'సాక్షి'తో మాట్లాడుతూ ఆరోపించారు.

చంద్రబాబు బెయిల్, పోలీసు కస్టడీ పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న మాజీ సీఎం నారా చంద్రబాబును 5 రోజులు తమ కస్టడీకి అప్పగించాలంటూ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో సీఐడీ దాఖలు చేసిన పిటిషన్, ఇదే కుంభకోణంలో బెయిల్ కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ బుధవారానికి వాయిదా పడింది. వాస్తవానికి ఈ రెండు పిటిషన్లపై ఏసీబీ కోర్టు మంగళవారం విచారణ జరపాల్సి ఉంది. అయితే ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సెలవు పెట్టడంతో ఇవి ఇన్‌చార్జి కోర్టు అయిన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి (ఎంఎస్‌జే) కోర్టు ముందుకు వచ్చాయి. సీఐడీ కస్టడీ పిటిషన్ విచారణకు రాగానే విచారణను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంఎస్‌జే ఎ.సత్యానంద్ తెలిపారు. చంద్రబాబు బెయిల్ పిటిషన్ విచారణకు రాగా దాన్ని కూడా బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. ఇది ఓ వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన వ్యవహారమని, బెయిల్‌పై విచారణ చేపట్టాలని చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాదులు ప్రమోద్ కుమార్ దూబే, దమ్మాలపాటి శ్రీనివాస్ కోరారు. కోర్టు ఆదేశాల మేరకు కస్టడీ పిటిషన్‌లో కౌంటర్ కూడా దాఖలు చేశామని చెప్పారు. దీనికి న్యాయమూర్తి సత్యానంద్ స్పందిస్తూ.. బెయిల్ పిటిషన్‌పై ఈ రోజే వాదనలు విని ఈ రోజే తీర్పునిచ్చే పరిస్థితి లేదన్నారు. బుధవారం ఏసీబీ కోర్టు జడ్జి విధులకు హాజరవుతున్నారని, ఆ కోర్టులోనే వాదనలు విని పించుకోవాలని స్పష్టం చేశారు. తాను బుధవారం సెలవుపై వెళుతున్నానని, అందువల్ల బెయిల్ పిటిషన్‌పై ఇప్పటికిప్పుడు తీర్పు వెలువరించలేనని తెల్చి చెప్పారు.ఇదిలా ఉంటే, ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబు తనయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను 14వ నిందితుడిగా చేరుస్తూ కోర్టులో సీఐడీ ఓ మెమో దాఖలు చేసింది.

ఎమ్మెల్సీ కవితకు ఊరట

▶ మొదటి పేజీ తరువాయి

విచారిస్తామని, అప్పటి వరకు కవితను విచారణకు పిలవరాదని జస్టిస్‌కౌల్ పేర్కొన్నారు. ''ఒక మహిళను సాక్షిగా లేదా ఏదైనా హోదాలో ప్రశ్నించడానికి పిలవొద్దు అని చెప్పలేరు. కానీ మహిళలకు కొన్ని రక్షణలు ఉండాలి. చట్టాన్ని దుర్వినియోగం చేసిన కేసులూ ఉంటాయి.. వేర్వేరు కేసులూ ఉంటాయి. అన్నింటిని ఒకేలా చూడలేం'' అని జస్టిస్ కౌల్ వ్యాఖ్యానించారు. నవంబరు 20న తదుపరి విచారణ చేపడతామని అప్పటి వరకూ కవితకు సమన్లు జారీ చేయొద్దని ధర్మాసనం స్పష్టం చేసింది. ధర్మాసనం ఆదేశాలు పాటిస్తామని ఈడీ తరపు న్యాయవాది పేర్కొన్నారు.

మరిన్ని ఏపీ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

'చౌద్‌వీ కా చాంద్ హో
యా ఆఫ్‌తాబ్ హో'...
ఈ చందమామ తెలుగు నేల మీదే
ఉదయించింది.
'ఏరువాక సాగారోరన్నో చిన్నన్న'...
తప్పెట దరువుకు ఆ పాదాలు
ఈ నేల మీదే చిందేశాయి.
'మారాయ్.. మారాయ్... మారాయ్..
రోజులు మారాయ్'...
తెలుగువారి పుణ్యాన ఒక మహత్తు జరిగి
వహిదా రెహమాన్ రోజులే
మారిపోయాయి.
భారతీయ వెండితెర సౌందర్యమే
మారిపోయింది.
తనకు ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే
ప్రకటించారని తెలిశాక
ఆ మురిపమైన నటి
అనుకునే మాట ఒకటే-
ఆజ్ ఫిర్ జీనే కి తమన్నా హై
ఆజ్ ఫిర్ మర్‌నే కా ఇరాదా హై..



ఫాల్కే గ్రహీత - వహిదా రెహమాన్

చౌద్‌వీ కా చాంద్ హో

● ఖదీర్

విశాఖపట్నంలో ఈపాటికి సంబరాలు జరగాలి.
తమ ఊరి నటికి దాదాసాహెబ్ ఫాల్కే వచ్చినందుకు.
ఆ సంగతి వారికి తెలుసో లేదో.
తెలుగు వారికి వహిదా రెహమాన్ తమ నటి అని తెలుసో లేదో.

●●●

వహిదా రెహమాన్‌కు పదీ పదకొండేళ్లు ఉన్నప్పుడు ఆమె తండ్రి రెహమాన్‌కు మునిసిపల్ కమిషనర్‌గా విశాఖ ట్రాన్స్‌ఫర్ అయ్యింది. మెడ్రాస్ ప్రెసిడెన్సీ ఉద్యోగి అయిన రెహమాన్ తమిళనాడు, ఆంధ్రాల్లో పని చేసిన దక్కన్ ముస్లిం. ఆమె తల్లిది ఉత్తరాంధ్ర కావచ్చు. ఆమె మేనమామ డాక్టర్ ఫిరోజ్ అలీ గంజాంలో పేరు మోసిన డాక్టరు, సామాజిక కార్యకర్త. సినిమా నటిగా అవకాశం పొందే వరకు అంటే తన 17వ ఏట వరకూ వహిదా రెహమాన్ తొలిప్రాయపు రోజులు విశాఖలోనే గడిచాయి. అక్కడి సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో చదువుకుంది. అది కాదు– ఆమె జీవితాన్ని మార్చిన ఘటన అక్కడే జరిగింది. అదీ– నాటి మద్రాసు ముఖ్యమంత్రి సి.రాజగోపాలాచారి విశాఖ రావడం. ఆ సందర్భంగా వహిదా రెహమాన్ నాట్య ప్రదర్శన ఇవ్వడం.

●●●

ముఖ్యమంత్రి వచ్చినప్పుడు ఏవో ఒక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. నాటి వాల్తేరు కలెక్టర్ తన సహోద్యోగైన రెహమాన్‌ను 'నీ కుమార్తెలు భరతనాట్యం చేస్తారు కదా. వారి ప్రదర్శన ఏర్పాటు చేద్దాం' అని కోరాడు. అందుకు రెహమాన్ అంగీకరించాడు. అప్పటికే వహిదా, ఆమె సోదరి సయిదా భరతనాట్యం నేర్చుకున్నారు. మొత్తం నలుగురు కూతుళ్లలో అందరి కంటే చిన్నది వహిదా. భరతనాట్యం నేర్చుకోవాలని పట్టుపట్టి నేర్చుకుంది. అయితే గురువు ఆమెకు అంత సులువుగా నేర్పలేదు. 'ముసల్మానులు ఈ విద్య నేర్చుకోగలరా? పౌరాణిక సందర్భాలను అభినయించగలరా?' అని సందేహం వ్యక్తం చేశాడు. అయినా వహిదా పట్టు విడువలేదు. మరోవైపు ముస్లింలు భరతనాట్యం నేర్చుకోవడం ఏమిటని అయినవారి ఎత్తిపొడుపులు. 'కళకు మతం లేదు' అని తేల్చిన రెహమాన్ కుమార్తెలను భరతనాట్యానికి ప్రోత్సహించాడు. కాని గురువు వినడే. చివరకు వహిదా మొండిపట్టు చూసి 'నీ జాతకం పట్టుకురా' అన్నాడు. ముస్లింలలో జాతకాలు ఉండవని తెలిశాక, పుట్టిన రోజు... సమయం తెలుసుకుని ఆ గురువే జాతకం రాసి ఆశ్చర్యపోయాడు. 'ఈ అమ్మాయి నా చివరి గొప్ప శిష్యురాలు అవుతుంది' అని ఆ జాతకంతో తేల్చి పాఠాలు నేర్పించాడు. అనుకున్నట్టుగానే జరిగింది. సి.రాజగోపాలాచారి సమక్షంలో వేదిక మీద వహిదా, సయిదాలు అద్భుతమైన నాట్య ప్రదర్శన చేసేసరికి శాస్త్రాలు ఎరిగిన అంతటి రాజగోపాలాచారి కూడా తబ్బిబ్బయ్యి మెచ్చుకున్నాడు. ఆ వార్త మరుసటి రోజు అన్ని ముఖ్యమైన పేపర్లలో మొదటి పేజీల్లో వచ్చింది. వహిదా రెహమాన్ అనే పేరు కళా జగత్తుకు తెలిసింది. సినిమా జగత్తుకు కూడా.

●●●

వహిదా రెహమాన్‌కు 13 ఏళ్లు ఉన్నప్పుడు ఆమె తండ్రి జబ్బు చేసి మరణించాడు. అతని సమాధి విశాఖలోనే ఉంది. ఇటీవలే వహిదా ఆ సమాధిని దర్శించింది కూడా. తండ్రి జీవించి ఉండగా సినిమా అవకాశాలు వస్తే 'చిన్నపిల్ల... సినిమాలేమిటి' అని సున్నితంగా తిరస్కరించాడు కాని వహిదాకు 16 ఏళ్లు వచ్చేసరికి, అప్పటికే ఆమె నాట్యకళాకారిణిగా కొనసాగుతూ ఉండటంతో సినిమా అవకాశాలు వస్తూనే ఉండేవి. భర్త అండ లేని తల్లి భయంతో వాటిని తిరగ్గొట్టేది. అయితే వహిదాను సినిమా తెరకు పరిచయం చేసే అవకాశం తెలుగువారి ఖాతాలో ఉంటే ఆ విధిని ఎవరు కాదనగలరు? బాంబేలో ఎల్వీ ప్రసాద్‌తో పాటు సినిమా కళను ఆకళింపు చేసుకున్న నిర్మాత సి.వి.ఆర్. ప్రసాద్ మద్రాసు వచ్చి 'రోజులు మారాయి' సినిమా తీయదల్చుకున్నాడు. స్క్రిప్ట్ వర్క్ కూడా చేశాడు. అయితే సినిమా అంతా పూర్తయ్యే సమయానికి ఇందులో ఒక సంబరాల పాట ఉండాలి... పల్లెతనపు చిందు ఉండాలి అని పించిందతనికి. దానికి మంచి డాన్సర్ కావాలంటే వహిదా రెహమాన్ పేరు తెలిసింది. అదృష్టవశాత్తు అంతకు ముందే రెహమాన్‌తో ప్రసాద్‌కు పూర్వ పరిచయం ఉంది. 'మీవారు నాకు తెలుసు. నేను ఆయన శ్రేయోభిలాషిని. మీ అమ్మాయికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. స్టేజ్ మీద చేసే డాన్సు కెమెరా ముందు చేయడమే' అని వహిదా తల్లిని ఒప్పించాడు. 'రోజులు మారాయి'లో 'ఐటమ్ సాంగ్'. కొసరాజు రాశాడు. మాస్టర్ వేణు బాణీ కట్టాడు. జిక్కి పాడింది. విశాఖ నుంచి మద్రాసు వెళ్లిన వహిదా రెహమాన్ అద్భుతంగా డాన్స్ చేసింది. దేహంతో పాటు హావభావాలను కూడా కదిలించింది. మెరుపు వలే మెరిసింది. 'ఏరువాక సాగారో రన్నో చిన్నన్న'... సూపర్‌డూపర్ హిట్. ప్రేక్షకులు చిల్లర ఎగరేసిన పాట అది. సినిమా అయిపోయాక ఆపరేటర్ చొక్కా పట్టుకుని మళ్లీ ఆ పాట వేయించుకువారు. గువ్వలాంటి ఆ అమ్మాయి ఎవరు? వహిదా రెహమాన్! ఇంటింటి పేరయ్యింది.

●●●

నటి సావిత్రి అదృష్టం బాగుంది. వహిదా రెహమాన్ తెలుగు నుంచి పోటీలో తప్పుకుని హిందీలో వెళ్లింది. లేకుంటే ఒకవైపు సావిత్రి, మరోవైపు వహిదా రెహమాన్ తెలుగు సినిమాలను ఒక ఊపు ఊపుతుంటే ఎవరు గొప్ప అంటే ఎవరు గొప్ప అని మనం తన్నుకు చచ్చుండే వాళ్లం. 1955 జనవరిలో 'మిస్సమ్మ' విడుదలైంది. అదే సంవత్సరం ఏప్రిల్‌లో 'రోజులు మారాయి'. 'మిస్సమ్మ' సూపర్ హిట్. 'రోజులు మారాయి' కూడా. 'మిస్సమ్మ' హైదరాబాద్‌లో నెలల తరబడి ఆడుతూనే ఉంటే ఒక డిస్ట్రిబ్యూటరు దాని హిందీ రీమేక్ కోసం దర్శకుడు గురుదత్‌ని బొంబాయి నుంచి హైదరాబాద్‌కు పిలిపించాడు– సినిమా చూడటానికి. మిస్సమ్మ గురుదత్‌కు నచ్చలేదు. కాని వహిదా రెహమాన్‌ను అదే సమయంలో రోజులు మారాయి ప్రమోషన్ కోసం మద్రాసు నుంచి పిలిపిస్తే ఆమె కారు చుట్టూ మూగిన జనాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. 'ఎవరు ఈ అమ్మాయి' అని అడిగితే 'వహిదా రెహమాన్' అని చెప్పారు. గురుదత్ ఆమెను అదే డిస్ట్రిబ్యూటర్ ఆఫీస్‌లో కలిశాడు. 'ఉర్దూ తెలుసా' అని మాత్రమే అడిగాడు. 'తెలుసు' అంది వహిదా. మూడు నెలల తర్వాత బొంబాయి నుంచి పిలుపొచ్చింది. వెళితే రెండేళ్ల పాటు కాంట్రాక్ట్ గురుదత్ బేనర్‌లో. నెలకు జీతం– 2,500 రూపాయలు. మొదటి సినిమా 'సి.ఐ.డి'. 'హీరో ఎవరండీ' అడిగింది వహిదా రెహమాన్. గురుదత్ జవాబు– దేవ్ ఆనంద్.

●●●

'కహీ పే నిగాహె కహీపే నిషానా'...
'సి.ఐ.డి' సినిమాలో కొంచెం వేంప్ తరహా వేషం. చిన్న వేషం. కాని ఒక్కపాటతో మొత్తం పేరు కొట్టుకెళ్లింది వహిదా. సి.ఐ.డిలో అసలు హీరోయిన్ షకీలా. ఆమె తుడుచుకునిపోయి వహిదా నిలబడింది. కొద్దిగా మెల్ల కన్ను, లాగేసే చూపు, ఈడ్చేసే నవ్వు... ఈ అమ్మాయిని తీర్చిదిద్ద వచ్చు అనుకున్నాడు గురుదత్. వెంటనే 'ప్యాసా'లో లీడ్ రోల్ ఇచ్చాడు. గురుదత్ ఆమె లోని నటిని చాలా సమర్థంగా తీర్చిదిద్దాడు. తన లాగే అధిక ప్రసంగం చేయకుండా గాఢమైన భావాలను ఎలా పలికించవచ్చో నేర్పించాడు. ప్యాసా ఘనవిజయం సాధించింది. ఆ తర్వాత గురుతద్, వహిదా కలిసి 'కాగజ్ కే ఫూల్', 'చౌద్‌వీ కా చాంద్', 'సాహిబ్ బీబీ ఔర్ గులామ్' సినిమాలలో నటించారు. గురుదత్ ఆగిపోయాడు. వహిదా సాగిపోయింది.

●●●

సునిల్‌దత్‌తో చేసిన 'ముఝే జీనే దో', బిశ్వజిత్‌తో 'బీస్ సాల్ బాద్' పెద్ద హిట్స్. దిలీప్ కుమార్‌తో 'దిల్ దియా దర్ద్ లియా', 'ఆద్మీ', 'రామ్ ఔర్ శ్యామ్' చేసింది వహిదా. కాని దేవ్ ఆనంద్ మరోసారి ఆమెకు సవాలు విసిరే పాత్రను ఇచ్చాడు 'గైడ్'లో. ఆర్.కె.నారాయణ్ రాసిన ఈ ప్రఖ్యాత నవలను హాలీవుడ్ వెర్షన్‌గా, బాలీవుడ్ వెర్షన్‌గా తీయాలనుకున్నప్పుడు హిందీ వెర్షన్‌కు చేతన్ ఆనంద్ దర్శకుడు. కాని చేతన్‌కు వహిదా ఇష్టం లేదు. దేవ్ ఆనంద్‌కు వహిదాను తీయడం ఇష్టం లేదు. చేతన్‌ను తీసి విజయ్ ఆనంద్‌ను దర్శకుడిగా పెట్టాడు. విజయ్ ఆనంద్ 'గైడ్'లో క్లాసిక్‌గా తీర్చిదిద్దాడు. నిజానికి ఆనాటి హీరోయిన్లు ఎంపిక చేసుకునే విలువలున్న పాత్ర లాంటిది కాదు 'రోజీ'. భర్తను వదిలేసి ప్రియుడితో వెళ్లిపోయే పాత్ర అది. శ్రేయోభిలాషులు చేయొద్దన్నారు. వహిదా రెహమాన్ చేసింది. ఆమె లోని నాట్యాన్ని, నటనను, అభినయ గాఢతను అంత గొప్పగా పట్టి ఇచ్చిన సినిమా మరొకటి లేదు.

●●●

'పత్థర్ కె సనమ్', 'నీల్ కమల్' వంటి హిట్స్ చూసిన వహిదా ఆ తర్వాత చేసిన సినిమాలు అంతగా ఆడలేదు. రాజ్ కపూర్‌తో 'తీస్రి కసమ్', సునిల్‌దత్‌తో 'రేష్మా ఔర్ షేరా', రాజేష్ ఖన్నాతో 'ఖామోషీ', అమితాబ్ బచ్చన్‌తో 'కభి కభి'... ఆమెను మెల్లగా హీరోయిన్ దశ నుంచి తప్పించాయి. వీటి నడుమ అక్కినేనితో 'బంగారు కలలు'లో తెలుగువారిని పలుకరించింది.

●●●

వహిదా రెహమాన్ హిందీ సినిమా రంగంలో సాధించిన స్థానం, ఏర్పరుచుకున్న గౌరవం, పొందిన సత్కారాలు, గెలుచుకున్న అభిమానులు తక్కువ కాదు. హుందాగా ఉంటూ, అదే సౌందర్యంతో ఆమె ఆ తర్వాతి రోజుల్లో కూడా అడపాదడపా నటిస్తూనే వచ్చింది. ఆమె నవ్వుకు ఫిదా అయ్యే ప్రేక్షకులను కనికరిస్తూనే ఉంది.
గొప్ప ప్రయాణం ఆమెది.
ఎన్నో జ్ఞాపకాలు. కొన్ని గాయాలు.
నాటి రోజులు మళ్లీ రావు. ఈ ఉత్సవ సమయంలో ముసురుకునేది సువర్ణ తలపోతలే.

వక్త్ నే కియా క్యా హసీ సితమ్
తుమ్ రహేన తుమ్ హమ్ రహేన హమ్





బంగారు కలలు



గైడ్



రోజులు మారాయి

జీవితాలను కాల్చిన ప్రేమ

వహిదా రెహమాన్, గురుదత్‌ల మధ్య బంధం, అనుబంధం, సంబంధం గురుదత్ జీవితంలో సంక్షోభం తెచ్చింది. వహిదాను హిందీ పరిశ్రమకు పరిచయం చేసిన గురుదత్ ఆమె పట్ల చాలా పొసెసివ్‌గా ఉండేవాడు. వహిదా కూడా గురుదత్ రెక్కల చాటునే ఉండటానికి ఇష్టపడేది. అయితే ఇదంతా గురుదత్ భార్య, ప్రఖ్యాత గాయని గీతా దత్‌ను చాలా గట్టి దెబ్బ తీసింది. గురుదత్, గీతాదత్‌ల మధ్య వహిదా ప్రమేయం వల్ల చాలా ఎడం వచ్చింది. గురుదత్, గీతాదత్‌లు ఇద్దరూ తాగుడుకు బానిసయ్యారు. అప్పటికే డిప్రెషన్‌తో బాధపడుతున్న గురుదత్ ఆత్మహత్య చేసుకు మరణించాడన్నది ఒక కథనం. నిద్రమాత్రలు ఎక్కువై మరణించాడని మరో కథనం. ఏమైనా అతని జీవితం అర్థంతరంగా ముగిసింది. ఆ తర్వాత గీతాదత్ కూడా నానా బాధలు పడుతూ తాగుడుకు బానిసై మరణించింది. వహిదా ఒక నాటి నటుడు కమల్‌జిత్‌ను వివాహం చేసుకుంది. ఆమెకు ఒక కొడుకు, కూతురు. బెంగళూరులో చాలా కాలం ఉన్నాక భర్త మరణం తర్వాత ముంబై వచ్చి నివసిస్తోంది.



గురుదత్, గీతాదత్‌లతో...

వహిదా రెహమాన్ హిట్స్

1. భవరా బడా నాదాన్ హై – సాహిబ్ బీబీ ఔర్ గులామ్
2. జానే క్యా తూనే కహీ – ప్యాసా
3. కహీ దీప్ జలే కహీ దిల్ – బీస్ సాల్ బాద్
4. సాంఝ్ ఢలీ దిల్ కి లగీ – కాలా బజార్
5. ఏ నయన్ డరే డరే – కొహ్రా
6. గాతా రహే మేరా దిల్ – గైడ్
7. మెహబూబ్ మేరె మెహబూబ్ మేరె – పత్థర్ కె సనమ్
8. తుమ్ పుకార్ లో తుమ్హారా ఇంతెజార్ హై – ఖామోషీ
9. రంగీలారే తేరె రంగ్ మే – ప్రేమ్ పూజారి
10. జాదుగర్ తెరె నైనా – మన్ మందిర్

వహిదా రెహమాన్‌కు దాదాసాహెబ్ ఫాల్కే

సినిమా రంగంలో విశేష సేవలకుగాను భారత ప్రభుత్వం ప్రకటించే సర్వోన్నత పురస్కారం 'దాదాసాహెబ్ ఫాల్కే' 2021 సంవత్సరానికి సుప్రసిద్ధ నటి వహిదా రెహమాన్ (85)ను వరించింది. కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అనురాగ్ ఠాకుర్ మంగళవారం ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ వార్త విన్న వెంటనే వహిదా రెహమాన్ 'దేవ్ ఆనంద్ శతజయంతి నాడు ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. నిజానికి ఈ అవార్డు ఆయనకు అందాలి. నాకు అందింది' అని సంతోషం వ్యక్తం చేశారు. అవార్డుకు ఎంపిక చేసిన కమిటీలో ఆశాపరేఖ్, చిరంజీవి, పరేష్ రావెల్, ప్రసేన్‌జిత్ చటర్జీ, శేఖర్ కపూర్ ఉన్నారు. వహిదా రెహమాన్‌ను ఇది వరకే పద్మశ్రీ, పద్మభూషణ్ వరించాయి. ఇప్పుడు దాదాసాహెబ్ ఫాల్కేతో తనకు రెట్టింపు సంబరం కలుగుతున్నదని ఆమె అన్నారు. కాగా వహిదాకు ఫాల్కే పురస్కారం లభించడం పట్ల ప్రధాని మోడి హర్షం వెలిబుచ్చారు. సినిమా రంగంపై ఆమె ముద్ర చెరగనిది అని కొనియాడారు. హైదరాబాద్, విశాఖ, చెన్నైలతో అనుబంధం కలిగిన వహిదా రెహమాన్ తెలుగు సినిమా 'రోజులు మారాయి'తో సినిమా రంగంలో ప్రవేశించారు. ఆ తర్వాత హిందీ సినిమాల్లో అగ్రతారగా వెలుగొందారు. భారతీయ సినిమాల్లో అత్యుత్తమ నటీమణుల్లో ఒకరిగా ఆమెను పరిగణిస్తారు. వహిదా రెహమాన్ అక్కినేని సరసన 'బంగారు కలలు' సినిమాలో నటించారు. 'పుట్టిన రోజు జేజేలు చిట్టి పాపాయి' హిట్ సాంగ్ ఆమెపై చిత్రీకరించినదే.



పేరు మార్చుకోని నటి

ఆ రోజుల్లో హిందీ సినిమాల్లో నటీనటులు కొత్త తరహా పేర్లు పెట్టుకునేవారు. యూసఫ్‌ఖాన్ దిలీప్ కుమార్ అయ్యాడు. మెహజబీన్ మీనా కుమారి అయ్యింది. అలాగే వహిదా రెహమాన్‌ని కూడా పేరు మార్చుకోమని గురుదత్ సూచించాడు. గురుదత్ అసిస్టెంట్లు కూడా పేరు మార్పుకోసం పట్టుబట్టారు. వహిదా రెహమాన్ పేరులో గ్లామర్ లేదని, మధుబాల లాగా ఏదో ఒక బాల వచ్చేలాగా పెట్టుకోమని కోరారు. అయితే 'మా అమ్మా నాన్నలు పెట్టిన పేరు నేను మార్చుకోను. దానితోనే కొనసాగుతాను. మీకిష్టమైతే తీసుకోండి, లేకుంటే మానుకోండి' అని వహిదా రెహమాన్ హఠం చేసింది. చివరకు అందరూ దిగిరాక తప్పలేదు. వహిదా రెహమాన్ తన పేరుతోనే ఖ్యాతి గడించింది.

యూత్ పల్స్

ప్రవాహ రాగాలలో పరవశించే గీతాలై...

స్ట్రీమింగ్ సర్వీస్‌ల ద్వారా మ్యూజిక్ వినడానికి ఇష్టపడుతున్న యువతరం అవే సర్వీసుల ద్వారా సంగీతంపై అవగాహన ఏర్పర్చుకుంటోంది. ఆ అవగాహనతో యువ సంగీత ప్రేమికులు, శ్రోతలు స్పాటిఫై, యాపిల్ మ్యూజిక్, ఆడియో మ్యాక్... మొదలైన స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా మ్యూజిషియన్‌లుగా మారుతున్నారు...



శ్రోతలు సంగీతం వినే విధానంలో గత కొన్ని సంవత్సరాలుగా మార్పు వచ్చింది. ఇంటర్నెట్ యూజర్‌లను దృష్టిలో పెట్టుకొని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది ఫోనోగ్రాఫిక్ ఇండస్ట్రీ(ఐఎఫ్‌పీఐ) చేసిన సర్వేలో 78 శాతం మంది స్ట్రీమింగ్ సర్వీసుల ద్వారా మ్యూజిక్‌ను వింటున్నట్లు తెలిసింది. అందులో యువతరం ఎక్కువ.

అయితే యువతరంలో కొంతమంది సంగీతాన్ని విని ఎంజాయ్ చేయడానికి మాత్రమే పరిమితం కావడం లేదు. తమను ప్రపంచానికి పరిచయం చేసుకునే వేదికలుగా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకుంటు న్నారు.

'మన్ మేరీ జాన్' పాటతో అపర్ణ కుమార్ చందెల్ అలియాస్ కింగ్ 'టాప్ 50 చార్ట్స్'లో మొదటి స్థానంలో నిలిచి వైరల్ సెన్సేషన్ అయ్యాడు. నాన్-ఫిల్మ్ ఇండియన్ మ్యూజిక్ ఆ స్థాయిలో ప్రాచుర్యం పొందడం అరుదు. అపర్ణ కుమార్ ఇప్పుడు ఆడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ స్పాటిఫై మోస్ట్ పాపులర్ ఆర్టిస్ట్‌లలో ఒకరు.

కొన్ని సంవత్సరాల క్రితం శ్రోతగా స్పాటిఫైకి దగ్గరయ్యాడు అపర్ణ కుమార్.

కొత్త ఆర్టిస్ట్‌ల గురించి తెలుసుకోవడంలో, వారి నుంచి స్ఫూర్తి పొందడంలో అపర్ణ కుమార్‌కు ఉపయోగపడిన ప్లాట్‌ఫామ్‌లలో స్పాటిఫై ఒకటి. మూడు సంవత్సరాల క్రితం ఈ ర్యాపర్ తన తొలి ఆల్బమ్ 'కార్నివాల్'తో క్రియేటర్‌గా మారాడు. అతడి 'తు ఆకే దేఖ్లే' పాట వైరల్‌గా మారింది.

'స్పాటిఫై ద్వారా శ్రోతలు ఎలాంటి పాటలు వినడానికి ఇష్టపడుతున్నారో సులభంగా అవగాహన చేసుకోవచ్చు' అంటున్నాడు అపర్ణ కుమార్.

కుమార్‌కు మాత్రమే కాదు ఎంతోమంది యంగ్ ఇండిపెండెంట్ ఆర్టిస్ట్‌లకు స్పాటిఫైలాంటి ప్లాట్‌ఫామ్‌ల క్రియేటర్-సెంట్రిక్ అప్రోచ్ వరంలా మారింది. పెద్ద ప్రాజెక్ట్‌లు వచ్చేలా చేయడంలో, మ్యూజిక్‌ను కెరీర్ ఆప్షన్‌గా మలుచుకోవడంలో, ప్రపంచానికి వారి ప్రతిభను పరిచయం చేయడంలో స్పాటిఫైలాంటి ప్లాట్‌ఫామ్‌లు యూత్‌కు ఉపయోగపడుతున్నాయి.

'ఒకప్పుడు యంగ్ ఆర్టిస్ట్‌లు తమ గురించి తాము తెలుసుకోలేకపోయేవారు. తమ సంగీతాన్ని వినడానికి ఎవరు ఇష్టపడుతున్నారు? ఎలాంటి సంగీతం చేయాలి? అనే విషయంలో స్పష్టత ఉండేది కాదు. ఈ పరిస్థితిలో మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు మార్పు తీసుకువచ్చాయి. స్పాటిఫై ఫర్ ఆర్టిస్ట్ యాప్ ద్వారా తమకు ఎలాంటి మ్యూజిక్ ఉపయోగపడుతుంది, ఏది ఉపయోగపడదు... అనేది అర్థం చేసుకోవడానికి వీలవుతుంది' అంటుంది చెన్నైకి చెందిన సంగీత ప్రేమికురాలు నిధి.

'మ్యూజిక్ ఇండస్ట్రీలో చాలా మార్పులు వచ్చాయి. బడ్డింగ్ మ్యూజిషియన్‌లు తమ టాలెంట్‌ను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఇప్పుడు ఎన్నో సోషల్ మీడియా అప్లికేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. గతంలో ఒకరు పాపులర్ కావడానికి సినిమా మాధ్యమమే ఏకైకమార్గం అన్నట్లుగా ఉండేది. ఇప్పుడు ఇండిపెండెంట్ మ్యూజిక్ హవా నడుస్తోంది. ఔత్సాహికులు తమ మ్యూజిక్ టాలెంట్‌ను పరిచయం చేసుకోవడానికి యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లాంటి ఎన్నో వేదికలు ఉన్నాయి' అంటున్నాడు ప్రముఖ మ్యూజిక్ కంపోజర్ సలీమ్ మర్చెంట్.

మ్యూజిక్ కంపోజర్‌గా మంచి పేరు తెచ్చుకుంది కోల్‌కత్తాకు చెందిన అలోక దాస్‌గుప్తా. చిన్న వయసు నుంచే మ్యూజిక్ కంపోజ్ చేసేది. అయితే తాను కంపోజ్ చేసింది ఎవరికైనా వినిపించాలంటే భయంగా ఉండేది. కెనడా యార్క్ యూనివర్శిటీలో మ్యూజిక్ పెర్ఫార్మెన్స్ అండ్ కంపోజిషన్‌లో డిగ్రీ చేసినా తనమీద తనకు నమ్మకం కలగడానికి ఆలోక దాస్‌గుప్తాకు కొంత సమయం పట్టింది.

'స్పాటిఫై లాంటి ప్లాట్‌ఫామ్స్ యువ ఆర్టిస్ట్‌లకు గట్టి ధైర్యాన్ని ఇస్తున్నాయి' అంటుంది అలోకదాస్ గుప్తా.

ముంబైకి చెందిన సామ్య శ్రీరాగకు లీడింగ్ మ్యూజిక్ ప్లాట్‌ఫామ్స్‌పై మంచి అవగాహన ఉంది. భవిష్యత్‌లో మ్యూజిషియన్‌గా రాణించాలనేది ఆమె కల.

'నా ప్రయత్నంలో విజయం సాధిస్తానా? లేదా? అనేది తెలియదుకాని గట్టి ప్రయత్నమైతే చేయాలనుకుంటున్నాను' అంటున్న శ్రీరాగకు ప్లేబ్యాక్ సింగర్ నికిత గాంధీ ఇచ్చిన సలహా 'ఏదో ఒకటి రాస్తూనో, కంపోజ్ చేస్తూనో ఉండాలి. అవి బాగున్నాయా? లేదా– అనేది రెండో విషయం. ముందు మన సంతోషం కోసం చేస్తే చాలు'.

సంగీతాన్ని వినే అవకాశమే కాదు విశ్లేషించే అవకాశం కూడా ఇస్తున్నాయి కొన్ని ప్లాట్‌ఫామ్స్.

మ్యూజిక్ స్ట్రీమింగ్ అండ్ డిస్కవరీ ప్లాట్‌ఫామ్ 'ఆడియోమ్యాక్' సబ్‌స్క్రైబర్‌లకు తమ ఫేవరెట్ ఆర్టిస్ట్‌ల ఆల్బమ్‌లను విశ్లేషించే అవకాశం ఇచ్చింది.

శ్రోతలకు నచ్చేలా, మెచ్చేలా మ్యూజిక్ ఇండస్ట్రీ వ్యూహాల మాట ఎలా ఉన్నా... ప్రతి అవకాశాన్ని, ప్రతి ఫీచర్‌ని తమలోని సంగీత ప్రతిభను మెరుగు పెట్టుకోవడానికి యువతరం ఉపయోగించుకుంటుంది.

వివిధ మాధ్యమాల ద్వారా ట్రెండ్స్‌ను ఫాలో కావడమే కాదు క్రియేట్ చేస్తుంది యువతరం.

ఇండిపెండెంట్ మ్యూజిక్

యంగర్ జనరేషన్ ఏం వింటుంది, దేనికి కనెక్ట్ అవుతుంది అనే దానిపై మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్ ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి. ఫిల్మ్ మ్యూజిక్ మాత్రమే కాదు ఇండిపెండెంట్ మ్యూజిక్ వినడానికి కూడా శ్రోతలు ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇండిపెండెంట్ మ్యూజిక్‌తో వివిధ మాధ్యమాల ద్వారా తమను తాము నిరూపించుకునే అవకాశం యువ కళాకారులకు ఉంది.

– అసీస్ కౌర్,
ఫేమస్ స్పాటిఫై సింగర్





స్క్వాష్‌లో పాక్‌పై భారత్ గెలుపు

ఆసియా క్రీడల స్క్వాష్ ఈవెంట్‌లో భారత పురుషుల, మహిళల జట్లు శుభారంభం చేశాయి. మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌ల్లో భారత మహిళల జట్టు 3–0తో పాకిస్తాన్‌పై... భారత పురుషుల జట్టు 3–0తో తొలుత సింగపూర్‌పై, అదే స్కోరుతో ఖతర్‌పై గెలుపొందాయి. పాక్‌తో జరిగిన పోరులో తొలి మ్యాచ్‌లో 15 ఏళ్ల అనాహత్ సింగ్ 11–6, 11–6, 11–3తో సాదియా గుల్‌పై... రెండో మ్యాచ్‌లో ఆరోసారి ఆసియా క్రీడల్లో ఆడుతున్న జోష్నా చినప్ప 11–2, 11–5, 11–7తో నూర్ అల్ హుదా సాదిక్‌పై... మూడో మ్యాచ్‌లో తన్వీ ఖన్నా 11–3, 11–6, 11–2తో నూర్ అల్ ఐన్ ఇజాజ్‌పై గెలిచారు.

సచిన్ శుభారంభం

భారత బాక్సర్లు సచిన్ సివాచ్ (57 కేజీలు), నరేందర్ (ప్లస్ 92 కేజీలు) ఆసియా క్రీడల్లో శుభారంభం చేశారు. తొలి రౌండ్‌లో సచిన్ 5–0తో అస్రి ఉదిన్ (ఇండోనేసియా)పై గెలుపొందగా... నరేందర్ తొలి రౌండ్‌లోనే తన ప్రత్యర్థి ఎల్చోరో ఉమట్‌బెక్ (కిర్గిస్తాన్)ను నాకౌట్ చేశాడు.





మధ్యాహ్నం గం.1:30 నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

‘ఆఖరి’ పంచ్ కోసం...

- నేడు ఆస్ట్రేలియాతో మూడో వన్డే
- వరల్డ్ కప్‌కు ముందు చివరి పోరు
- క్లీన్‌స్వీప్‌పై టీమిండియా దృష్టి
- పరువు కాపాడుకునేందుకు ఆసీస్

రాజ్‌కోట్: విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలాంటి స్టార్ బ్యాటర్లు లేకుండానే భారత జట్టు ఆస్ట్రేలియాపై ఇప్పటికే వన్డే సిరీస్ గెలుచుకుంది. ఇప్పుడు వీరిద్దరు మ్యాచ్ ప్రాక్టీస్ కోసం మైదానంలోకి దిగబోతున్నారు. ప్రతిష్టాత్మక ప్రపంచకప్‌లో మరో 11 రోజుల్లో ఇదే ఆసీస్‌తో తొలి మ్యాచ్ ఆడనున్న నేపథ్యంలో దాని కోసం చివరి ట్రయల్‌గా ఇరు జట్లు బరిలోకి దిగుతున్నాయి. మరో నలుగురు ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి టీమిండియా తమ సత్తాను పరీక్షించుకునేందుకు సిద్ధం కాగా, ఆసీస్ మాత్రం ప్రధాన ఆటగాళ్లందరినీ ఆడించనుంది. ఆసీస్‌పై తొలిసారి వన్డేల్లో క్లీన్‌స్వీప్ కోసం భారత్ సిద్ధం కాగా, మరోవైపు వరుసగా ఆరో వన్డేలో ఓడిపోకుండా పరువు కాపాడుకోవాలని కంగారూలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు ఇరు జట్ల మధ్య సిరీస్‌లో చివరిదైన మూడో వన్డేకు రంగం సిద్ధమైంది. రాజ్‌కోట్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్ కావడంతో భారీ స్కోరు నమోదు కావడం ఖాయం.

జోరు కొనసాగిస్తారా...

ఈ మ్యాచ్ నుంచి భారత జట్టు గిల్, హార్దిక్, శార్దుల్, షమీలకు విశ్రాంతినిచ్చింది. తొలి రెండు మ్యాచ్‌లు ఆడని రోహిత్, కోహ్లి, సిరాజ్, కుల్దీప్, గత మ్యాచ్‌కు దూరమైన బుమ్రా బుధవారం పోరుకు సిద్ధమయ్యారు. ఆటగాళ్లు మారినా ఓవరాల్‌గా భారత జట్టు ప్రదర్శన అద్భుతంగా ఉంది. ఆటగాళ్ల తాజా ఫామ్‌ను బట్టి చూస్తే చివరి వన్డేలోనూ భారత్ పైచేయి సాధించేందుకు అన్ని అవకాశాలూ ఉన్నాయి. ఆసియా కప్ ఫైనల్ తర్వాత సిరాజ్ మళ్లీ తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. బుమ్రా పదునైన బంతులతో ఆసీస్‌ను కట్టడి చేయగలడు. రాహుల్, శ్రేయస్, సూర్యలతో కూడిన బ్యాటింగ్ ఆర్డర్‌తో భారత్ మరోసారి భారీ స్కోరు సాధించగలదు. అనుభవజ్ఞుడిగా తన విలువేంటో అశ్విన్ గత రెండు మ్యాచ్‌లలో చూపించి తన వరల్డ్ కప్ అవకాశాలు మెరుగుపర్చుకున్నాడు. రోహిత్‌తో పాటు ఇషాన్ ఓపెనర్‌గా ఆడతాడు.

స్టార్క్, మ్యాక్స్‌వెల్ సిద్ధం...

సిరీస్ ఓడినా వరల్డ్ కప్‌కు ముందు తగినంత ఆత్మవిశ్వాసం ప్రోది చేసుకునేందుకు ఆసీస్‌కు ఇది తగిన వేదిక. అందుకే ఆ జట్టు తమ వన్డే పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగనుంది. గత మ్యాచ్ ఆడని కమిన్స్, స్టొయినిస్ తిరిగి జట్టులోకి రాగా, స్టార్క్, మ్యాక్స్‌వెల్ అందుబాటులోకి వచ్చారు. దక్షిణాఫ్రికా సిరీస్‌లోనూ ఆడని స్టార్క్, మ్యాక్స్‌వెల్ తమ ఫామ్, ఫిట్‌నెస్ నిరూపించుకునే ప్రయత్నంలో ఉన్నారు. మంగళవారం వీరిద్దరు సుదీర్ఘ సమయం పాటు సాధన చేశారు. జట్టులో వార్నర్ ఒక్కడే ఫామ్‌లో ఉండగా, స్మిత్ ఇంకా తడబడుతున్నాడు. మిచెల్ మార్ష్ తనదైన శైలిలో చెలరేగాలని ఆసీస్ టీమ్ మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. జంపా, హాజల్‌వుడ్ భారత్‌ను ఎంతవరకు నిలువరిస్తారనేది చూడాలి.



స్మిత్

‘అయ్యర్ ఆట బహు బాగు’

సునీల్ గావస్కర్

వరల్డ్ కప్‌కు ముందు ఇబ్బంది పెడుతున్న ఒక సమస్యను పరిష్కరించుకునేందుకు ఇండోర్ మ్యాచ్ భారత్‌కు ఉపకరించింది. ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సిన స్థితిలో నిలిచిన శ్రేయస్ అయ్యర్ ఒక చక్కటి ఇన్నింగ్స్‌తో సత్తా చాటాడు. అతని ఆట ముందు గిల్ శతకం కూడా చిన్నబోయినట్లు అనిపించింది. అర్ధరాత్రి నిద్రలో నుంచి లేపి బ్యాటింగ్ చేయమన్నా సరే తడబడకుండా ఆడే ఫామ్‌లో ఉన్న గిల్‌ను అయ్యర్ వెనక్కి తోసిన తీరు ఈ ఇన్నింగ్స్ ప్రత్యేకతను చూపించింది. ఈ ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఇలాంటి సమన్వయం ఉండటం భవిష్యత్తులో భారత క్రికెట్‌కు ఎంతో మేలు చేస్తుంది. జట్టులో తన స్థానం గురించి రేకెత్తిన అన్ని సందేహాలను పటాపంచలు చేసే ఉద్దేశ్యంతో అయ్యర్ బ్యాటింగ్‌కు దిగాడు. అతను కొన్ని ఆకట్టుకునే షాట్లు ఆడిన తీరు సాధారణంగా ముభావంగా కనిపించే కోచ్ ద్రవిడ్ ముఖంపై కూడా చిరునవ్వులు పూయించింది. గిల్ ఎప్పటిలాగే ఒక్క పొరపాటు లేని ఇన్నింగ్స్ ఆడాడు. ఈ మ్యాచ్ ద్వారా భారత్‌కు మేలు చేసిన మరో అంశం అశ్విన్ బౌలింగ్. అతని గురించి సెలక్టర్లు ఏం ఆలోచిస్తున్నారో మరో ఒకటి రెండు రోజుల్లో తేలిపోతుంది కానీ మొహాలీతో పోలిస్తే ఈ మ్యాచ్‌లో అతని బౌలింగ్ మరింత మెరుగ్గా కనిపించింది. వరల్డ్ కప్‌కు ముందు తమ ఆటను సానబెట్టుకునేందుకు భారత సీనియర్లకు రాజ్‌కోట్ వన్డే అవకాశం కల్పిస్తోంది. మరోవైపు దక్షిణాఫ్రికా నుంచి మొదలైన పరాజయాలకు ఎలా విరామం ఇవ్వాలో తెలియక ఆస్ట్రేలియా జట్టు పరిస్థితి అగమ్యగోచరంగా కనిపిస్తోంది.

41 ఏళ్ల తర్వాత...

- ఈక్వెస్ట్రియన్‌లో భారత జట్టుకు స్వర్ణ పతకం
- డ్రెసాజ్ ఈవెంట్‌లో తొలిసారి అగ్రస్థానం
- సంచలనం సృష్టించిన విపుల్, అనూష్, దివ్యాకృతి, సుదీప్తి బృందం
- సెయిలింగ్‌లో రెండు పతకాలు

అశ్వాలతో ముడిపడి ఉన్న క్రీడ ఈక్వెస్ట్రియన్. అశ్వానికి, రైడర్‌కు మధ్య పూర్తి సమన్వయం ఉండాలి. అప్పుడే ఫలితం వస్తుంది. లేదంటే తడబాటు తప్పదు. న్యూఢిల్లీలో ఆసియా క్రీడలు 1951లో మొదలుకాగా... ఇదే వేదికపై 1982లో జరిగిన ఆసియా క్రీడల్లో ఈక్వెస్ట్రియన్‌ను మొదటిసారి ప్రవేశపెట్టారు. నాటి ఆసియా క్రీడల్లో భారత జట్టు మూడు స్వర్ణాలతో అదరగొట్టింది. ఆ తర్వాత భారత జట్టు ఈ క్రీడాంశంలో మళ్లీ పసిడి పతకం సాధించలేకపోయింది. 41 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ చైనా గడ్డపై మళ్లీ భారత అశ్వదళం అద్భుతం సృష్టించింది. విపుల్ హృదయ్ చద్దా, అనూష్ అగర్‌వల్లా, దివ్యాకృతి సింగ్, సుదీప్తి హజేలాలతో కూడిన భారత జట్టు డ్రెసాజ్ టీమ్ ఈవెంట్‌లో మొదటిసారి బంగారు పతకం సాధించి సంచలనం సృష్టించింది. డ్రెసాజ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు చివరిసారి 1986 సియోల్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకం లభించింది. ఈక్వెస్ట్రియన్ క్రీడలో భాగమైన ఈవెంటింగ్, పెగ్గింగ్ ఈవెంట్‌లలో గతంలో భారత్‌కు పసిడి పతకాలు వచ్చినా డ్రెసాజ్ ఈవెంట్‌లో స్వర్ణం రావడం ఇదే ప్రథమం. ఓవరాల్‌గా ఆసియా క్రీడల్లో మూడో రోజు మంగళవారం భారత్‌కు మూడు పతకాలు వచ్చాయి. ఈక్వెస్ట్రియన్‌లో స్వర్ణంరాగా... సెయిలింగ్‌లో ఒక రజతం, ఒక కాంస్య పతకం లభించాయి. షూటింగ్, జూడో క్రీడాంశాల్లో త్రుటిలో కాంస్య పతకాలు చేజారాయి.



స్వర్ణ పతకాలతో అనూష్, సుదీప్తి, దివ్యాకృతి సింగ్, విపుల్ హృదయ్

హాంగ్జౌ: ఎవరూ ఊహించని విధంగా ఈక్వెస్ట్రియన్ క్రీడాంశంలో భారత బృందం మెరిసింది. 41 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆసియా క్రీడల్లో ఈక్వెస్ట్రియన్‌లో భారత్‌కు మళ్లీ స్వర్ణ పతకం లభించింది. మంగళవారం జరిగిన డ్రెసాజ్ టీమ్ ఈవెంట్‌లో విపుల్ హృదయ్ చద్దా, అనూష్ అగర్‌వల్లా, దివ్యాకృతి సింగ్, సుదీప్తి హజేలాలతో కూడిన భారత జట్టు 209.205 పాయింట్లు సాధించి పసిడి పతకం సొంతం చేసుకుంది. చైనా (204.882 పాయింట్లు) రజతం, హాంకాంగ్ (204.852 పాయింట్లు) కాంస్య పతకం గెల్చుకున్నాయి.

ఇంటికి దూరంగా...

ఆసియా క్రీడల చరిత్రలో డ్రెసాజ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు బంగారు పతకం రావడం ఇదే తొలిసారి. ఈ స్వర్ణ పతకం వెనుక భారత రైడర్ల శ్రమ ఎంతో దాగి ఉంది. విపుల్, అనూష్, దివ్యాకృతి, సుదీప్తి కొన్నేళ్ల క్రితం భారత్ నుంచి యూరోప్‌కు వెళ్లి కుటుంబసభ్యులకు దూరంగా నివసిస్తూ అక్కడే శిక్షణ తీసుకుంటున్నారు. ఆసియా క్రీడల కోసం భారత ఈక్వెస్ట్రియన్ సమాఖ్య వీరి కోసం యూరోప్‌లోనే ట్రయల్స్ కూడా నిర్వహించింది. ఈ నలుగురి అశ్వాలను జర్మనీలో ఏడురోజులపాటు క్వారంటైన్‌లో పెట్టాక ఈనెల 21న చైనాకు తరలించారు. ‘ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించడం నమ్మశక్యంగా లేదు. ఇక్కడి దాకా మా అందరి ప్రయాణం ఎంతో కఠినంగా సాగింది. యుక్త వయసులోనే మేమందరం యూరోప్‌కు వచ్చి శిక్షణ తీసుకుంటున్నాం’ అని ఇండోర్‌కు చెందిన 21 ఏళ్ల సుదీప్తి వ్యాఖ్యానించింది. ‘మేమందరం ఒకరినొకరం ఉత్సాహపరుచుకున్నాం. జాతీయ గీతం వినిపిస్తూ, జాతీయ పతాకం రెపరెపలాడుతుంటే ఆ అనుభూతిని వర్ణించలేం. మా అందరి శ్రమకు తగ్గ ఫలితం స్వర్ణం రూపంలో లభించింది’ అని 2017లో యూరోప్ వెళ్లిన కోల్‌కతాకు చెందిన 23 ఏళ్ల అనూష్ తెలిపాడు. జైపూర్‌కు చెందిన దివ్యాకృతి అజ్మీర్‌లోని విఖ్యాత మాయో గర్ల్స్ స్కూల్‌లో ఏడో తరగతిలో ఉన్నపుడు హార్స్ రైడింగ్‌పై దృష్టి సారించింది. 2020లో యూరోప్‌కు వెళ్లిన దివ్యాకృతి జర్మనీలో శిక్షణ తీసుకుంది. ముంబైకి చెందిన 25 ఏళ్ల విపుల్ గత పదేళ్లుగా యూరోప్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. లండన్ యూనివర్సిటీ నుంచి అతను బిజినెస్ మేనేజ్‌మెంట్ డిగ్రీ పూర్తి చేశాడు.

డ్రెసాజ్ అంటే...

ఈక్వెస్ట్రియన్‌లో ఎండ్యూరెన్స్, ఈవెంటింగ్, జంపింగ్, పెగ్గింగ్, డ్రెసాజ్ తదితర ఈవెంట్లు ఉంటాయి. డ్రెసాజ్ అనేది ఫ్రెంచ్ పదం. ఆంగ్లంలో దీని అర్థం ట్రెయినింగ్. తన అశ్వానికి రైడర్ ఏ విధంగా శిక్షణ ఇచ్చాడో, వీరిద్దరి మధ్య సమన్వయం ఎలా ఉందో ఈ ఈవెంట్ ద్వారా తెలుస్తుంది. రైడర్ నుంచి వచ్చే సంజ్ఞల ఆధారంగా అశ్వం కనబరిచే పలు కదలికలను జడ్జీలు పరిశీలిస్తారు. అనంతరం సున్నా నుంచి పది మధ్య పాయింట్లు ఇస్తారు. గరిష్టంగా పాయింట్లు సాధించిన జట్టుకు పతకాలు ఖరారవుతాయి. జట్టులో నలుగురు రైడర్లు ఉన్నా... పతకాలు ఖరారు చేసేందుకు టాప్–3 రైడర్ల పాయింట్లను లెక్కలోకి తీసుకుంటారు.

భారత్ గోల్స్ వర్షం

సింగపూర్‌పై 16–1తో ఘనవిజయం



హాంగ్జౌ: స్వర్ణ పతకమే లక్ష్యంగా ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన భారత పురుషుల హాకీ జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. పూల్ ‘ఎ’లో భాగంగా సింగపూర్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 16–1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (24వ, 39వ, 40వ, 42వ ని.లో) నాలుగు గోల్స్ నమోదు చేయగా... మన్‌దీప్ సింగ్ (12వ, 30వ, 51వ ని.లో) మూడు గోల్స్ సాధించాడు. అభిషేక్ (51వ, 52వ ని.లో), వరుణ్ కుమార్ (55వ, 55వ ని.లో) రెండు గోల్స్ చొప్పున చేశారు. లలిత్ ఉపాధ్యాయ్ (16వ ని.లో), గుర్జంత్ సింగ్ (22వ ని.లో), వివేక్ సాగర్ ప్రసాద్ (23వ ని.లో), మన్‌ప్రీత్ సింగ్ (37వ ని.లో), షంషేర్ సింగ్ (38వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. సింగపూర్ తరఫున జకీ జుల్కర్‌నైన్ (53వ ని.లో) ఏకైక గోల్ చేశాడు.

సెయిలింగ్‌లో సూపర్...



నేహా ఠాకూర్



ఇబాద్ అలీ

హాంగ్జౌ: సముద్రంలో తెర చాపను నియంత్రిస్తూ ముందుకు దూసుకుపోవడమే సెయిలింగ్. ఆసియా క్రీడల్లో మంగళవారం ఈ క్రీడాంశంలో భారత్‌కు రెండు పతకాలు లభించాయి. భోపాల్‌కు చెందిన 17 ఏళ్ల నేహా ఠాకూర్ బాలికల డింగీ ఐఎల్‌సీఏ–4 ఈవెంట్‌లో రెండో స్థానం సంపాదించి రజత పతకం గెల్చుకుంది. అయోధ్యకు చెందిన 29 ఏళ్ల ఇబాద్ అలీ విండ్‌సర్ఫర్ ఆర్ఎస్:ఎక్స్ ఈవెంట్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. 11 రేసులతో కూడిన డింగీ ఈవెంట్‌లో నేహా 32 పాయింట్లు స్కోరు చేయగా... 14 రేసులతో కూడిన విండ్‌సర్ఫర్ ఈవెంట్‌లో ఇబాద్ అలీ 52 పాయింట్లు సాధించాడు.

పతకాల పట్టిక (టాప్–10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	53	29	13	95
దక్షిణ కొరియా	14	16	19	49
జపాన్	8	20	19	47
ఉజ్బెకిస్తాన్	5	6	11	22
హాంకాంగ్	5	4	10	19
భారత్	3	4	7	14
ఇండోనేసియా	3	1	5	9
చైనీస్ తైపీ	2	3	3	8
థాయ్‌లాండ్	2	0	5	7
ఇరాన్	1	4	5	10

నోట్: స్వ–స్వర్ణం, ర–రజతం, కాం–కాంస్యం, మొ–మొత్తం.

భవాని దేవి ఓటమి



ఆసియా క్రీడల ఫెన్సింగ్ ఈవెంట్‌లో భారత స్టార్ ఫెన్సర్ భవాని దేవి పోరాటం ముగిసింది. మహిళల సేబర్ విభాగంలో భవాని దేవి క్వార్టర్ ఫైనల్లో 7–15తో యాకి షావో (చైనా) చేతిలో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో భవాని గెలిచిఉంటే సెమీఫైనల్ చేరడంద్వారా కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకునేది.

చేజారిన కాంస్యం



ఆసియా క్రీడల షూటింగ్ ఈవెంట్‌లో భారత్‌కు త్రుటిలో కాంస్యం చేజారింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రమితా జిందాల్–దివ్యాంశ్‌లతో కూడిన భారత జోడీ కాంస్య పతక మ్యాచ్‌లో ఓడిపోయింది. రమిత–దివ్యాంశ్ ద్వయం 18–20తో పార్క్ హాజున్–లీ ఉన్‌సియో (కొరియా) జంట చేతిలో ఓటమి పాలైంది.

క్వార్టర్ ఫైనల్లో సుమిత్



ఆసియా క్రీడల టెన్నిస్ ఈవెంట్ పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్, మహిళల సింగిల్స్‌లో అంకిత రైనా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సుమిత్ 7–6 (11/9), 6–4తో బెబిట్ జుకయెవ్ (కజకిస్తాన్)పై, అంకిత 6–1, 6–2తో ఆదిత్య పటాలి (హాంకాంగ్)పై గెలుపొందారు.

భారత గడ్డపై అతిథులుగా...

వరల్డ్ కప్‌లో పాల్గొనే జట్లు ఒక్కొక్కటిగా భారత్‌కు చేరుకుంటున్నాయి. ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ ఇప్పటికే భారత్‌లో ఉండగా... మంగళవారం అఫ్గానిస్తాన్ బృందం తిరువనంతపురం చేరింది. న్యూజిలాండ్ టీమ్ రెండు బృందాలుగా భారత్‌కు చేరుకుంటోంది. బంగ్లాదేశ్‌తో మంగళవారం చివరి వన్డే ఆడిన టీమ్ నేడు హైదరాబాద్‌కు రానుండగా... కెప్టెన్ కేన్ విలియమ్సన్ సహా ఇతర ప్రధాన ఆటగాళ్లతో కూడిన జట్టు మంగళవారం రాత్రి పది గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో అడుగు పెట్టింది. పాకిస్తాన్ కూడా బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకుంటుంది.



తమీమ్ ఇక్బాల్‌పై వేటు

వరల్డ్ కప్‌కు బంగ్లాదేశ్ జట్టు



తమీమ్



హసరంగ

ఢాకా: వన్డే వరల్డ్ కప్‌లో పాల్గొనే 15 మంది సభ్యుల బంగ్లాదేశ్ జట్టును బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) మంగళవారం ప్రకటించింది. సీనియర్ బ్యాటర్ తమీమ్ ఇక్బాల్‌కు ఇందులో చోటు దక్కలేదు. వెన్నునొప్పితో బాధపడుతున్న అతను పూర్తి ఫిట్‌గా లేకపోగా, ఫిట్‌నెస్ సమస్యలు ఉన్న ఆటగాళ్లను జట్టులోకి ఎంపిక చేయరాదంటూ కెప్టెన్ షకీబ్ అల్ హసన్ డిమాండ్ చేయడం కూడా ప్రధాన కారణం. రిటైర్మెంట్ ప్రకటించి, దేశ ప్రధాని జోక్యంతో దానిని వెనక్కి తీసుకొని, కెప్టెన్సీకి రాజీనామా చేసి ఆపై కివీస్‌తో రెండు వన్డేలు ఆడిన తర్వాతా తమీమ్‌కు వరల్డ్ కప్ టీమ్‌లో చోటు దక్కలేదు.

జట్టు వివరాలు: షకీబ్ (కెప్టెన్), లిటన్ దాస్, తన్‌జీద్, నజ్ముల్, ముష్ఫికర్, తౌహీద్, మిరాజ్, మహ్ముదుల్లా, మెహదీ హసన్, నసుమ్, మహమూద్, తస్కీన్, షరీఫుల్, ముస్తఫిజుర్, తన్‌జీమ్.

హసరంగ, చమీరా దూరం...

కొలంబో: వరల్డ్ కప్‌లో శ్రీలంక తమ ఇద్దరు ప్రధాన బౌలర్లు వనిందు హసరంగ, దుష్మంత చమీరా సేవలు కోల్పోనుంది. గాయాలతో బాధపడుతున్న వీరిద్దరు మెగా టోర్నీకి దూరమయ్యారు.

జట్టు వివరాలు: షనక (కెప్టెన్), కుశాల్ పెరీరా, నిసాంకా, కరుణరత్నే, కుశాల్ మెండిస్, సమరవిక్రమ, అసలంక, ధనంజయ, హేమంత, వెలలాగె, తీక్షణ, పతిరణ, కుమార, రజిత, మదుషంక.

వన్డే ప్రపంచకప్ మరో 8 రోజుల్లో

సినిమా

నేనివ్వ!



● నవీన్ చంద్ర, సాయిధరమ్ తేజ్, స్వాతి

– స్వాతీ రెడ్డి

‘‘శ్రీకాంత్ తీసిన ‘భానుమతి రామకృష్ణ’ సినిమాలో చాలా క్లిష్టమైన భావోద్వేగాలు ఉన్నాయి. ఆయన తీసిన ఈ ‘మంత్ ఆఫ్ మధు’లోనూ అలాంటి భావోద్వేగాలు కనిపిస్తున్నాయి. ఈ సినిమా మంచి విజయం సాధించాలి’’ అని హీరో సాయిధరమ్ తేజ్ అన్నారు. నవీన్ చంద్ర, స్వాతీ రెడ్డి ప్రధాన పాత్రల్లో శ్రీకాంత్ నాగోతి దర్శకత్వం వహించిన చిత్రం ‘మంత్ ఆఫ్ మధు’. యశ్వంత్ ములుకుట్ల క్రిషివ్ ప్రొడక్షన్స్, హ్యాండ్ పిక్డ్ స్టోరీస్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా అక్టోబర్ 6న విడుదల కానుంది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న సాయిధరమ్ తేజ్ ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేశారు. నవీన్ చంద్ర మాట్లాడుతూ– ‘‘మా సినిమాకి మంచి కథ, సినిమాటోగ్రఫీ, మ్యూజిక్.. ఇలా అన్నీ బాగా కుదిరాయి’’ అన్నారు. ‘‘ఈ సినిమా చూసినవారు సర్‌ప్రైజ్ అవుతారు’’ అన్నారు స్వాతీ రెడ్డి. అలాగే తన భర్త నుంచి స్వాతి విడాకులు తీసుకున్నారనే వార్త ప్రచారంలో ఉంది. ఈ విషయంపై క్లారిటీ ఇస్తారా అని అడగ్గా.. ‘‘నేనివ్వా’’ అన్నారు స్వాతి. ‘‘మంత్ ఆఫ్ మధు’ అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది’’ అన్నారు శ్రీకాంత్ నాగోతి. చిత్ర సహనిర్మాత సుమంత్ దామ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రఘువర్మ పేరూరి, నటీనటులు శ్రేయ, రాజా రవీంద్ర, హర్ష, యశ్వంత్ పాల్గొన్నారు.

మంగళవారం థ్రిల్

పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో అజయ్ భూపతి దర్శకత్వం వహించిన చిత్రం ‘మంగళవారం’. స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. ఈ చిత్రాన్ని నవంబర్ 17న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అజయ్ భూపతి మాట్లాడుతూ– ‘‘గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన రస్టిక్ యాక్షన్ థ్రిల్లర్ ‘మంగళవారం’’ అన్నారు. ‘‘ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. త్వరలో ట్రైలర్ విడుదల చేస్తాం’’ అన్నారు స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం. ఈ చిత్రానికి సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: దాశరథి శివేంద్ర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాయికుమార్ యాదవిల్లి.



● పాయల్ రాజ్‌పుత్

ఇక మా ప్రయాణం మారుతుంది

– నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి



‘‘తెలుగు పరిశ్రమలో చెప్పుకోదగ్గ సినిమాలు అరుదుగా ఉంటాయి. మా ‘పెదకాపు 1’ కూడా అరుదైన చిత్రంగా నిలుస్తుంది. ఈ సినిమా తర్వాత మా ద్వారక క్రియేషన్స్ ప్రయాణం మారుతుంది’’ అని నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి అన్నారు. విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహించిన చిత్రం ‘పెదకాపు 1’. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మిర్యాల రవీందర్ రెడ్డి విలేకరులతో పంచుకున్న విశేషాలు.

● ‘పెదకాపు 1’ చిత్రకథకి కొత్త హీరో అయితేనే సహజత్వం వస్తుంది. అందుకే విరాట్ కర్ణని తీసుకున్నాం. సినిమా మొత్తం చాలా సహజత్వంతో ఉంటుంది. ఎక్కడ కూడా సెట్స్ వేయలేదు. 1980 నాటి పరిస్థితులని ప్రతిబింబించేలా రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో నిజమైన లొకేషన్స్‌లో చిత్రీకరించాం. ఒక చరిత్రని కళ్ల ముందు ఎలా చూపించాలో అలానే సహజంగా చూపించారు శ్రీకాంత్ అడ్డాల.

● మా సినిమాని చూస్తున్నప్పుడు నిజ జీవితాన్నే తెరపై చూస్తున్న అనుభూతి కలుగుతుంది. ఒక సామాన్యుడు తన పరిస్థితులను తట్టుకొని బలవంతుడిని జయించాలంటే ఒక యుద్ధమే చేయాలి. మనం అనుకున్నది సాధించాలంటే పోరాటం తప్పితే వేరే మార్గం లేదు.. అదే ఈ సినిమా కథ. కుటుంబం, సమూహం, ప్రాంతం.. ఇలా ఏదైనా నా అనుకొనే వారి కోసం కాపు కాసేవారికి పెదకాపు అనే పేరు ఉంటుంది. ఆ ఉద్దేశంతోనే మేం ‘పెదకాపు’ టైటిల్ పెట్టాం.

● విరాట్‌ని స్క్రీన్‌పై చూస్తున్నప్పుడు ఒక పెద్ద హీరోని చూసిన అనుభూతి కలిగింది. విరాట్‌ని వైజాగ్ సత్యానంద్‌గారు హీరో ప్రభాస్‌తో పోల్చడం హ్యాపీగా ఉంది. శ్రీకాంత్ అడ్డాలగారు విలన్‌గా చక్కగా సరిపోయారు. మిక్కీ జె. మేయర్ అద్భుతమైన మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చారు. ‘పెదకాపు 1’ రిలీజ్ తర్వాత ‘పెదకాపు 2’ ఉంటుంది. ఆ తర్వాత అడివి శేష్‌తో ఓ చిత్రం చేస్తాను. అలాగే ‘అఖండ 2’తో పాటు మరో రెండు మూడు కథలు చర్చల్లో ఉన్నాయి.

సాక్షి బిజినెస్
బుధవారం
27-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
78	10
65,945	19,665

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,099	▽	177
డోజోన్స్	33,680	▽	327
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,626	△	2
డాక్స్	15,256	▽	150
షాంఘై	3,102	▽	13
నికాయ్	32,315	△	364

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)		
58,520	▽	150
బంగారం (22 క్యారెట్)		
55,730	▽	150
వెండి (కిలో)		
77,600	▽	1400

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.45	84.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.92	103.28
€	యూరో	ఎస్‌బీఐ	86.64	89.74
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.10	56.81
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.39	54.69
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.93	61.84
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.96	23.44
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.21	12.29

ముకేశ్ అంబానీ బాటలోనే..

- ఆకాశ్, ఈషా, అనంత్..
- జీతాలు తీసుకోకుండానే బాధ్యతలు
- బోర్డ్ సమావేశాలకు ఫీజులు మాత్రమే



న్యూఢిల్లీ: బిలియనీర్ ముకేశ్ అంబానీ బాటలోనే ఆయన ఇద్దరు కుమారులు, కుమార్తె జీతాలు తీసుకోకుండా బాధ్యతలు నిర్వహించనున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ బోర్డు, కమిటీ సమావేశాలలో పాలుపంచుకుంటున్నందుకు ఆకాశ్, ఈషా, అనంత్ ఫీజులు మాత్రమే పొందనున్నారు. అంతేకాకుండా నికర లాభాల నుంచి కమీషన్ అందుకోను న్నారు. ముకేశ్ సంతానాన్ని బోర్డులో నియమించేందుకు వాటాదారుల అనుమతి కోరుతున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా ఈ అంశాలను వెల్లడించింది. 66ఏళ్ల అంబానీ 2020–21 ఏడాది నుంచి ఎలాంటి జీతాన్ని అందుకోవడంలేదు. అయితే అంబానీ బంధువులు నిఖిల్, హిటల్ వేతనాలతోపాటు.. ఇతర అలవెన్సులు తదితరాలను పొందుతున్నారు.

నీతా అంబానీ తరహాలో

2014లో ముకేశ్ భార్య నీతా అంబానీ ఎంపిక తరహాలోనే కవలలు 31ఏళ్ల ఆకాశ్, ఈషా సహా 28ఏళ్ల అనంత్‌ను ఆర్ఐఎల్ బోర్డులో నియమించనున్నారు. 2022–23లో నీతా అంబానీ రూ. 6 లక్షల సిటింగ్ ఫీజు, రూ. 2 కోట్ల కమీషన్ అందుకున్నట్లు ఆర్ఐఎల్ తాజా వార్షిక నివేదికలో పేర్కొంది. గత నెలలో నిర్వహించిన కంపెనీ వార్షిక సమావేశంలో ఆర్ఐఎల్ బోర్డులోకి ముగ్గురినీ ఎంపిక చేశారు. అయితే ముకేశ్ ఆర్ఐఎల్ చైర్మన్, సీఈవోగా మరో ఐదేళ్లు బాధ్యతలు నిర్వహించనున్నారు. తద్వారా తదుపరితరం నాయకులకు మార్గదర్శకత్వం వహించనున్నారు. కాగా.. ముకేశ్ సంతానాన్ని బోర్డులో నియమించేందుకు వీలుగా ఆర్ఐఎల్ పోస్టల్ బ్యాలట్ ద్వారా వాటాదారుల అనుమతి కోరుతోంది.

పరిశోధనలపై దృష్టి పెట్టాలి

- వినూత్న ఉత్పత్తులను తయారు చేయాలి
- అప్పుడే ప్రపంచ స్థాయికి ఎదుగుతాం
- దేశీ ఫార్మా సంస్థలకు కేంద్ర మంత్రి మాండవీయ సూచన



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా దిగ్గజాలుగా ఎదగాలంటే పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు పెద్ద పీట వేయాలని దేశీ ఫార్మా పరిశ్రమకు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సూచించారు. వినూత్న ఉత్పత్తులను రూపొందించడంపై దృష్టి పెట్టాలని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో పాటు ప్రపంచ మార్కెట్ల కోసం కీలక యంత్రపరికరాలను తయారు చేయాలని అటు మెడికల్ టెక్నాలజీ కంపెనీలకు సూచించారు. ఫార్మా–మెడ్ టెక్ రంగంలో పరిశోధనలు, అభివృద్ధి, నవకల్పనలపై జాతీయ పాలసీని ఆవిష్కరించిన సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు. 'అంతర్జాతీయ బహుళ జాతి కంపెనీలు తమ లాభాల్లో 20–25 శాతాన్ని పరిశోధన, ఆవిష్కరణలపై వెచ్చిస్తుంటాయి. కానీ దేశీ కంపెనీలు సుమారు 10 శాతమే వెచ్చిస్తున్నాయి. మనం పరిశోధన ఆధారిత వినూత్న ఉత్పత్తులను తయారు చేయనంత వరకూ అంతర్జాతీయంగా ఈ విభాగానికి సారథ్యం వహించలేము' అని ఆయన చెప్పారు. 2047 నాటికి ఫార్మా పరిశ్రమ స్వావలంబన సాధించుకునే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు.

నాణ్యత కూడా ముఖ్యమే..

భారీ పరిమాణంలో ఉత్పత్తి చేయడమే కాకుండా ఉత్పత్తుల నాణ్యతపై కూడా ఫార్మా పరిశ్రమ దృష్టి పెట్టాలని మాండవీయ చెప్పారు. మరోవైపు, ఫార్మా మెడ్‌టెక్ రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించే పథకాన్ని (పీఆర్ఐపీ) కూడా కేంద్రం ఆవిష్కరించింది. ఈ స్కీము బడ్జెట్ రూ. 5,000 కోట్లని మాండవీయ చెప్పారు. పరిమాణంపరంగా 50 బిలియన్ డాలర్లతో భారత ఫార్మా పరిశ్రమ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉంది. వచ్చే దశాబ్ద కాలంలో 120–130 బిలియన్ డాలర్లకు ఎదగగలదని అంచనాలు ఉన్నాయి.

స్టార్టప్‌లకు 5 వేల్యుయేషన్ విధానాలు

ఏంజెల్ ట్యాక్స్ నిబంధనల నోటిఫికేషన్ జారీ



న్యూఢిల్లీ: ఇన్వెస్టర్లకు అన్‌లిస్టెడ్ అంకుర సంస్థలు జారీ చేసే షేర్ల విలువను మదింపు చేసే విధానాలకు సంబంధించి కొత్త ఏంజెల్ ట్యాక్స్ నిబంధనలను ఆదాయపు పన్ను శాఖ నోటిఫై చేసింది. ఆదాయపు పన్ను చట్టంలోని 11యూఏ నిబంధనలో ఈ మేరకు సవరణలు చేసింది. దీని ప్రకారం అన్‌లిస్టెడ్ స్టార్టప్‌లు జారీ చేసే ఈక్విటీ షేర్లు, కంపల్సరీ కన్వర్టబుల్ ప్రిఫరెన్స్ షేర్ల (సీసీపీఎస్) వేల్యుయేషన్‌ను సముచిత మార్కెట్ విలువ (ఎఫ్ఎంవీ)కి పది శాతం అటూ ఇటూగా లెక్క కట్టవచ్చు. ప్రవాస ఇన్వెస్టర్లు అయిదు రకాల వేల్యుయేషన్ విధానాలను ఉపయోగించవచ్చు. ఆప్షన్ ప్రైసింగ్ విధానం, మైల్‌స్టోన్ అనాలిసిస్ విధానం మొదలైనవి వీటిలో ఉంటాయి. దేశీ ఇన్వెస్టర్లకు ఈ అయిదు విధానాలు వర్తించవు. రూల్ 11 యూఏ ప్రకారం దేశీయ ఇన్వెస్టర్లకు ప్రస్తుతమున్న డీసీఎఫ్ (డిస్కౌంటెడ్ క్యాష్ ఫ్లో), ఎన్ఏవీ (అసెట్ నికర విలువ) విధానాలు వర్తిస్తాయి. ఎఫ్ఎంవీకి మించిన ధరకు షేర్లను విక్రయించడం ద్వారా స్టార్టప్‌లు సమీకరించిన నిధులపై వేసే పన్నును ఏంజెల్ ట్యాక్స్‌గా వ్యవహరిస్తున్నారు. ఇది తొలుత దేశీ ఇన్వెస్టర్లకే పరిమితమైనప్పటికీ 2023–24 బడ్జెట్‌లో విదేశీ పెట్టుబడులను కూడా దీని పరిధిలోకి తెచ్చారు. దీన్ని అమల్లోకి తెచ్చే దిశగా కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తాజా నోటిఫికేషన్ జారీ చేసింది. అయిదు రకాల వేల్యుయేషన్స్ విధానాలను అందుబాటులోకి తేవడం వల్ల ఇన్వెస్టర్లకు పన్నులపరంగా కొంత వెసులుబాటు పొందే వీలు లభించగలదని డెలాయిట్ ఇండియా, నాంగియా అండ్ కో తదితర సంస్థలు తెలిపాయి.

డీమ్యాట్ నామినీ నమోదు గడువు పెంపు

డిసెంబర్ చివరి వరకు అవకాశం



న్యూఢిల్లీ: డీమ్యాట్ ఖాతాదారులు నామినేషన్‌కు సంబంధించి తమ ఎంపికను తెలియజేసేందుకు గడువును సెబీ డిసెంబర్ చివరి వరకు పొడిగించింది. వాస్తవానికి అయితే ఈ నెల 30తో ఈ గడువు ముగుస్తోంది. ప్రస్తుత డీమ్యాట్ ఖాతాదారులు తమ ఖాతాలకు సంబంధించి నామినీ నమోదు లేదంటే నామినీ నిలిపివేయడం ఏదో ఒక ఆప్షన్ ఇవ్వడం తప్పనిసరి. ఇందుకు సంబంధించి ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఇక ట్రేడింగ్ ఖాతాలకు నామినేషన్ ఎంపికను స్వచ్ఛందం చేస్తున్నట్లు సెబీ ప్రకటించింది. ట్రేడింగ్ ఖాతాలకు ఇవ్వడమా, ఇవ్వకపోవడమా అనేది ఇన్వెస్టర్ల అభీష్టానికే విడిచిపెట్టింది. స్టాక్ ఎక్స్చేంజీలు, డిపాజిటరీలు, బ్రోకర్ల అసోసియేషన్‌లు, ఇతర భాగస్వాముల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ట్రేడింగ్ ఖాతాలకు నామినేషన్‌ను స్వచ్ఛందం చేసినట్లు సెబీ తెలిపింది. డీమ్యాట్ ఖాతాలకు సంబంధించి నామినేషన్ ఎంపిక గడువును డిసెంబర్ 31వరకు పొడిగించినట్లు ప్రకటించింది. ఇక ఫిజికల్‌గా షేర్లు కలిగిన వారు తమ ఫోలియోలకు సంబంధించి పాన్, నామినేషన్, కాంటాక్ట్ వివరాలు, బ్యాంక్ ఖాతా, స్పెసిమెన్ సిగ్నేచర్ (సంతకం)ను డిసెంబర్ 31 వరకు ఇవ్వొచ్చని సెబీ స్పష్టం చేసింది.

రూ.500 కోట్ల కంపెనీగా అవతరించడమే లక్ష్యం

ఇన్ఫినిటీ లెర్న్ బై చైతన్య ప్రకటన

హైదరాబాద్: శ్రీ చైతన్య ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్టప్ 'ఇన్ఫినిటీ లెర్న్ బై శ్రీ చైతన్య' 2025 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.500 కోట్ల కంపెనీగా అవతరించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఎడ్యుటెక్ రంగంలో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ 2022–23లో అద్భుతమైన పనితీరు కనబరిచినట్లు పేర్కొంది. 2021–22లో సంస్థ ఆదాయం రూ. 2.3 కోట్లు కాగా.. 2022–23లో రూ.100 కోట్లకు చేరిందని వివరించింది. ''వ్యవస్థాపక ఆశయం స్పష్టంగా ఉంది. ఎడ్‌టెక్ రంగంలో అత్యధిక పాఠకులను ఆకర్షించడమే కాకుండా 'చదువుకునేవారు నేర్చుకున్నారా లేదా?' అనే మార్గదర్శక సూత్రాన్ని అలాగే కొనసాగిస్తున్నాము. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులకు ప్రయోజనం కలిగించేలా విద్యాపరమైన అంతరాలను తొలగించగలిగాము'' అని లెర్న్ బై శ్రీ చైతన్య వ్యవస్థాపక సీఈఓ ఉజ్వల్ సింగ్ తెలిపారు.

66 వేల దిగువకు సెన్సెక్స్

- ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ
- పరిమిత శ్రేణిలో బలహీనంగా ట్రేడింగ్



ముంబై: ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందడంతో సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో బలహీనంగా కదలాడాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడి పెంచాయి. ఇంట్రాడేలో 158 పాయింట్ల పరిధిలో ట్రేడైన సెన్సెక్స్ చివరికి 78 పాయింట్లు నష్టపోయి 66వేల దిగువన 65,945 వద్ద స్థిరపడింది. నిఫ్టీ పది పాయింట్లను కోల్పోయి 19,665 వద్ద నిలిచింది. పారిశ్రామిక, మెటల్, ఎఫ్ఎంసీజీ, టెలికాం షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.693 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.715 కోట్ల షేర్లను కొన్నారు. వడ్డీరేట్ల పెంపు ఆందోళనలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా కదలాడుతున్నాయి.

- మనోజ్ వైభవ్ జెమ్స్ ఎన్ జ్యువెల్లరీ ఐపీఓకు 2.25 రెట్ల అధిక స్పందన లభించింది. కంపెనీ మొత్తం 91.20 లక్షల ఈక్విటీలను జారీ చేయగా 2.05 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. సంస్థాగతేతర కోటా 5.18 రెట్లు, రిటైల్ విభాగం 1.66 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యాయి.
- నష్టాల మార్కెట్లో స్మాల్ క్యాప్ షేర్లు మెరిశాయి. శ్రేయాస్ షిప్పింగ్ 20%, ఐఎఫ్‌సీఐ 12%, కొచ్చిన్ షిప్‌యార్డ్ 11%, ఎన్ఐటీ 10%, ఓమాక్స్ 9% అశోకా బిల్డ్‌కాన్ 8%, ఎన్‌సీసీ, అపార్ ఇండస్ట్రీస్, ఎంటార్ షేర్లు 7% ర్యాలీ చేశాయి. బీఎస్ఈలో ఈ రంగ షేర్లకు ప్రాతినిధ్యం వహించే బీఎస్ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ అరశాతం వరకు లాభపడింది.
- గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థ జెఫ్పరీస్.., షేరు టార్గెట్ ధరను రూ.4,000 నుంచి రూ.4,150కి పెంచడంతో ఐషర్ మోటార్స్ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈలో 2.5% బలపడి రూ.3471 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 4.5% ర్యాలీ చేసి రూ.3539 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు యోచన నేపథ్యంలో డిమాండ్ రికవరీ ఆలస్యం అవ్వొచ్చనే అంచనాలతో ఐటీ రంగ షేర్లు డీలాపడ్డాయి. ఎంఫసిస్, కోఫోర్జ్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ 2–1% నష్టపోయాయి.
- బ్యాంక్ ఆఫ్ అమెరికా పాజిటివ్ అవుట్‌లుక్ కేటాయింపుతో వరుణ్ బేవరేజెస్ షేరు ఐదున్నర శాతం ర్యాలీ చేసి రూ.975 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. చివరికి నాలుగున్నర శాతం లాభపడి రూ.967 వద్ద ముగిసింది. బీఎస్ఈ ఎక్స్చేంజీలో మొత్తం 29 లక్షల షేర్లు చేతులు మారాయి.
- రూపాయి విలువ రెండోరోజూ కరిగిపోయింది. డాలర్ మారకంలో 15 పైసలు బలహీనపడి 83.28 వద్ద స్థిరపడింది. క్రూడ్ ధరలు పెరగడం, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, బలహీన ఈక్విటీ మార్కెట్ దేశీ కరెన్సీ క్షీణతకు కారణమయ్యాయి.

జిరోధా లాభం జూమ్

గతేడాది రూ. 2,907 కోట్లు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ స్టాక్ బ్రోకింగ్ ప్లాట్‌ఫామ్ జిరోధా మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం (2022–23)లో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. నికర లాభం 39 శాతం ఎగసి రూ. 2,907 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021–22)లో రూ. 2,094 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఇక మొత్తం ఆదాయం సైతం 39 శాతం జంప్‌చేసి రూ. 6,875 కోట్లకు చేరింది. అంతక్రితం రూ. 4,964 కోట్ల టర్నోవర్ నమోదైంది. గతేడాది అత్యధిక వృద్ధిని సాధించినప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) ఇప్పటివరకూ అటు ఆదాయం, ఇటు లాభదాయకతల్లో బిజినెస్ మందగించినట్లు జిరోధా సహవ్యవస్థాపకుడు, సీఈవో నితిన్ కామత్ పేర్కొన్నారు. గత మూడేళ్లలో ప్రస్తావించదగ్గస్థాయిలో ఆదాయం, లాభాలు సాధించేందుకు మార్కెట్లు ప్రధానంగా ఎఫ్అండ్‌వో విభాగం కారణమైనట్లు వివరించారు.

జాబ్ పాయింట్

ఈస్టర్న్ రైల్వేలో 3115 యాక్ట్ అప్రెంటిస్‌లు

కోల్‌కతాలోని ఈస్టర్న్ రైల్వే–రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ).. ఈస్టర్న్ రైల్వే పరిధిలోని వర్క్‌షాప్‌లు, డివిజన్‌లలో యాక్ట్ అప్రెంటిస్‌ల కోసం దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 3115
» **వర్క్‌షాప్/డివిజన్లు:** హౌరా డివిజన్, లిలుహ వర్క్‌షాప్, సీల్డా డివిజన్, కంచరపరా వర్క్‌షాప్, మాల్దా డివిజన్, అసన్‌సోల్ డివిజన్, జమాల్‌పుర్ వర్క్‌షాప్.
» **ట్రేడులు:** ఫిట్టర్, వెల్డర్, మెకానిక్, మెషినిస్ట్, కార్పెంటర్, పెయింటర్, లైన్‌మ్యాన్, వైర్‌మ్యాన్, ఎలక్ట్రీషియన్, ఎంఎంటీఎం, సివిల్ ఇంజనీర్, టర్నర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్.
» **అర్హత:** పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:**27.09.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**26.10.2023
» **వెబ్‌సైట్:** https://139.99.53.236:8443/rrcer/index.jsp

ఈసీఐఎల్ హైదరాబాద్‌లో 484 ట్రేడ్ అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇచ్చేందుకు ట్రేడ్ అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 484
» **ఖాళీల వివరాలు:** ఈఎం–190, ఎలక్ట్రీషియన్–80, ఫిట్టర్–80, ఆర్ అండ్ ఏసీ–20, టర్నర్–20, మెషినిస్ట్–15, మెషినిస్ట్(జి)–10, సీవోపీఏ–40, వెల్డర్–25, పెయింటర్–04.
» **వయసు:** 31.10.2023 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **అర్హత:**సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి
» **శిక్షణ కాలం:** ఒక సంవత్సరం.
» **స్టైపెండ్:** నెలకు రూ.7,700 నుంచి రూ.8,050
» **ఎంపిక విధానం:** ఐటీఐ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **డాక్యుమెంట్ వెరిఫికేషన్ స్థలం:** ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, కార్పొరేట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, నలంద కాంప్లెక్స్, టీఐఎఫ్ఆర్ రోడ్, ఈసీఐఎల్, హైదరాబాద్.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**10.10.2023
» **ధ్రువపత్రాల పరిశీలన తేదీలు:** 16.10.2023 నుంచి 21.10.2023 వరకు
» **ప్రవేశానికి గడువుతేది:** 31.10.2023.
» **అప్రెంటిస్‌షిప్ శిక్షణ ప్రారంభతేది:** 01.11.2023
» **వెబ్‌సైట్:** ecil.co.in

ఆర్మీ పబ్లిక్ స్కూల్, గోల్కొండలో 14 పోస్టులు

హైదరాబాద్‌లోని గోల్కొండలో ఆర్మీ పబ్లిక్ స్కూల్.. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
» **పోస్టులు:** టీజీటీ, యూడీసీ, పీఆర్‌టీ, కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్, సైన్స్ ల్యాబ్ అటెండెంట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టులను అనుసరించి మెట్రిక్యులేషన్/10+2/గ్రాడ్యుయేషన్/పీజీ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం ఐదేళ్ల పని అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆర్మీ పబ్లిక్ స్కూల్, గోల్కొండ, ఇబ్రహీంబాగ్ పోస్ట్, హైదరాబాద్–500031 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.10.2023.
» **వెబ్‌సైట్:** www.apsgolconda.edu.in

ఐఎఫ్ఎఫ్‌సీఓ, న్యూఢిల్లీలో అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్ ట్రైనీ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్(ఐఎఫ్ఎఫ్‌సీఓ), అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** జనరల్/ఓబీసీ అభ్యర్థులు కనీసం 60 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులతో బీఎస్సీ(అగ్రికల్చర్) డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. నవంబర్ 2023 నాటికి చివరి సెమిస్టర్ పరీక్షలు రాసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **వయసు:** 01.08.2023 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది శిక్షణ అందిస్తారు. ఈ సమయంలో నెలకు రూ.33,000 స్టైపెండ్ అందుతుంది. రూ.37,000 నుంచి రూ.70,000 జీతంతో పాటు ఇతర అలవెన్సులు చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్, ఫైనల్ ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**07.10.2023
» **వెబ్‌సైట్:** www.iffco.in

» నిబంధనలపై పూర్తి అవగాహన ముఖ్యం
» నిర్దేశిత టెస్ట్ స్కోర్లు కూడా ప్రామాణికమే
» కన్సల్టెన్సీల విషయంలో అప్రమత్తత అవసరం

వీసా.. విజయవంతం ఇలా!

స్టడీ అబ్రాడ్.. దేశంలోని లక్షల మంది విద్యార్థుల స్వప్నం! ఇందుకోసం ఎంతో శ్రమించి.. ఎన్నో మార్గాల్లో అన్వేషించి.. విదేశీ వర్సిటీల్లో ప్రవేశం ఖరారు చేసుకుంటున్నారు! ఇలా అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఏ మాత్రం పొరపాటు చేసినా.. విదేశీ విద్యకు కీలకమైన వీసా దరఖాస్తు తిరస్కరణకు గురవుతోంది. ఇటీవల కాలంలో.. భారత విద్యార్థులకు వీసా మంజూరులో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా ఆయా దేశంలో అడుగుపెట్టిన తర్వాత కూడా వీసా రద్దవడం వంటివి తెలిసిందే!! ఈ నేపథ్యంలో.. వీసా తిరస్కరణకు కారణాలు, విజయవంతంగా వీసా పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం..



విదేశీ యూనివర్సిటీలో ప్రవేశం దక్కిందంటే చాలు.. వీసా సులువుగా లభిస్తుందనే అభిప్రాయం ఎక్కువ మంది విద్యార్థుల్లో నెలకొంది. వాస్తవానికి వీసా మంజూరు అనేది సదరు ఇమ్మిగ్రేషన్ అధికారుల విచక్షణాధికారాలపైనే ఆధారపడి ఉంటుంది. కాబట్టి ఆయా దేశాల్లో వీసా నిబంధనలపై అవగాహన పెంచుకొని, అందుకనుగుణంగా సన్నద్ధమైతే వీసా పొందేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

గుర్తింపు పొందిన వర్సిటీలకే

స్టడీ అబ్రాడ్ విద్యార్థులు తాము చేరాలనుకుంటున్న విదేశీ యూనివర్సిటీ/ ఇన్‌స్టిట్యూట్‌కు ఆ దేశ విద్యాశాఖ, ఇతర నియంత్రణ సంస్థల గుర్తింపు ఉందా? లేదా అనేది తప్పనిసరిగా పరిశీలించాలి. గుర్తింపు ఉన్న వర్సిటీల్లో చేరితేనే వీసా మంజూరవుతుంది. దీంతోపాటు సదరు ఇన్‌స్టిట్యూట్‌కున్న గుర్తింపు కాల పరిమితిపైనా దృష్టి పెట్టాలి. అదేవిధంగా ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులు చేరాలనుకుంటున్న ప్రోగ్రామ్‌కున్న అనుమతిని పరిశీలించాలి.

స్టాండర్ టెస్ట్ స్కోర్లు

విదేశాల్లోని ఇన్‌స్టిట్యూట్‌లు ప్రవేశాల కోసం జీఆర్ఈ, జీమ్యాట్, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్ తదితర టెస్ట్ స్కోర్లను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఇటీవల కాలంలో పలు విద్యాసంస్థలు టెస్ట్ స్కోర్ల నుంచి సడలింపు ఇస్తున్నాయి. దీంతో కొంతమంది విద్యార్థులు నిబంధనలు సరళీకృతంగా ఉన్న ఇన్‌స్టిట్యూట్స్‌వైపు దృష్టి సారిస్తున్నారు. కానీ.. వీసా మంజూరులో మాత్రం స్టాండర్డ్ టెస్ట్ స్కోర్లను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. సంబంధిత టెస్ట్‌ల్లో పొందిన స్కోర్లు తక్కువగా ఉంటే.. అందుకు కారణాలను అడుగుతున్నారు. టెస్ట్ స్కోర్ల ఆధారంగా వీసా మంజూరుపై నిర్ణయం తీసుకునే అధికారం వారికి ఉంటుంది. కాబట్టి స్టడీ అబ్రాడ్ అభ్యర్థులు సదరు టెస్టుల్లో మంచి స్కోర్ సాధించేలా కృషి చేయాలి.

కమ్యూనికేషన్ స్కిల్స్

వీసా ఇంటర్వ్యూ సమయంలో అడిగే ప్రశ్నలకు కొంతమంది విద్యార్థులు సరిగా సమాధానాలు ఇవ్వలేక తొట్రుపాటుకు గురవుతున్నారు. ఇది కూడా వీసా తిరస్కరణకు మరో కారణంగా నిలుస్తోంది. కాబట్టి అభ్యర్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, లాంగ్వేజ్ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. రిటెన్ స్కిల్స్‌కే పరిమితం కాకుండా.. స్పోకెన్ స్కిల్స్ పెంచుకునేందుకు కృషి చేయాలి.

భవిష్యత్ లక్ష్యాలేంటి

వీసా ఇంటర్వ్యూకు హాజరయ్యే విద్యార్థులు తమ భవిష్యత్తు లక్ష్యాలపై స్పష్టత పెంచుకోవాలి. కోర్సు పూర్తయ్యాక స్వదేశానికి తిరిగొస్తామని.. స్వదేశంలోనే స్థిరపడతామని చెప్పాలి. ఎందుకంటే.. ఏ దేశమైనా ఉద్యోగ కల్పనలో తమ యువతకు ప్రాధాన్యం ఇస్తోంది. అందుకే కోర్సు పూర్తయ్యాక కచ్చితంగా స్వదేశానికి తిరిగొస్తామనే రీతిలో సమాధానం ఇవ్వాలి. దీంతోపాటు సదరు విదేశీ ఇన్‌స్టిట్యూట్‌లో చేరడానికి గల కారణాలను మెప్పించేలా చెప్పాలి.

నకిలీ డాక్యుమెంట్లు

స్టడీ అబ్రాడ్ వీసా తిరస్కరణకు మరో ప్రధాన కారణం..నకిలీ డాక్యుమెంట్లు! ముఖ్యంగా ఆర్థిక వనరులకు సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్స్, స్పాన్సర్‌షిప్ లెటర్ల విషయంలో..కొంతమంది పొరపాట్లు చేస్తున్నారు. ఫీజులతోపాటు కనీసం ఒక ఏడాది కాలానికి ఖర్చులకు సరిపడే నిధులున్నట్లు రుజువు చేసే ఫైనాన్షియల్ డాక్యుమెంట్ల కోసం కన్సల్టెన్సీలపై ఆధారపడుతున్నారు.దీన్ని ఆసరాగా చేసుకొని పలు కన్సల్టెన్సీలు తప్పుడు డాక్యుమెంట్లతో విద్యార్థుల తరఫున దరఖాస్తు చేస్తున్నాయి. పర్యవసానంగా వీసా తిరస్కరణకు గురవుతోంది.

నిర్దేశిత నమూనా

విదేశీ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశం ఖరారు చేసుకున్న విద్యార్థులు.. నిర్దేశిత నమూనాలోనే వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. ఉదాహరణకు అమెరికా వీసా కోసం ఐ–20 ఫామ్‌గా పిలిచే అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్ ఆధారంగా దరఖాస్తు చేయాలి. అలాగే యూకే వీసా కోసం ఆయా ఇన్‌స్టిట్యూట్‌లు ఇచ్చే కన్ఫర్మేషన్ ఆఫ్ యాక్సప్టెన్స్ ఫర్ స్టడీస్(సీఏఎస్) ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి. అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్ నిర్దేశిత నమూనాలో లేకుంటే.. వీసా దరఖాస్తు తిరస్కరణకు గురవుతుంది.

వీలైనంత త్వరగా

- విదేశీ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం ఖరారు చేసుకున్న విద్యార్థులు..వీలైనంత త్వరగా వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్ చేతికందిన తర్వాత రెండు వారాల్లోపు వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. యూఎస్ వర్సిటీలో ప్రవేశం పొందిన వారు.. వీసా ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రక్రియను 20 రోజుల్లోపు పూర్తి చేయాలి.
- అప్లికేషన్ సెంటర్‌లో ప్రక్రియకు వెళ్లేముందు పాస్‌పోర్ట్, డిఎస్–160 కన్ఫర్మేషన్ పేజ్, అపాయింట్ కన్ఫర్మేషన్ పేజ్‌లతో వెళ్లాలి. అప్లికేషన్ సెంటర్‌లో ఇంటర్వ్యూ విజయవంతంగా ముగించుకుంటే వీసా ఇంటర్వ్యూకు హాజరు కావాలి.
- ఈ ఇంటర్వ్యూ సమయంలో ఒరిజినల్ సిటిజన్‌షిప్ పాస్‌పోర్ట్, అపాయింట్‌మెంట్ లెటర్, డిఎస్–160 కన్ఫర్మేషన్ లెటర్, ఈవీఐఎస్(స్టూడెంట్ ఎక్స్చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ రిపోర్ట్) రిసీప్ట్ (ఐ–901), ఐ–20లను దగ్గర ఉంచుకోవాలి.

సోషల్ మీడియాలో జాగ్రత్తగా

ఆయా దేశాలు విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా నెట్‌వర్కింగ్‌పైనా సునిశితంగా దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది కాలంలో అమెరికాలో దాదాపు మూడు వేల మంది విదేశీ విద్యార్థులను వారి సోషల్ మీడియా నెట్‌వర్కింగ్ ప్రొఫైల్, పోస్ట్‌ల కారణంగా వీసాలను తిరస్కరించారు. అదే విధంగా ఆస్ట్రేలియాలో గత మే నెలలో పలు యూనివర్సిటీల విదేశీ విద్యార్థుల కదలికలపై అనుమానంతో వీసాలను రద్దు చేశారు. కాబట్టి విదేశాల్లో అడుగుపెట్టిన విద్యార్థులు.. ఆ దేశానికి సంబంధించి వ్యతిరేక వ్యాఖ్యలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం సరికాదని గుర్తించాలి.

రీ-అప్లై.. ఇంటర్వ్యూ

వీసా తిరస్కరణకు గురైన విద్యార్థులకు.. మరోసారి దరఖాస్తు చేసుకోవడానికి దాదాపు అన్ని దేశాలు అవకాశం కల్పిస్తున్నాయి. రెండోసారి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఇంటర్వ్యూలో.. మొదటిసారి తిరస్కరణకు కారణాలపై ఇమిగ్రేషన్ అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నారు. కాబట్టి విద్యార్థులు సదరు లోపాలను సరిదిద్దుకున్న తర్వాతే రెండోసారి వీసాకు దరఖాస్తు చేసుకోవడం మేలు.

కన్సల్టెన్సీలతో అప్రమత్తంగా

ప్రస్తుతం విద్యార్థులు విదేశీ విద్య కోసం కన్సల్టెన్సీలపై ఆధారపడుతున్నారు. ఈ కన్సల్టెన్సీలను ఎంచుకునే ముందు.. వాటి ప్రామాణికత, ఆయా దేశాల్లోని యూనివర్సిటీల్లో సదరు కన్సల్టెన్సీలకు ఉన్న గుర్తింపును పరిశీలించాలి. కన్సల్టెన్సీ నిర్వాహకులు తమకు గుర్తింపు కల్పించాయని చెబుతున్న వర్సిటీలతో సంప్రదించి వివరాలు సేకరించాలి.

దేశాలు.. వీసా దరఖాస్తులు

- **అమెరికా:** యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్ ఇచ్చే ఐ–20 ఫామ్(అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్) ఆధారంగా వీసా కోసం దరఖాస్తు చేయాలి. తర్వాత దశలో ఆన్‌లైన్ విధానంలో యూఎస్ ఇమిగ్రేషన్ వెబ్‌సైట్‌లోని డిఎస్–160 వీసా అప్లికేషన్‌ను పూర్తి చేయాలి.
- **యూకే:** యూకేలో పీజీ, యూజీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు.. టయర్–4 జనరల్ కేటగిరీ వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. సదరు ఇన్‌స్టిట్యూట్ అందించే కన్ఫర్మేషన్ ఆఫ్ యాక్సప్టెన్స్ ఫర్ స్టడీస్(సీఏఎస్) ఫామ్ ఆధారంగానే చేయాలి.
- **కెనడా:** కెనడా స్టూడెంట్ వీసాకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్.. రెండు విధాలుగానూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోదల్చిన విద్యార్థులు www.cic.gc.ca ద్వారా ఆ ప్రక్రియ పూర్తి చేయాలి.
- **ఆస్ట్రేలియా:** ఆస్ట్రేలియాలో యూజీ, పీజీ, మాస్టర్ డిగ్రీ కోర్సుల విద్యార్థులు సబ్ క్లాస్ 500 వీసాకు దరఖాస్తు చేసుకోవాలి.
- **సింగపూర్:**సింగపూర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశం ఖరారు చేసుకున్న విద్యార్థులు.. వీసా కోసం ఆయా ఇన్‌స్టిట్యూట్‌లు ఇచ్చే ఈ–ఫార్మ్ 16 ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఫ్రాన్స్:** ఈ దేశంలో ఆరు నెలల కంటే ఎక్కువ వ్యవధిలో ఉండే కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు లాంగ్ స్టే వీసాకు దరఖాస్తు చేసుకోవాలి.

అధికారిక ఏజెన్సీలు

ప్రస్తుతం పలు దేశాలు తమ అధికారిక ఏజెన్సీల ద్వారా విదేశీ విద్యార్థులకు తోడ్పాటు అందిస్తున్నాయి. వీటి ద్వారా దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకుంటే.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా వీసా పొందే అవకాశం ఉంది. ఉదాహరణకు అమెరికాలో.. యూఎస్ఐఈఎఫ్ అధికారిక ఏజెన్సీగా గుర్తింపు పొందింది. అదే విధంగా యూకేలో బ్రిటిష్ కౌన్సిల్ పరిధిలోని యూకేఐఈఆర్ఐ వంటివి అధికారిక ఏజెన్సీలుగా సేవలందిస్తున్నాయి. ఇదే తరహాలో పలు దేశాలు తమ అధికారిక ఏజెన్సీల ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో విద్యార్థులకు యూనివర్సిటీలు, కోర్సులు మొదలు వీసా అప్లికేషన్ వరకు సహకారం అందిస్తున్నాయి.

ధ్రువీకరణ పత్రాలు

- సిటిజన్ పాస్‌పోర్ట్
- అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్
- ఆర్థిక వనరులకు సంబంధించిన రుజువులు
- ఎడ్యుకేషన్ లోన్ పొందితే సంబంధిత బ్యాంకు నుంచి అధీకృత రుజువు
- స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్
- ఎడ్యుకేషనల్ సర్టిఫికెట్స్
- మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్
- స్టాండర్డ్ టెస్ట్ స్కోర్స్ రిపోర్ట్స్.

సికింద్రాబాద్–వైజాగ్ మధ్య మరో వందేభారత్!?

- అత్యధిక ఆక్యుపెన్సీ రేషియోతో ఇటీవలే కేరళకు రెండో వందేభారత్
- తిరువనంతపురం–కాసర్‌గాడ్ మధ్య తొలిసారి రెండు వందేభారత్ రైళ్లు
- విశాఖ మార్గంలో కూడా స్థిరంగా గరిష్ట ఓఆర్ నమోదు
- దాంతో రెండో మినీ వందేభారత్‌కు అవకాశం ఉందంటున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: రెండో వందేభారత్ రైలు సాధించేందుకు సికింద్రాబాద్–విశాఖపట్నం మార్గం పోటీ పడుతోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాలను వందేభారత్‌తో జోడించేందుకు కేంద్రప్రభుత్వం వేగంగా వందేభారత్ రైళ్లను కేటాయిస్తోంది. ఒక మార్గానికి ఒకే రైలు పద్ధతిలో ఇప్పటి వరకు ఆ కేటాయింపులున్నాయి. అయితే తొలిసారిగా కేరళలోని తిరువనంతపురం–కాసర్‌గాడ్ మధ్య తాజాగా రెండో వందేభారత్ రైలును ప్రారంభించి ఆ పద్ధతిని బ్రేక్ చేసింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా నడుస్తున్న వందేభారత్ రైళ్లలో ఇది అత్యధిక ఆక్యుపెన్సీ (సగటున 177 శాతం) రేషియోతో కిక్కిరిసి నడుస్తూ, రైల్వేకు మంచి లాభాలు తెచ్చిపెడుతోంది. ఈ క్రమంలో అత్యధిక ఆక్యుపెన్సీ రేషియో ఉన్న మార్గాల జాబితాలో సికింద్రాబాద్– విశాఖపట్నం ముందు వరుసలో ఉండటంతో ఈ మార్గాన్ని కూడా రైల్వే శాఖ పరిశీలిస్తున్నట్టు సమాచారం.

అత్యధిక ఆక్యుపెన్సీ రేషియోతో: ఇటీవల దేశవ్యాప్తంగా తొమ్మిది వందేభారత్ రైళ్లను ప్రారంభించినప్పుడు కాసర్‌గాడ్–తిరువనంతపురం మధ్య రెండో వందేభారత్ రైలును పట్టాలెక్కించింది. తొలి వందేభారత్ తిరువనంతపురం, కొల్లాం జంక్షన్, కొట్టాయం, ఎర్నాకులం, త్రిసూర్, కోజికోడ్, కన్నూరు, కాసర్‌గాడ్ మార్గంలో తిరుగుతుండగా, రెండో వందేభారత్ కాసర్‌గాడ్, కన్నూరు, కోజికోడ్, తిరూర్, షారనూర్ జంక్షన్, త్రిసూర్, ఎర్నాకులం జంక్షన్, అల్లెప్పీ, కొల్లామ్ జంక్షన్, తిరువనంతపురం రూట్‌లో తిరుగుతోంది. ఇక సంక్రాంతి రోజున ప్రారంభమైన సికింద్రాబాద్–విశాఖపట్నం వందేభారత్ రైలు 120–130 శాతం ఓఆర్‌తో తిరుగుతోంది.

రెండోది గుంటూరు మీదుగా?

దేశంలో ప్రస్తుతం పరుగుపెడుతున్న వందే భారత్ రైళ్లలో ముంబై–గాంధీనగర్, ఢిల్లీ–వారణాసి, సికింద్రాబాద్–విశాఖపట్నం రైళ్లు గరిష్ట ఓఆర్‌తో తిరుగుతున్నాయి. వీటిల్లో విశాఖ రైలు ఆక్యుపెన్సీ రేషియో ఎక్కువ స్థిరంగా ఉంటోందని అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ మార్గంలో మరో మినీ వందేభారత్‌కు అవకాశం ఉందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు రైల్వేబోర్డు దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం వరంగల్ మీదుగా విశాఖ వందేభారత్ రైలు తిరుగుతోంది. గుంటూరు మీదుగా రెండోదాన్ని తిప్పొచ్చన్నది అధికారుల మాట.

నేడు 'లులు' మాల్ ప్రారంభం

ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్



మీడియాతో మాట్లాడుతున్న అష్రఫ్ అలీ. చిత్రంలో లులు కంపెనీ ప్రతినిధులు

కూకట్‌పల్లి: ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన షాపింగ్ మాల్ తెలంగాణలో మొట్టమొదటిసారిగా కూకట్‌పల్లిలో ఏర్పాటు చేస్తున్నట్లు 'లులు' గ్రూప్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అష్రఫ్ అలీ పేర్కొన్నారు. ఈ షాపింగ్ మాల్‌ను బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్ చొరవతో రూ.500 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయనున్న హైదరాబాద్ లులు మాల్‌ను మొదటి విడతలో రూ.300 కోట్లతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరో రూ.200 కోట్లతో అత్యాధునిక హంగులతో లులు మాల్‌ను తీర్చిదిద్దుతామని అష్రఫ్ అలీ తెలిపారు. ఈ మాల్ తెలంగాణ ప్రజలకు అంతర్జాతీయ షాపింగ్ అనుభవాన్ని అందిస్తుందని వివరించారు. భారతదేశంలో కొచ్చి, తిరువనంతపురం, బెంగళూరు, లక్నో కోయంబత్తూరులలో ఇప్పటికే లులు మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ మాల్‌లో అంతర్జాతీయ బ్రాండ్లతో కూడిన షాపింగ్ ఔట్‌లెట్లు, 1,400 మంది సీటింగ్ కెపాసిటీతో 5 స్క్రీన్స్‌తో సినిమా హాళ్లు, ఫుడ్ కోర్టు, పిల్లల వినోద కేంద్రం ఉంటాయని తెలిపారు. ఈ మాల్ ద్వారా 2 వేల మందికి పైగా సిబ్బందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. తాజా ఉత్పత్తులు, కిరాణా సామాగ్రి, ఫ్యాషన్, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్, సాంకేతిక, జీవనశైలి ఉత్పత్తుల కోసం లులు ఫ్యాషన్ స్టోర్, లులు కనెక్ట్ బ్రాండ్ పేర్లతో ప్రత్యేక విభాగాలను కలిగి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఆనంద్ ఏపీ. నిషద్ ఎంఎ, వి.నందకుమార్, షిబు ఫిలిప్స్, మేనేజర్ అబ్దుల్ ఖాదీర్, రెజిత్ రాధాకృష్ణన్, అబ్దుల్ సలీం, ఇ.అష్రఫ్, నౌషద్ కిజక్కుప్పరల్ తదితరులు పాల్గొన్నారు.

జరిమానా చెల్లించేందుకు కోర్టులోనే చోరీ

- కోర్టుకు రానందుకు రూ.30 వేలు జరిమానా
- ఆ డబ్బును చెల్లించేందుకు సీజ్ చేసిన గంజాయి అపహరణ
- సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడి అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి మూట

సంగారెడ్డి అర్బన్: కోర్టు విధించిన జరిమానా చెల్లించేందుకు అదే కోర్టులో గంజాయిని దొంగతనం చేసిన నిందితుడి నిర్వాకమిది. సంగారెడ్డి డీఎస్పీ రమేష్ కుమార్ కథనం మేరకు.. ఈ నెల 19వ తేదీన కోర్టు హాలులోని న్యాయమూర్తి చాంబర్‌లో ఓ కేసుకు సంబంధించిన గంజాయి సంచిని సీజ్ చేసి ఉంచారు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి గంజాయి సంచిని ఎత్తుకెళ్లారు. దీనిపై కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీ, షూ గుర్తుల ఆధారంగా నిందితుడు మగ్దూమ్‌నగర్‌కు చెందిన షేక్ మహబూబ్‌గా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడు ఇదివరకు ఒక దొంగతనం, యాక్సిడెంట్ కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. 14 ఏళ్లుగా స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఎవరైనా నిందితులకు బెయిల్ జామీను కావాలంటే డబ్బులు తీసుకొని పూచీకత్తు ఇస్తుంటాడు. అందులో భాగంగా సంగారెడ్డి టౌన్ పీఎస్ పరిధిలో జరిగిన ఓ ఏటీఎం దొంగతనం కేసులో నిందితులకు జామీను ఇచ్చాడు. అయితే వారు కోర్టుకు రానందున మహబూబ్ రూ.30వేలు కట్టాల్సి వచ్చింది. ఈ డబ్బు ఎలా కట్టాలో తెలియక కోర్టు హాలులో ఉన్న గంజాయి మూటను అమ్మి డబ్బు చేసుకోవాలని భావించి దొంగతనం చేశాడు. గంజాయి మూటను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.